సంపుటి : 78 సంచిక : 07 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు మార్గశిర శుద్ధ ఏకాదశి
వెల : ₹20/-
01-07 డిసెంబర్ 2025



## జాతి జాగృతికి

# ది జైపూర్ డైలాగ్స్




జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

@Jagriti Tv 78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక www.jagritiweekly.com

# భవ్యమందిరంపై ధర్మధ్వజం



ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రం అయోధ్యలో నవంబర్ 25న మరో అపురూప ఘట్టం ఆవిష్కృతమైంది. కాషాయవర్ణంలోని ధర్మధ్వజాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠించారు. శ్రీరాముని తేజస్సు, శౌర్యాన్ని సూచించేలా సూర్యుడు, కోవిదార్ చెట్టు (కశ్యపముని పారిజాత, మందార మొక్కలను కలవడం ద్వారా ఉద్భవించిన దేవకాంచన వృక్షం), ఓం చిహ్నం ఈ ధ్వజంపై రూపుదిద్దుకున్నాయి. ఈ పవిత్ర ధ్వజం రామరాజ్య ఆదర్శాలకు, సాంస్కృతిక వారసత్వానికి, ఐక్యతకు చిహ్నమని ప్రధాన మంత్రి కార్యాలయం విడుదలచేసిన ప్రకటన పేర్కొంది. ఈ వేడుకకు దాదాపు ఏడు వేల మంది ప్రత్యేక అతిథులు హాజరైనట్లు శ్రీరామజన్మభూమి ఆలయ ట్రస్ట్ పేర్కొంది. ఈ వేడుకను పురస్కరించుకొని సుమారు వంద టన్నుల పూలతో భవ్యమందిరాన్ని అలంకరించారు.









# సుప్రీంకోర్టు సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

నవంబర్ 24న సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తి-సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నవంబర్ 23న పదవీ విరమణ చేసిన సీజేఐ బీఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీజేఐ ఫిబ్రవరి 9, 2027వరకు పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ నిలిచారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, న్యాయశాఖామంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌తో పాటుగా తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల ప్రధాన న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం.

జస్టిస్ సూర్యకాంత్ ఫిబ్రవరి 10, 1962న హరియాణా రాష్ట్రం, హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లో మహర్షి దయానంద విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. జనవరి 9, 2004న పంజాబ్, హరియానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మే 24, 2019న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అనేక జాతీయ, అంతర్జాతీయ న్యాయసంస్థలకు సహకరించారు. వివిధ న్యాయ కమిటీలలో చురుకైన పాత్ర పోషించారు.

జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఒకరిగా ఉన్నారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటన సందర్భంగా భద్రతా లోపం తలెత్తింది. దీనిపై జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వంలో ఓ విచారణ కమిటీ ఏర్పాటుకు ఆయన ఆదేశించారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకానికి రాజ్యాంగ గుర్తింపును ఇస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించారు. మరో కేసులో అవమానకరమైన రీతిలో తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన పాడ్‌కాస్టర్ రణవీర్ ఇలాహాబాదియాను హెచ్చరించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ అంటే సామాజిక మర్యాదలను ఉల్లంఘించే హక్కు కాదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక మహిళా సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించడం చట్టవిరుద్ధమని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొంటూ, ఆమె పదవిని పునరుద్ధరించారు. మహిళలపై వివక్షను అంగీకరించలేమని ఆ కేసుకు సంబంధించిన తీర్పులో స్పష్టం చేశారు. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

దేశంలో అత్యధిక శాతం మందికి దైవంపై విశ్వాసంతో పాటు ఆలయాలలోని ప్రసాదాల పట్ల భక్తి భావం ఉంది. భగవన్నివేదిత పదార్థాన్ని 'మహా ప్రసాదం' అంటూ కళ్లకద్దుకొని ప్రీతితో స్వీకరిస్తారు. ఈ ప్రసాదాల తయారీ,రుచిలోనూ చాలా ప్రత్యేకతలు ఉంటాయి. ఆయా క్షేత్రాలలో కొలువైన దేవీదేవతల మహత్తో, వండే విధానమో కానీ అవి అమృతోపమానాలు. వాటి రుచిని బట్టి ఆస్తికులే కాదు... నాస్తికులు మధుర పదార్థంగానైనా స్వీకరణను కాదనలేరు. 'అశుచితో ఉన్నా, అనాచార్యుడైనా, మనసులో పాపపు ఆలోచనలు కలిగినవాడైనా లభ్యమైన ప్రసాదాన్ని స్వీకరించాలి (అశుచిర్వాప్యనాచారో మనసా పాపమాచరన్.... ప్రాప్తమాత్రేణ భోక్తవ్యం నాత్ర కార్యా విచారణా) అని ఆర్యోక్తి. 'ప్రసాదం' అంటే అనుగ్రహం అనీ అర్థం ఉంది. లౌకిక జీవితంలో పొందిన మేలును 'మహా ప్రసాదం'గా సంభావిస్తారు. పదార్థాలు ఏవైనా అవి భగవాన్ సన్నిధికి చేరి పవిత్ర మంత్రజలంతో ప్రోక్షించి ప్రత్యేక మంత్రాలతో అభిమంత్రించడంతో దైవ దృష్టిసోకి అది 'ప్రసాదం' అవుతుందని విశ్వాసం. దానిని స్వీకరించడం వల్ల మనో స్థయిర్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెబుతారు. ప్రసాదాన్ని విస్మరిస్తే, చులకనగా చూస్తే కలిగే పరిణామాలు ఎలా ఉంటాయో సత్యనారాయణస్వామి వ్రతకథలు వినిపిస్తాయి. ప్రసాదం పట్ల గల పవిత్రత, విశ్వాసాలకు అవి తార్కాణాలు.

**'పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి**
**తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః'** (మనసారా సమర్పించే ఆకు కాని, పువ్వు కాని, పండు కాని, నీటిని కాని ప్రీతితో స్వీకరిస్తాను) అన్నాడు గీతాచార్యుడు. అదే సమయంలో ఆలయాలలో ఇచ్చే ఏ పదార్థాన్నయినా 'మహా ప్రసాదం'గా స్వీకరించడం హిందూ సంప్రదాయం. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన వారు, ముఖ్యంగా పేదలు ఆకలితో అలమటించ కూడదన్న భావనతో తిరుమల తిరుపతి దేవస్థానం సుమారు నాలుగున్నర దశాబ్దాలుగా పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తూ, ప్రసాద వితరణ పథకాన్ని అమలు చేస్తోంది. దాదాపు అన్ని ప్రధాన ఆలయాలలో ఈ కార్యక్రమం అమలవుతోంది. అందుకు వివిధ సంస్థలు, సంపన్నుల

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు మార్గశిర శుద్ధ ఏకాదశి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం

**జాతి జాగృతికి**
**ది జైపూర్ డైలాగ్స్**

6లో

ధారావాహిక నవల

(12) **గణపతిదేవుడు**

– మత్తి భానుమూర్తి



20లో

ఆర్థికం

**సమాన పింఛనుకు పరిష్కారం**



26లో

# జాగృతి

## సంపాదకీయం

నుంచి సామాన్య భక్తుల వరకు శక్తి మేరకు విరాళాలను ఇస్తున్నారు. అయితే భక్తకోటి ప్రీతితో స్వీకరించే ప్రసాదం కొందరి వాచాలత్వంతో అభాసుపాలవు తోంది. తిరుమలలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామం అందుకు మరో ఉదాహరణ. తమను తాము కుబేరులుగా చెప్పుకుంటూ, హైదరాబాద్ కేంద్రం ఉన్న ఒక టీవీ ఛానల్ యాంకర్, ఆమె భర్త, స్నేహితుడితో శ్రీవారి దర్శనానికి వెళ్లారు. క్యూలైన్‌లో వేచి భక్తులతో పాటు ఆ ముగ్గురికీ 'శ్రీవారి సేవకులు' ప్రసాదం అందచేశారు. 'అతిసంపన్న(రిచ్చెస్ట్) బిచ్చగాళ్లం. ఖరీదైన (కాస్ట్లీ) ప్రసాదాన్ని అడుక్కుంటున్నాం. కుబేరులం... జీవితంలో ఎన్నడూ అడుక్కోలేదు.

# ప్రసాదంపై ప్రేలాపాలు

ఇదే మొదటి సారి (ఫస్ట్ టైం)' అన్న వారి లేకి మాటలు, వెకిలి నవ్వుల వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కెర్లు కొడుతోంది.'అడుక్కుంటే అడుక్కున్నాం కానీ ప్రసాదం రుచిగా ఉంది' అనీ ప్రశంసలు కురిపించారు (సదరు యాంకర్ తరువాత మన్నింపు కోరడం వేరే సంగతి). మన సంస్కృతీ సంప్రదాయాలను భాషను కాపాడుకునేందుకు ప్రజలు... ముఖ్యంగా యువత ముందుకు రావాలని మేధావులు, పెద్దలు ఒక పక్క పిలుపునిస్తుంటే.. ఆ యువత ప్రతినిధులనుకొనే వారి కురచ బుద్ధులను, రోత మాటలను ఏమనాలి? భగవత్ ప్రసాదాన్ని కించపరచడం అంటే ఆ పథకం దాతలను, అసలు ఆ వ్యవస్థనే అవమానించి నట్లుగా భావించాలి. ఆ 'ముగ్గురు' నోరు పారేసుకోవడమే శోచనీయం అయితే, క్యూలైన్‌లో ఉన్నప్పుడే వీడియో చిత్రీకరించడం తీవ్ర అభ్యంతరకరం, నిబంధనలకు విరుద్ధం. తిరుమలేశుని ఆలయ పరిసరాల్లో రాజకీయాలు మాట్లాడరాదని, రీల్స్ తీయరాదని నిబంధనలు విధించిన రాష్ట్ర ప్రభుత్వం, కొత్త పాలకమండలి –ఆ నిబంధనలు ఏ మేరకు అమలవుతున్నాయో సమీక్షించుకోవాలి.

ఈ సంఘటనే కాదు... హిందూ దేవీదేవతలను, దైవప్రసాదాన్ని దూషించడం, కించపరచడం ఇటీవల సంవత్సరాలలో ఎక్కువైంది. దేవుడు లేడనడం, ఆస్తికత్వంపై నమ్మకం లేకపోవడం, ప్రసాదాలను స్వీకరించక పోవడం వారి వ్యక్తిగత అభిప్రాయాలు. వాటిని కించపరచడమే అభ్యంతరకరం. కొందరు రాజకీయ నాయకుల నుంచి, ప్రముఖులు (సెలబ్రిటీస్), ఇతర సామాన్యులు, హిందూ దేవతలను లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. దైవం మీద నమ్మకం లేకపోవడం వ్యక్తిగత అభిప్రాయం కావచ్చు. అదే సమయంలో తమ వ్యాపార అవసరాల కోసం దైవ సంబంధిత అంశాలను ఉయోగించు కోవడం ఎంత వరకు సమంజసమో ఆలోచించుకోవాలి. 'మేం హిందువులం... హిందువులం అంటున్నారు. రాముడు మీకు చిన్నయ్యా? సీత మీకేమన్నా చిన్నమ్మనారా? లేకపోతే రాముడి వంశంలో పుట్టిన్రా మీరు?' అని తెలంగాణలో అధికార పక్ష నాయకుడు ఒకరు బహిరంగ వేదికపై చేసిన హేళన వీడియో సామాజిక మాధ్యమాలలో తిరుగుతోంది. రథాల దహనం, దేవతా విగ్రహాల విధ్వంసం గురించి ప్రస్తావించుకోవడం చర్విత చర్వణమే అవుతుంది.

ప్రచారం కోసమో, నోటిదురుసుతోనో చేసే ఇలాంటి కువ్యాఖ్యలను తేలికగా తీసుకుంటే మరికొందరికి అలుసు ఇచ్చినట్లవుతుంది. దేశాధినేతల నుంచి వివిధ రంగాల ప్రముఖులు భక్తిభావంతో చేసుకొనే దైవదర్శనాలను, ప్రీతి పాత్రంగా స్వీకరించే ప్రసాదాల గురించి ఇంత చులకనగా మాట్లాడే వారిపై చర్యలు ఉండవా? శ్రీవారిని దర్శించే న్యాయమూర్తులు, న్యాయవాదులు ఇలాంటి అంశాలను సుమోటోగా స్వీకరించలేరా? 'చిన్నపామునైనా పెద్దకర్రతో కొట్టాలి' అని సామెత. ఇలాంటి వాచాలత్వానికి, విపరీత ధోరణికి చుక్క పెట్టకపోతే ఆధ్మాతికవాదుల, ఆస్తికుల మనోభావాలకు విఘాతం కలుగుతుంది. ★

01 డిసెంబర్ 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**చింతచెట్టు**

**– వాడపల్లి పూర్ణ కామేశ్వరి**

**(తృతీయ బహుమతి కథ)**





| | | |
|---|---|---|
| దీదీ దాదాగిరిని మోదీ ఆపగలరా? (జాతీయం) | - | 12 |
| భూ వివాదంపై అధికార విపక్షాల సిగపట్లు (తెలంగాణ) | - | 14 |
| విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| హసీనా సాకుగా భారత్‌తో బాంగ్లా కయ్యం! (అంతర్జాతీయం) | - | 18 |
| త్యాగచరితా... రాగభరితా! (మహిళ) | - | 24 |
| చరిత్ర పుటలకెక్కని పృథు మహారాజు... (గళమెత్తిన గతం) | - | 30 |
| పతనం అంచున పాక్ ప్రజాస్వామ్యం! (అంతర్జాతీయం-1) | - | 32 |
| స్వామి వివేకానంద బాటలో ఆర్ఎస్ఎస్ (ఆర్ఎస్ఎస్-100) | - | 36 |
| లక్ష్యసాధనలో లక్ష్యసేన్ జోరు! (క్రీడ) | - | 43 |
| రీమేక్‌కు శుభం కార్డు పడబోతోందా!? (సినిమా) | - | 50 |




# జాతి జాగృతికి ది జైపూర్

వందల సంవత్సరాల పాటు వలస పాలనలో మగ్గిపోయి, అంతకుముందు తురుష్క ముష్కరుల దండయాత్రలతో, దురాక్రమణలతో, దుష్టపాలనతో తల్లడిల్లి పోయిన భరత జాతికి స్వరాజ్యం సిద్ధించిన తర్వాత పాలనా పగ్గాలు చేపట్టిన నాయకులు చేసిన నష్టం అంతా ఇంతా కాదు. అనాదిగా వస్తున్న గురు శిష్య పరంపరాగత విద్యావిధానాన్ని తుంగలో తొక్కారు. భరతమాత ముద్దు బిడ్డలకు ఉగ్గుపాలతో వలస విద్యావిధానాన్ని రంగరించారు. సంస్కృతీ, సంప్రదాయాలను ఛిన్నాభిన్నం చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు తలొగ్గి ముస్లింలకు గులాములైనారు. అల్పసంఖ్యాక వర్గీయుల కోసం అధిక సంఖ్యాక హిందువులను పూర్తిగా విస్మరించారు. హిందూ రాజుల ఘన కీర్తితో నిండిపోయిన చరిత్రను ముస్లింల పాదాక్రాంతం చేశారు. మొఘలాయి రాజులను నెత్తిన పెట్టుకున్నారు. వారిని వీరులు, ధీరులు అని పొగుడుతూ చరిత్రను వక్రీకరించారు. హిందూ రాజులను పరాజితులుగా చిత్రీకరించారు. వాటినే బడిలో పాఠాలుగా చేశారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే హిందువులను చరిత్రహీనులను చేశారు. కానీ ఇదంతా ఇప్పుడు గతమైపోయింది. అసలైన భారతీయ చరిత్రను దేశ ప్రజలకు అందించే ప్రయత్నాలు ఇటీవల కాలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ విషయంలో భావసారూప్యత కలిగిన వివిధ వృత్తి, వ్యాపకాల్లోని మేధావులు, వ్యక్తులు నడుం బిగించారు. దేశ ప్రజలను జాగృతపరిచే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. అలాంటి కార్యక్రమాల్లో ఒకటిగా నవంబర్‌లో జైపూర్‌లో జరిగిన ది జైపూర్ డైలాగ్స్ అందరి దృష్టిని ఆకర్షించింది.

మూడు రోజుల పాటు జరిగిన ఆ కార్యక్రమానికి డాక్టర్ సంకా ప్రసాద్ హాజరయ్యారు. అక్కడి విశేషాలను వివరంగా, విస్తారంగా అందించారు.

నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు జైపూర్‌లో నిర్వహించతలపెట్టిన ది జైపూర్ డైలాగ్స్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఒకరోజు ముందే అక్కడికి చేరుకున్నాను. సంజయ్ దీక్షిత్ ఈ కార్యక్రమ నిర్వాహకుడు. ఆయన ఐఏఎస్ అధికారిగా పనిచేసి చాలా కాలం క్రితమే పదవీ విరమణ చేశారు. ఏడవ తేదీ ఉదయం 10:00 గంటలకు కార్యక్రమ వేదిక వద్దకు చేరుకున్నప్పుడు, పాల్గొన్న వారి ముఖాల్లో చాలా అంకితభావం, నిబద్ధత కనిపించడం గొప్ప అనుభవం. వారిలో కొందరు తమ వృద్ధాప్యానికి ఆసరాగా వాకింగ్ స్టిక్‌లతో నడుస్తున్నారు. ప్రేక్షకుల కరతాళధ్వనులు వక్తలకు వారి మనసులోని మాటను చెప్పడానికి పూర్తిగా ప్రేరణ కలిగించాయి. సంజయ్ దీక్షిత్‌తో పాటు మీనాక్షి జైన్, గౌరవ్ ఆర్య, సుశాంత్ సరీన్, అభిజిత్ అయ్యర్, ఎస్తేర్ ధన్‌రాజ్, రాజీవ్ నారాయణన్, నీలేష్ ఓక్, భరత్ గుప్తా, గణేష్ తోర్సేకర్ వంటి ప్రముఖ వ్యక్తులు ఉన్నారు. జాతి ప్రయోజనానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చలు లేదా సంభాషణలు జరపడానికి 3 వేదికలు ఉన్నాయి. ఒక దశాబ్దం క్రితం ఈ రకమైన సాహసోపేతమైన చర్చలు సాధ్యం కాదు. కానీ జాతీయ స్పృహ ఇప్పుడు సంతృప్తి రాజకీయాలు, చరిత్ర రచనపై కథన దిద్దుబాటు, ఈ జాతీయవాద భావజాలం ప్రత్యర్థుల ఎదుట వాస్తవాలను నేరుగా ఉంచడం వంటి అంశాలను చర్చించేంత పరిణతి చెందింది.

## క్రమపద్ధతిలో వక్రీకరణకు గురైన చరిత్ర

స్వతంత్ర భారతదేశంలో చరిత్ర కథనం అసంబద్ధత గురించి ఆమెకు ఎలా అవగాహన వచ్చిందని అడిగినప్పుడు, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ అయిన మీనాక్షి జైన్ మాట్లాడుతూ, తాను యువ ఉపాధ్యాయురాలిగా ఉన్నప్పుడు, తన అధ్యయనం, అవగాహన ద్వారా తాను అర్థం చేసుకున్న చరిత్ర తన ఢిల్లీ విశ్వవిద్యాలయంలో బోధించేది కాదని తాను కనుగొన్నానని చెప్పారు. మొఘల్ పాలకులను లౌకిక పాలనకు ఆదర్శవాదులుగా చిత్రీకరించిన విధానాన్ని ఆమె ప్రశ్నించడం ప్రారంభించారు. వామపక్ష, కాంగ్రెస్ వాదులైన ప్రధాన స్రవంతి చరిత్రకారులు క్రూరమైన




# డైలాగ్స్

వాస్తవికతకు దూరంగా ఉన్న వారి భావజాలానికి అనుగుణంగా చరిత్రను పునర్నిర్మించడానికి ప్రయత్ని స్తున్నారని ఆమె అర్థం చేసుకున్నారు. ముస్లింలను సంతృప్తిపరచడం, హిందూ సమాజానికి గర్వ కారణాన్ని తిరస్కరించడం తప్ప మరేమీ కాదు అనే ప్యాకేజీలో చరిత్రను ప్రదర్శించడానికి వారు మొఘల్ పాలకులలో పాత్రలు, సంఘటనలు, లక్షణాలను ఎలా కనుగొన్నారు? అని ఆమె ప్రశ్నించారు. "చరిత్రను క్రమబద్ధంగా వక్రీకరించడం, నిజమైన చరిత్రను చంపడం, హిందువులు తమ గతం గురించి గర్వపడటానికి ఏమీ మిగలలేదు. ప్రతిదీ చాలా ఓటమివాద మనస్తత్వంలో ప్రదర్శితమైంది. భారతీయ పాఠకుడు తన గతం గురించి పూర్తిగా నిరాశ చెందుతాడు. క్షమాపణ కోరతాడు. దీనిని ఎవరైన ప్రశ్నిస్తే అలాంటివారిపై రైట్ వింగ్ లేదా మతతత్త్వవాది అనే ముద్రవేశారు. వారిని తిరస్కరించారు" అని ఆమె ఆరోపించారు. గత 30 సంవత్సరాలుగా ఆమె చేసిన అవిశ్రాంత ప్రయత్నాలు ఫలిస్తున్నాయని, గత 10 సంవత్సరాలుగా కథనాన్ని సరిదిద్దడంపై వాస్తవిక చర్చ జరుగుతోందని ఆమె తన ఆనందాన్ని, సంతృప్తిని వ్యక్తం చేశారు.

### భారతీయ మూలాలకు పునరాగమనం

ఎస్తేర్ ధన్‌రాజ్ తన క్రైస్తవ విశ్వాసాన్ని విడిచి పెట్టి తన భారతీయ మూలాలకు తిరిగి చేరుకున్నారు. ఆమె మతం మారిన క్రైస్తవ కుటుంబంలో పెరిగారని తెలుస్తోంది (సుబ్రహ్మణ్యస్వామి భారతదేశంలో అసలు క్రైస్తవ కుటుంబం లేదని, అందరూ మతం మారిన క్రైస్తవులే అని చెబుతారు). ఆమె థియోలజీని అధ్యయనం చేయడానికి పశ్చిమ దేశాలలోని ఒక సెమినరీకి వెళ్లారు. అక్కడ ఆమె వ్యవస్థలోని నమ్మకాలలోని అన్ని అసమానతలను, క్రీస్తు పేరుతో ప్రచారమవుతున్న పచ్చి అబద్ధాలను కనుగొన్నారు. వారు దానిని "భక్తిగల మోసం" అని పిలిచారు. ఆమె ఇప్పుడు పూర్తి హిందువుగా మారిపోయారు. ఆమె తన మూలాలకు తిరిగి చేరుకున్నట్లు చెప్పారు. వాస్తవానికి ఆమె "అన్‌బాప్టిజెడ్" అనే పుస్తకాన్ని రాశారు. దానిని నేను కొని చదువుతాను. ఆమె తన పుస్తకాన్ని "నేను జ్వాలగా మారడానికి కారణమైన దేదీప్యమైన మూలాలకు" అంకితం చేశారు.

మొత్తం మీద, ఈ సెషన్ భారతదేశపు నిజమైన చరిత్రను వెల్లడించడంలో లోపించిన విద్యాపరమైన నిజాయతీని గురించి చర్చించింది.

నిజానికి, నేను ఇటీవల మహాబలిపురం, చిదంబరం, తంజావూరు, గంగై కొండచోళపురం లను సందర్శించినప్పుడు, నాకు 60 ఏళ్లు దాటే వరకు ఈ చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించనందుకు నాకు అపరాధ భావన కలిగింది. దక్షిణ భారతదేశంలో శక్తిమంతమైన రాజ్యాలకు ఆతిథ్యం ఇచ్చిన ఈ ప్రదేశాలకు చాలా వైభవం, చరిత్ర ఉంది, ఇవి భారతదేశ ప్రధాన స్రవంతి చరిత్రలో ఎప్పుడూ భాగం కాలేదు. చరిత్ర ఎల్లప్పుడూ ఢిల్లీ కేంద్రంగా ఉంది. దక్షిణ భారత రాజ్యాలు మొదట పశ్చిమ దేశాలకు, గ్రీకు, రోమన్ సామ్రాజ్యాలకు, తూర్పున కంబోడియా, బాలి, ఇండోనేషియాకు సముద్ర మార్గంలో వ్యాపారం చేసిన విధానం, ఆ ప్రదేశాలలో


మీనాక్షి జైన్

హిందూ, బౌద్ధ సంస్కృతి ఇప్పటికీ విరాజిల్లు తుండటం అనేది వాటి వైభవానికి స్పష్టమైన సాక్ష్యం. భారతదేశ చరిత్ర కథనాన్ని సరిదిద్దడానికి ఇది ఒక స్పష్టమైన కారణంగా ఉంటుంది.

గతంలో ఘనతలు లేని వ్యక్తి వర్తమానంలో సంతోషంగా జీవించలేడు. తన కోసం గొప్ప భవిష్యత్తును నిర్మించుకోలేడు. అయితే ఇన్ని సంవత్సరాలు ఇలా ఎందుకు జరిగింది? ఎందుకంటే చాలా మంది హిందువులు అత్యంత ఆచారబద్ధంగా ఉంటారు. హిందుత్వం వెనుక ఉన్న తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించరు. తల్లిదండ్రులు దాని గురించి కనీస అవగాహన లేకుండా అదే ఆచారబద్ధమైన జీవనవిధానాన్ని పిల్లల్లో పెంపొందిస్తారు. అలాంటి పిల్లలు శుభ్రంగా తుడిచిన పలక లాంటి మనస్సుతో పాఠశాలకు లేదా సమాజంలోకి వెళతారు. అలాంటి వారిని ప్రభావితం చేయడం లేదా లోబరుచుకోవడం చాలా సులభం.

### దేశ విభజనకు గాంధీ కారణం!

ఆశ్చర్యకరంగా చర్చ గాంధీ వైపు మళ్లినప్పుడు, దేశ విభజనకు ఆయనే కారణమనే భావన వక్తలలో, హాజరైన వారిలో ప్రబలంగా ఉంది. తన తల్లి లేదా అతని కుటుంబానికి చెందిన పర్ణమి వర్గం నుండి గాంధీకి మత సామరస్యం భావన వారసత్వంగా వచ్చిందని భరత్ గుప్తా చెప్పారు. తన తల్లి పూజ గదిలో గీత, ఖురాన్ పక్కపక్కనే ఉంచుకునే వారని గాంధీ చెప్పారు. ఆయనలో ఈ కోణం గురించి నేను వివరణాత్మక అధ్యయనం చేయాలి.

అమెరికాకు చెందిన మరో ప్రొఫెసర్ తన అధ్యయనం గురించి మాట్లాడుతూ. బ్రిటిష్ భారత దేశ చరిత్ర రాసిన జేమ్స్ మిల్ ఒక్కరోజు కూడా భారతదేశాన్ని సందర్శించలేదని, బెంథం, జాన్ స్టూవర్ట్ మిల్ ప్రచారం చేసిన ప్రయోజనవాదం భారతదేశం ప్రవచించిన "బహుజన హితాయ బహుజన సుఖాయ" నుండి తీసుకున్నదని ఆయన అన్నారు.

యుటిలేరియనిజం అనే భావన ఇంగ్లాండ్, యూరప్‌లలో రాజకీయ తత్వశాస్త్రంగా అభివృద్ధి చెందగా, జేమ్స్ మిల్ చేసిన బ్రిటిష్ చరిత్ర కథనం భారతదేశ చరిత్రపై చాలా కాలం పాటు ఆధిపత్యం చెలాయించింది. చాలా మంది భారతదేశ చరిత్రపై

పాశ్చాత్యుల కథనానికి అనుకూలంగా ఉండటానికి ప్రయత్నించారు. ఆ క్రమంలో స్థానిక చరిత్రకారులు కూడా దానికి బలైపోయారు.

**2016లో ది జైపూర్ డైలాగ్స్‌కు అంకురార్పణ**

2016లో వామపక్షవాదులు, వోకిస్టులు ఆధిపత్యం చెలాయించిన ప్రసిద్ధ జైపూర్ సాహిత్య ఉత్సవానికి దీటుగా సంజయ్ దీక్షిత్ ది జైపూర్ డైలాగ్స్ ప్రారంభించారు. 2016లో భారతీయ జాతీయవాద కథనం, బహిరంగ మేధో చర్చను ప్రోత్సహించడంపై దృష్టి సారించడం ద్వారా ప్రారంభమైన ఈ కార్యక్రమం నేటికీ విజయవంతంగా కొనసాగుతోంది. ది జైపూర్ డైలాగ్స్‌కు చాలామంది జర్నలిస్టులు, రచయితలు, జాతీయవాదులు హాజరవుతున్నారు. పాల్గొనే వారందరూ చాలా ఉత్సాహంగా జాతీయవాద దృక్పథానికి కట్టుబడి ఉన్నారు. వక్తలు చాలా నిబద్ధత, భావోద్వేగంతో మాట్లాడే విధానం, ప్రేక్షకులు వెంటనే చప్పట్లు కొట్టి ప్రతిస్పందించడం, వక్తలకు ప్రశ్నలు పంపడం ఈ కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చాయి.

**నా ప్రాథమిక పరిశీలనలు ఈ విధంగా ఉన్నాయి**

1. రాజస్థాన్ సరిహద్దు రాష్ట్రం కావడం వల్ల భయంకరమైన ముస్లిం దండయాత్రలకు గురైంది. ఇక్కడి వారు దీని గురించి చాలా గట్టిగా మాట్లాడుతారు.

2. మొత్తం జనసమూహం చాలా సజాతీయంగా, జాతీయవాద రైట్ వింగ్‌గా ఉండవచ్చు కానీ వారందరికీ మోదీ, యోగి పట్ల చాలా ప్రేమ ఉంది. జాతీయవాద భావజాలానికి చాలా కట్టుబడి ఉన్నారు. అయితే, ఇది ఎప్పుడూ బీజేపీ సమావేశంలా కనిపించలేదు ఎందుకంటే రాష్ట్రాన్ని బీజేపీ పాలిస్తున్నప్పటికీ ఆ పార్టీ నాయకులను కార్యక్రమానికి ఆహ్వానించలేదు.

3. హిందీ భాషలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రెండూ చాలా జాతీయవాదంతో ఉన్నాయి. దాని గురించి చాలా గట్టిగా చెబుతున్నాయి. దక్షిణాదిలో మచ్చుకైనా కనిపించని విషయం. యోగి ఆదిత్యనాథ్‌ను తదుపరి ప్రధానమంత్రి అని చెప్పడానికి వారు ఏ మాత్రం బిడియపడరు.



ఎస్తేర్ ధన్‌రాజ్

4. నేను చూస్తున్నట్లుగా, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ హిందీ బెల్ట్ లేదా రాజస్థాన్, గుజరాత్, హరియాణా, యూపీ, బీహార్, ఉత్తరాది రాష్ట్రాలతో కూడిన ప్రాంతంలోని ప్రజల ఆదరణను తిరిగి పొందలేరు.

5. చాలా ఉన్నత హోదాల్లో, నిఘా సంస్థలలో, పోలీసు సంస్థలలో సైనిక సేవ నుండి పదవీ విరమణ చేసిన అధికారులు చాలా మంది ఉన్నారు. వారు చర్చలలో చురుకుగా పాల్గొన్నారు. ప్రజల అవగాహన కోసం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేస్తున్నారు.

**మైనార్టీల కోసమే నెహ్రూ ప్రభుత్వం**

ఆనంద్ రంగనాథన్ ఇక్కడి హీరోలలో ఒకరు. ఆయనకు గొప్ప అభిమానుల సంఖ్య, ప్రముఖ హోదా ఉంది. నెహ్రూ ప్రారంభించిన సోషలిస్ట్, లౌకిక సంక్షేమ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం నుండి మైనారిటీల ఓటు హక్కు కోసం, ఆ తరువాత మైనారిటీల కోసం యుద్ధం చేయడానికి ప్రారంభమైందని ఆనంద్ చెప్పారు. చరిత్ర, సంస్కృతి, పాలన ఏ విధంగా తయారైందంటే, మెజారిటీ జనాభా తమను తాము అసహ్యించుకునేలా, వారి చరిత్ర, సంస్కృతి పట్ల సందేహపడేలా ఉంది. ఏ ఒక్క భారతీయుడు కూడా తమ చరిత్ర, యుద్ధం లేదా ఆర్థిక వ్యవస్థ గురించి నమ్మకంగా ఉండలేదు. మైనారిటీలను బుజ్జగించే ప్రక్రియ, మెజారిటీ ప్రజలు తమకు గతంలో ఎలాంటి ఘనకీర్తి లేదని భావించే స్థాయికి చేరుకుంది.

**మసీదుల్లో సినిమాలు తీయగలరా?**

ఉదయ్ మహూర్కర్ సావర్కర్ గురించి మాట్లాడారు. సావర్కర్ దేశ అంతర్గత భద్రతకు ముప్పును ఎలా ఊహించుకున్నారో, దురదృష్టవశాత్తూ అది ఇప్పుడు వాస్తవంగా మారుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సావర్కర్ ను భారతదేశంలో అంతర్గత భద్రతకు పితామహుడు అని పిలవాలి అని పేర్కొన్నారు.

క్రైస్తవులకు విద్య నేర్పించే అధికారాన్ని, ముస్లింలకు వినోదాన్ని అందించే అధికారాన్ని వదులుకోవడం ద్వారా, మెజారిటీ హిందూ ప్రజలు దాని నుంచి వచ్చే చిక్కులను విస్మరించారు. ఇప్పుడు దాని పరిణామాలను అనుభవిస్తున్నారు. వినోదాత్మక అంశం ముఖ్యంగా సినిమా ప్రపంచాన్ని సూచిస్తుంది. ఇటీవల షోలే మూవీ గురించి మాట్లాడుతూ, హేమమాలిని, శివమందిరానికి వెళ్లి, శివుడు ఆమెతో మాట్లాడుతున్నట్లుగా ధర్మేంద్ర వెనుక నుండి మాట్లాడుతున్న




సన్నివేశాన్ని ఇప్పుడు రాయడానికి అనుమతించరని జావేద్ అక్తర్ చెప్పినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. వర్తమాన మత అసహనం గురించి తన అవగాహన గురించి జావేద్ ప్రస్తావిస్తుండగా, మసీదు ప్రాంగణంలో అలాంటి సన్నివేశాన్ని తిరిగి సృష్టించమని ఉదయ్ జావేద్‌ను సవాలు చేశారు. హిందీ సినిమాల్లో ముస్లింలను మంచివారిగా, విచక్షణ ఎరిగి మసలుకునే వారిగా చిత్రీకరించడం గురించి కూడా ఆయన మాట్లాడారు. యాంగ్రీ యంగ్ మన్ జానర్‌లో తీసిన అనేక సినిమాల్లో విలన్‌లకు ముస్లిం పేర్లు ఎప్పుడూ పెట్టలేదని అన్నారు.

ఉదయ్ మహూర్కర్ పాకిస్తాన్ గురించి మాట్లాడుతూ పాకిస్తాన్ సైన్యం దక్షిణాసియాలో శాంతిని కోరుకోవడం లేదని అన్నారు. ఆఫ్ఘనిస్తాన్ గురించి మాట్లాడుతూ, ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు గత 1000 లేదా 2000 సంవత్సరాలుగా పోరాట యోధులుగా ఉన్నారని, దేశంలో శాశ్వత శాంతి వారికి ఊహించలేమని అన్నారు. వాస్తవానికి ఇది వివిధ తెగల దేశం అయినప్పటికీ వారిలో ఎక్కువ మంది అరబ్బులు, ముస్లింలు. భౌగోళిక రాజకీయా లలో కూడా ఒక కొత్త నాటకం ఉంది, దీనిని అమెరికా. ముఖ్యంగా అక్కడి వోక్ ఆర్మీ ప్రోత్సహిస్తుంది. భారతదేశ పొరుగు ప్రాంతంలో పాలన మార్పులు నేటి హత్యల ద్వారా కాదు, బాంగ్లాదేశ్ నేపాల్, శ్రీలంకలో జరిగినట్లుగా నకిలీ, క్షణిక సామాజిక ఉద్యమాలను ప్రోత్సహించడం ద్వారా వస్తున్నాయి. ఇవి భారతదేశాన్ని చుట్టుముట్టడానికి సహాయపడతాయి.

రాహుల్ గాంధీ వంటి వారు జన్ జెడ్ అనే పదాన్ని పదే పదే ఉపయోగిస్తున్నప్పటికీ, భారతదేశంలో ఎలాంటి ప్రభావం కనిపించదు. ఎందుకంటే భారతదేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ఉంది. దేశంలో ప్రతీ రాష్ట్రం ప్రజాస్వామ్య




యుతంగా ఎన్నికైన వేర్వేరు ప్రభుత్వాన్ని కలిగి ఉంది. భారతదేశాన్ని చుట్టుముట్టడం గురించి మనం ఆలోచించినప్పుడు, బర్మాలోని పరిస్థితిని మనం గమనించాలి. మనం లోపలి బర్మా, బయటి బర్మాను విడిగా తీసుకుంటే, బయటి బర్మా పూర్తిగా ఈశాన్య భారతదేశంలోని చాలా ప్రాంతాలకు వ్యాపించిన క్రైస్తవ మిషనరీల నియంత్రణలో ఉంది.

వక్తలలో ఒకరు సోషల్ మీడియాలో కృత్రిమ మేధస్సు గురించి మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు దానికి అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా కంటెంట్‌ను చూపుతుందని అన్నారు. మనం నమూనాను మార్చుకుని, మనకు నిజంగా అవసర మైనది లేదా కోరుకునేది పొందవలసి వస్తే, మన వైపు నుండి సమాచారాన్ని ఎలా నింపాలో, సోషల్ మీడియాలో సమాచారం కోసం మన అభ్యర్థనను ఎలా రూపొందించాలో మనం అర్థం చేసుకోవాలి. సోషల్ మీడియా యుద్ధం అనేది అవగాహనల యుద్ధం.

ఇది కేవలం వ్యూహాత్మక సహనం మాత్రమే కాదు, దేశాన్ని రక్షించడంలో మన వ్యూహంలో భాగం. ధైర్యం కలిగిన దేశం మాత్రమే ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా పురోగమించగలదు. సైనిక బలం మాత్రమే సరిపోదు. అమెరికా వియత్నాం, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ లేదా ఇరాన్‌లలో జోక్యం చేసుకున్న ప్రతిచోటా తన సైనిక శక్తితో గెలవలేకపోయింది.

రాజ్ వేదం మరొక మంచి వక్త. నాకు కూడా ఆయనంటే ఇష్టం. భారతీయ జ్ఞాన వ్యవస్థలు, వివిధ పురాతన భారతీయ సిద్ధాంతాల శాస్త్రీయ ప్రాతి పదికపై ఆయన చేసిన ప్రసంగాలు, ప్రదర్శనలను నేను ఎక్కువగా చూశాను. వలసపాలకుల చరిత్ర రచన, మిషనరీ చరిత్ర రచన, మార్క్సిస్ట్ చరిత్ర రచనను వాస్తవాల నుండి దూరంగా ఉంచడం ద్వారా భారతదేశంలో చాలా గందరగోళాన్ని సృష్టించాయని ఆయన చెప్పారు. భారతదేశంలోనూ, ప్రపంచం లోనూ జ్ఞానసంబంధిత మీమాంస మహమ్మారిలా వ్యాపిస్తోందని అన్నారు.

సందీప్ రామకృష్ణన్ ఉపయోగించిన కమ్యూనిస్ట్ మతాధికారుల పదం నాకు చాలా ఆకర్షణీయంగా అనిపించింది. కమ్యూనిస్ట్ మతాధికారులు మత దురహంకారుల మాదిరిగానే చరిత్ర లేదా సంస్కృతి గురించిన గ్రంథాలను వ్రాస్తారు.

అభిజిత్ చావ్డా వోకిజం గురించి, అది సమా జాన్ని ఎలా అణువులుగా మారుస్తుందో గురించి మాట్లాడారు. ఆయన "వోక్ ఆర్మీ" అనే పుస్తకాన్ని సూచించారు. మనకు స్వంత ధార్మిక వ్యవస్థలు ఉన్నందున పాశ్చాత్య సామాజిక వ్యవస్థలు భారతదేశంలో వర్తించవని కూడా ఆయన అన్నారు. ధర్మం ఒక జీవన విధానం అయితే మతం అది కాకపోవచ్చు అని తెలిపారు.

కాంచన్ గుప్తా మాట్లాడుతూ, ప్రపంచీకరణకు గురైన ప్రపంచంలో భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ధార్మిక నాయకత్వం, ధార్మిక పాలన అవసరం గురించి మాట్లాడారు. రాజకీయ పాలన కాదు, ధార్మిక పాలన కావాలని అన్నారు.

### భ్రమల్లో జీవిస్తున్న రాహుల్ గాంధీ

షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ ప్రధాన స్రవంతి జాతీయవాదులు రాహుల్ గాంధీ చేస్తున్న పనులకు ఆయన్ను నిందించడానికి ప్రయత్నిస్తుండగా, వాస్తవం ఏమిటంటే ఆయన దేశాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్న చాలా ప్రమాద కరమైన అరాచకవాది అని విమర్శించారు. తనను వరుసగా ప్రధానమంత్రిగా ఎన్నుకున్నందుకు భారతీయ ఓటర్లకు మోదీ కృతజ్ఞతలు తెలుపు కోవచ్చు. ఆయన దానిని బహిరంగంగా క్రమం తప్పకుండా వ్యక్తపరుస్తారు. అదే రాహుల్ గాంధీ తనను ప్రధానమంత్రిగా ఎన్నుకోవడానికి దేశం తనపట్ల తగినంత కృతజ్ఞతతో ఉండాలని భావిస్తున్నారు. రాహుల్ తనకు వారసత్వంగా వచ్చినట్లు భావించే భ్రాంతికరమైన అర్హత అదేనని పూనావాలా వ్యాఖ్యానించారు.

### ఆసక్తికరంగా 3 రోజుల సెషన్లు

మొత్తం మీద ఈ 3 రోజుల సెషన్లు ఎప్పుడూ విసుగు పుట్టించలేదు. మేము కళాశాల విద్యార్థుల మాదిరిగానే ఉదయం 10 నుండి 7 గంటల వరకు హాజరయ్యాం. వక్తలు ఆసక్తికరమైన అంశాలపై మాట్లాడారు. సభికులు చురుగ్గా ఉన్నారు.

విష్ణు శంకర్ జైన్, ఆనంద్ రంగనాథన్ మధ్య జరిగిన చర్చను కూడా నేను ఆస్వాదించాను. ఆనంద్ చర్చా నైపుణ్యాలు చాలా ఉన్నత స్థాయిలో ఉన్నాయి. అయితే ఢిల్లీలోని ఈ ప్రస్తుత ప్రభుత్వం రామాలయం నిర్మాణంలో లేదా ఇతర అంశాలలో హిందువులకు అనుకూలంగా ఏమీ చేయలేదని ఆనంద్ వాదించారు




సంజయ్ దీక్షిత్

(ప్రభుత్వం కోర్టు తీర్పులను, రాజ్యాంగాన్ని అమలు చేసింది తప్ప హిందువులకు చేసిందేమీ లేదని ఆయన తేల్చి చెప్పారు). ఇందుకు ప్రతిగా మోదీ (ప్రధానమంత్రి) అక్కడ ఉండటం వల్లే ఈ పనులు వేగవంతం అయ్యాయని జైన్ వాదించారు.

విడిపోయిన సోదరులు షెహజాద్ పూనవాలా, తహ్సీన్ పూనవాలా మధ్య జరిగిన ఉగ్రమైన చర్చను కూడా నేను ఆస్వాదించాను. వారిద్దరూ మంచి అధ్యయనం చేసి మరీ వచ్చారు.

అభిషేక్ తివారీ రెండు చర్చల్లోనూ అద్భుతమైన మోడరేటర్‌గా వ్యవహరించారు.

చివరగా, రచయిత్రి ఈస్టర్ ధన్ రాజ్ "అన్ బాప్టిజం" పుస్తకంపై ఆమె సంతకాన్ని తీసుకున్నాము. ఆమె క్రైస్తవ మతాన్ని విడిచిపెట్టి తన మూలాలకు తిరిగి రావడం, అనంతరం హిందూత్వకు గొప్ప ప్రవచనకర్తగా మారడం గురించి ప్రస్తావించిన ఆ పుస్తకం చాలా ఆసక్తికరంగా ఉంది. ఆమె హుందా తనం ఉట్టిపడుతూ, ఎంతో మర్యాదగా ప్రవర్తించ డాన్ని నేను గమనించాను. నవంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జైపూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన ది జైపూర్ డైలాగ్స్ సమకాలీన అంశాలను స్పృశిస్తూ, జాతీయవాదం ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ వినోదాన్ని మేళవించిన ఒక ఆసక్తిదాయకమైన, ఆలోచన రేకెత్తించే కార్యక్రమంగా జరిగింది.



డా. సంకా ప్రసాద్
9948838599

# నిస్వార్థ సంపాదకుడు బుద్ధవరపు




స్వతంత్ర భారతదేశ తొలి పత్రికా సంపాదకులలో ఒకరైన బుద్ధవరపు వేంకటరత్నం సమాజం కోసం నిరంతరం సేవలు అందించి, నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలిచిన చిరస్మరణీయులు అని పలువురు శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవక్‌గా ఉంటూ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయన, ఆర్‌ఎస్‌ఎస్ ఆశయాలప్రచారం కోసం ఏర్పాటైన జాగృతి వారపత్రికకు 23 ఏళ్ల వయసులోనే వ్యవస్థాపక సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించి, దానిని తీర్చిదిద్దారని నివాళులు అర్పించారు. హైదరాబాద్ 'జాగృతి' భవనంలో నవంబర్ 21 తేదీన ఏర్పాటైన బుద్ధవరపు సంస్మరణ సభలో పలువురు, ఆయన ఆయన వ్యక్తిత్వాన్ని, ప్రతిభా పాటవాలను, పత్రిక రంగానికి ఆయన సేవలను, ఆయనతో గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఆయనకు సాహిత్యం ప్రధాన అంశమే అయినా పత్రికా సంపాకదకుడిగా, ఔత్సాహికుడిగా అన్ని అంశాలపై ఆసక్తి పెంచుకున్నారని అన్నారు.

బుద్ధవరపు వేంకటరత్నం పాత్రికేయంలో దిట్ట అని, విలువలు పాటిస్తూ, జాతీయత ప్రధాన లక్ష్యంగా వృత్తిని కొనసాగించారు తప్ప ఎవరికి తలవంచలేదని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన 'జాగృతి' ప్రకాశన్ ట్రస్ట్ అధ్యక్షులు చిలకమారి సంజీవ అన్నారు. బుద్ధవరపు మంచి కథ, నవలా



రచయిత అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా సేవలు అందించిన ఆయన పూజ్య గురూజీ సూచనల మేరకు జాతీయ వారపత్రిక 'జాగృతి' వ్యవస్థాపక సంపాదకుడిగా వ్యవహరించారని తెలిపారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజపాయ్ లాంటి అఖిల భారత స్థాయి నాయకులు ఆంధ్రప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు వారి ఉపన్యాసాలను చక్కటి ధారణ, గంభీరస్వరంతో తెలుగులోకి అనువదించే వారన్నారు. ఆయన రాసిన పదుల కొద్దీ కథలు నాటి భారతి, ఆంధ్రపత్రిక లాంటి పత్రికలు ప్రచురించాయని, ఆయన చేసిన సమీక్షలు, విమర్శలు జాతీయతను ప్రస్ఫుటించేలా ఉండేవని అన్నారు. ఎన్నో దేశభక్తి గీతాలు రాశారని జీవితాంతం జాతీయత, దేశభక్తితో కూడిన జీవితం గడిపారు.

'జాగృతి' అసోసియేట్ ఎడిటర్ కె.దుర్గారెడ్డి మాట్లాడుతూ, పత్రిక 75 ఏళ్ల (2022) సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచిను పత్రిక పరివారంతో సహాయాన్ని అర్థించని వ్యక్తిత్వమని అన్నారు. 2003 ప్రాంతంలో సతీవియోగం కలిగి, మరోవంక రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయినప్పుడు మిత్రులం కలిసి చేయాలన్న సహాయాన్ని మృదువుగా తిరస్కరించారని గుర్తు చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సంవత్సరంలో శతాయుష్షుతో జీవితాన్ని చాలించిన వేంకటరత్నం నిస్వార్థ పాత్రికేయ ప్రముఖులని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ సంవత్సరంలోనే పుట్టి, పదిహేనేళ్ల వయసులో (1940) సంస్థలో చేరి తరువాత నాలుగేళ్లకు (1944) ప్రచారక్‌గా, మరో నాలుగేళ్ల (1948)కు 'జాగృతి' జాతీయ వార పత్రిక వ్యవస్థాపక సంపాదకుడిగా ఎదిగారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆశయాలు వ్యాప్తి కోసం ఏర్పడిన ఈ పత్రికకు పూజ్య గురూజీ ఆదేశాలపై సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించారు. గురూజీ ప్రేమాభిమానాలు పింఛన్ సహా నివాస స్థలం కానీ తీసుకోని అరుదైన వ్యక్తిత్వం కలవారు అని అన్నారు. ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి కావాలన్నారు.

బుద్ధవరపు వారి ఆత్మీయులు పున్నారావు, ఆయనతో గల అనుబంధాన్ని పంచుకుంటూ... వారి చివరి దశాబ్దంలో వారితో సన్నిహితంగా మెలిగే అదృష్టం కలిగిందని తెలిపారు. వారు తనతో అనేక అనుభూతులు పంచుకొనేవారని, ముఖ్యంగా... పూజ్య గురూజీతో గల సాన్నిహిత్యం,వారు తమ పట్ల కనబరిచిన వాత్సల్యం గురించి మురిపెంగా వివరించేవారని చెప్పారు. గురూజీ మద్రాసు నుంచి విజయవాడ వస్తుండగా, కృష్ణా వరదల కారణంగా రైలు కృష్ణా కెనాల్ స్టేషన్‌లో నిలిచిపోవడం, వారి కోసం టీ తీసుకొని వేంకటరత్నం రైలు వంతెనపై నది దాటి వెళ్లడాన్ని (అప్పటికి ప్రకాశం బ్యారేజీ నిర్మాణం కాలేదు)ఉదాహరణగా చెబుతూ, అది గురూజీ పట్ల ఆయనకు గల భక్తి భావమని



ప్రసంగిస్తున్న చిలుకమారి సంజీవ, కె. దుర్గారెడ్డి, వడ్డి విజయసారథి, కాచం రమేష్, పున్నారావు, అరుణకుమారి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

కలిసి బుద్ధవరపుగారికి అందించే అవకాశం, అదృష్టం కలిగిందని, ఆ తరువాత మరి కొన్నిసార్లు కలిసినప్పుడు, పత్రిక గురించి అనేక విశేషాలు తెలియచెప్పారన్నారు. అంత వృద్ధాప్యంలో కూడా వారి జ్ఞాపకశక్తి అమోఘం. పత్రికకు 'నేను కేవలం శరీరాన్నయితే, భండారు సదాశివరావు గారు ఆత్మ' అనే నిరహంకార భావన వేంకటరత్నంగారిలో దర్శించామని అన్నారు.

జాగృతి పూర్వ సంపాదకులు వడ్డి విజయసారథి మాట్లాడుతూ, వేంకటరత్నం ప్రచారం కోరని రచయిత, కవి అని అన్నారు. ఎన్నో రచనలు చేసినా తాను కర్తగా చెప్పుకునే వారు కాదని, అది సంఘ సంప్రదాయం కూడా కాదనేవారని తెలిపారు. ఆయన అభిమానవంతుడని, ఎవరి నుంచీ ఎన్నడూ ఉచిత పొందిన ఆయన వారి మార్గదర్శనంలో వ్యక్తిత్వాన్ని పండించుకున్నారని, వారిపై రచనలు చేశారని చెప్పారు. సమాజంలో ఆర్‌ఎస్‌ఎస్‌పై వ్యతిరేకత ఉన్న సమయంలో తన రచనల ద్వారా దానికి సమాధానం చెప్పారన్నారు. ప్రజా సంబంధాలను నిర్వహించడంలో బుద్ధవరపువారు దిట్ట అని, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో విభేదించే భోగరాజు పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణ వంటి వారితో పత్రికకు రచనలు చేయించారని, వారి గురించి ప్రచురించారని చెప్పారు. కాసు బ్రహ్మానందరెడ్డి లాంటి నాటి ముఖ్యమంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్నా, వాటిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోలేదని, స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రభుత్వ వివరించారు.



వేంకటరత్నం కుమార్తె అరుణకుమారి తమ జ్ఞాపకాలు పంచుకొంటూ, సయయపాలన, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడడం, నిర్భయత్వం, స్థితప్రజ్ఞత ఆయన ప్రత్యేకతలని గుర్తు చేసుకున్నారు. తమ తండ్రిగారిపై వారి గురువు రఘుపతి వేంకటరత్నం నాయుడి ప్రభావం ఎక్కువగా ఉండేదని చెప్పారు. నిత్యం ఏదో ఒకటి రాయడం అలవాటుగా ఉండేదని, దాదాపు పాతికేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయి (2001),నాలుక కూడా తెగి ఇంటికే పరిమితమైనా, రాజకీయ, సామాజిక అంశాల గురించి ముచ్చటించే వారని,తనను చూడవచ్చిన వారితో జ్ఞాపకాలు పంచుకొనేవారని చెప్పారు. వైకల్యానికి బాధపడలేదు... కాలు లేకపోయినా కలం ఆగలేదని తెలిపారు. ఆచార్య కసిరెడ్డి మాట్లాడుతూ, తాను వేంకటరత్నం అభిమానినని, ఆయన రాసిన గీతాలను (అప్పట్లో ఆయన రాశారని తెలియదు) విద్యార్థిగా అనేక సందర్భాలలో పాడానని తెలిపారు. భండారు సదాశివరావు గారి ద్వారా ఆయన గురించి ఎంతో తెలుసుకున్నానని చెప్పారు. ఆత్మ నిర్భరతతో జీవనం సాగించిన వ్యక్తి అని నివాళులు అర్పించారు.

– జాగృతి డెస్క్



# దీదీ దాదా మోదీ ఆప

**పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు కొద్ది నెలల దూరంలో ఉన్నాయి. బిహార్ శాసనసభ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ పశ్చిమ బెంగాల్ లో కూడా విజయం సాధించడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీని, ఆమె నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీని గద్దె దించడం ఖాయమని ఆ పార్టీలో బాగా నమ్మకం కుదిరినట్టు కనిపిస్తోంది. బిహార్ నుంచి గంగానది పశ్చిమ బెంగాల్ లోకి పారబోతోందని, మమతా బెనర్జీ పార్టీని తుడిచిపెట్టేస్తుందని బిహార్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయితే, మమతా బెనర్జీని, ఆమె పార్టీని గద్దె దించడం ఆషామాషీ వ్యవహారం కాదు. మాటలు చెప్పినంత తేలిక కాదు. బీజేపీకి ఎంతగా మందీ మార్బలం ఉన్నా బిహార్‌లో విజయం సాధించినంతగా పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధించడం తేలికేమీ కాదు. ఆ విషయం మోదీ, అమిత్ షా ద్వయానికి తెలియకపోలేదు.**

ప్రజలను భావోద్వేగపరంగా రెచ్చగొట్టడంలో మమతా బెనర్జీ ఘటికురాలు. రాష్ట్రంలో స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్)ను, అంటే ఓటర్ల జాబితా పునఃపరిశీలనను మమతా బెనర్జీ భావోద్వేగ పరంగానే ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ అంశాన్ని అడ్డం పెట్టుకుని ఆమె రాష్ట్రంలోని సుమారు 30 శాతం ముస్లింలను ఒకే తాటి మీద నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం కోటికి పైగా బాంగ్లాదేశ్, పాకిస్థాన్, మయన్మార్ శరణార్థులకు, రోహింగ్యాలకు ఆశ్రయం కల్పించిన మమతా బెనర్జీ ఈసారి ఎన్నికల్లో కూడా వారి సహాయ, సహకారాలతోనే ఎన్నికల్లో గెలవగలననే ధీమాతో ఉన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ నినాదం బిహార్‌లో విఫలం చెందడంతో దాన్నే మరో రూపంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రచారం చేయడానికి ఆమె ఇప్పటి నుంచే సర్వశక్తులూ కూడగడుతున్నారు.

**అడుగడుగునా అగ్నిపరీక్షలే!**

భౌగోళికంగా చూస్తే బిహార్ నుంచి బయలుదేరిన గంగానది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోకి ప్రవేశించే ముందు జార్ఖండ్‌లోకి ప్రవేశిస్తుంది. ఎంత శ్రమపడినప్పటికీ జార్ఖండ్‌లో హేమంత్ సోరేన్ నాయ కత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా మీద బీజేపీ విజయం సాధించలేకపోయిందన్న విషయం తెలిసిందే. అంతేకాదు, పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించిన తర్వాత గంగానది పద్మానదిగా మారిపోతుంది. ఆ పద్మానది పశ్చిమ బెంగాల్ నుంచి బాంగ్లాదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. బీజేపీకి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం తప్పకుండా ఒక అగ్నిపరీక్ష కానుంది. గత 2021 శాసనసభ ఎన్నికల్లోనూ, 2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లోనూ బీజేపీకి చేదు అనుభవాలు కలగడం విస్మరించలేని విషయం.



**జి.రాజశుక**
**సీనియర్ జర్నలిస్ట్**

రాష్ట్ర జనాభాలో 30 శాతం వరకూ ముస్లింలు ఉన్నారు. మొత్తం 294 శాసనసభ స్థానాల్లో వందకు పైగా స్థానాలు పూర్తిగా ముస్లింల ఇష్టానిష్టాలపై ఆధారపడి ఉన్నాయి. సహజంగానే రాష్ట్రంలోని ముస్లింలందరూ తృణమూల్ కాంగ్రెస్ వైపే ఉన్నారని ఇటీవలి గణాంకాల్లో కూడా వెల్లడైంది. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకమని, బీజేపీ అధికారంలోకి వచ్చే పక్షంలో బుల్‌డోజర్ రాజ్యం అవతరించడం ఖాయమని మమతా బెనర్జీ ఈ మధ్య కాలంలో ముస్లింల సమావేశాల్లో బాగా ఊదరగొడుతున్నారు. సి.ఏ.ఏ, ఎన్.ఆర్.సి, వక్ఫ్ బిల్లు, యూనిఫామ్ సివిల్ కోడ్ వంటి అంశాలను ఆమె పదే పదే ప్రస్తావిస్తున్నారు.

వీటికి తోడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గురించి కూడా ఆమె ముస్లింలలో భయాందోళనలు రేకెత్తిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా ముస్లిం శరణార్థులు, రోహింగ్యాల పేర్లను తొలగించడానికి ఆమె ససేమిరా అంగీకరించడం లేదు. ఓటర్ల జాబితా నుంచి లక్షలాది మంది బీజేపీ వ్యతిరేక ఓటర్లను తొలగిస్తున్నా రనే ప్రచారాన్ని ఆమె ఉధృతంగా కొనసాగిస్తున్నారు.

**రోహింగ్యాలే బలం**

బాంగ్లాదేశ్, పాకిస్థాన్, మయన్మార్‌ల నుంచి అక్రమ వలసదారులు దేశంలోకి ప్రవేశించడానికి అనుమతించడం, వారికి ఆధార్ కార్డులు తయారుచేసి ఇవ్వడం, వారికి ఓటర్ కార్డులు మంజూరు చేయడం, వారికి ప్రభుత్వ పథకాలను అమలు చేయడం వంటివన్నీ ఓట్ చోరీ కిందకే వస్తాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సామిక్ భట్టాచార్య విమర్శలు సాగిస్తున్నారు. ఇటువంటి పేర్లను తొలగించడం దేశ భద్రతరీత్యా అనివార్యమని కూడా ఆయన చెబుతున్నారు. ఇక మమతా బెనర్జీ తనను తాను దుర్గామాతగా కూడా పరిగణించుకుంటున్నారు. తాను ఢిల్లీ రాక్షసుల నుంచి పశ్చిమ బెంగాల్ ప్రజానీకాన్ని కాపాడుతున్నట్టు సభలు, సమావేశాల్లో ప్రకటించడం జరుగుతోంది. రాష్ట్రంలోని ముఖ్యమైన ఆలయాలను సందర్శిస్తూ, హిందువుల మనసులను గెలుచుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. పాలనకు నిలయంగా ఉన్న భద్రలోక్ కాంప్లెక్స్‌లోని హిందూ మేధావులు, లౌకికవాదులు, చరిత్రకారులు, పరిశోధకులు, వామపక్షవాదులు రాష్ట్రంలోని అధ్వాన పరిస్థితులను, ప్రభుత్వ వైఫల్యాలను ఏనాడూ విమర్శించిన పాపాన పోలేదు కానీ, బీజేపీ బూచిని చూపించి భయపెట్టే ప్రయత్నం మాత్రం చేస్తున్నారు. విచిత్రమేమిటంటే, భద్రలోక్



# గిరిని గలరా?

మేధావుల్లో అత్యధిక శాతం మంది కోల్‌కతా నగర దారుణ పరిస్థితులను భరించలేక, సహించలేక ఢిల్లీకి ఏనాడో తరలిపోవడం జరిగింది.

ఇటువంటి పరిస్థితుల్లో బీజేపీ చేయగలిగిందే మిటి? బడుగు వర్గాలు, ఎస్సీలు, గిరిజనులు తదితర వర్గాలను కూడగట్టుకోవడానికి బీజేపీ ప్రయత్నాలు సాగిస్తోంది. కానీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, వామపక్షాలు ఈ వర్గాల మీద పట్టుబిగించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ముస్లింలకు ప్రాధాన్యం, ప్రాభవం ఉన్న వంద స్థానాలు పోగా మిగిలిన 194 స్థానాల్లో కనీసం 150 స్థానాలను బీజేపీ చేజిక్కించుకుంటే తప్ప అధికారం చేపట్టే అవకాశం లేదు. కానీ, రాష్ట్రంలోని మిగిలిన అన్ని స్థానాల్లోనూ పోలింగ్ సమయంలో తృణమూల్ కాంగ్రెస్ దాదాలే రాజ్యమేలుతుంటారు.

విచిత్రమేమిటంటే, సుమారు 14 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ మమతా బెనర్జీ ఇంతవరకూ ముఖ్యమంత్రి పదవిలో స్థిరపడలేదు. ఆమె ఒక ప్రతిపక్ష నాయకురాలి మాదిరిగానే వ్యవహరిస్తుంటారు. పాలనా వ్యవహారాల కంటే ఆమె కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఏదో ఒక కారణం మీద విమర్శించడానికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు.

**దుష్ప్రచారాలకే ప్రాధాన్యం**

దేశంలో ఉపాధి హామీ పథకానికి, ప్రధాని ఆవాస్ యోజనకు, ఇతర కేంద్ర పథకాలకు అత్యధికంగా నిధులు పొందుతున్న రాష్ట్రం పశ్చిమ బెంగాలే అయినప్పటికీ, కేంద్రం తమ పట్ల సవతి తల్లి ప్రేమను చూపిస్తోందనే వాదనతోనే ఆమె పొద్దుపుచ్చుతుంటారు. ఓటర్లను శాశ్వతంగా అయోమయంలో, గందరగోళ స్థితిలో ఉంచడమే ఆమె ఉద్దేశం. రాష్ట్రాన్ని పాలిస్తున్నది ఢిల్లీయా, దీదీయా అన్న సందేహం కూడా ఓటర్లకు కలుగుతుంటుంది. అయితే, ప్రజలను అయోమయంలో పడేయడం, భావోద్వేగపరంగా రెచ్చగొట్టడం ఆమె వ్యూహంలో ప్రధాన భాగం. ఆమె ఉద్దేశంలో ఆమె ఒక పెద్ద పులి. ఒక వీరాంగన. ఢిల్లీ నుంచి కోల్‌కతా వచ్చే హిందుత్వ రాక్షసుల నుంచి తాను తమ రాష్ట్ర ప్రజలను కాపాడుతున్నట్టు ఆమె చెప్పుకుంటుంటారు. రాష్ట్రంలోకి 'బయటివారు ప్రవేశించి హిందీ-హిందుత్వ-హిందుస్థాన్‌లను బలవంతంగా రుద్దుతున్నారనే ఆమె వాదనను భద్రలోక్ మేధావులు కూడా అనేక విధాలుగా సమర్థిస్తుంటారు.

విశేషమేమిటంటే, బీజేపీని హిందుత్వ పార్టీగా అభివర్ణించి ముస్లింలనే కాక, హిందువులను కూడా అనేక రకాలుగా భయపెట్టే మమతా బెనర్జీ ఎన్నికలకు ముందు తప్పకుండా హిందుత్వవాదిగా మారి పోతారు. ప్రతి రోజూ ఏదో ఒక ఆలయాన్ని సందర్శిస్తారు. తాను రాష్ట్ర ప్రజల యోగ క్షేమాల కోసం ప్రార్థనలు చేశానని చెబుతుంటారు. అదే సమయంలో ఆమె నమాజ్ చేయడం కూడా జరుగుతుంటుంది. ఇక్కడ కమ్యూనిస్టులు 34 ఏళ్లకు పైగా రాజ్యమేలారు. ఈ రాష్ట్రం విప్లవకారులకు ప్రధాన కేంద్రంగా ఉండేది. అయినప్పటికీ, మత ప్రభావం, కుల ప్రభావం బాగా ఎక్కువగా ఉండేది ఈ రాష్ట్రంలోనే.

నిజానికి, తృణమూల్ కాంగ్రెస్ అనేక విధాలుగా కమ్యూనిస్టు భావజాలాన్ని పుణికి పుచ్చుకుంది. దాదా వ్యవస్థ, కండ బలం, భుజ బలం వంటివి మార్క్సిస్టు పార్టీ నుంచి సంక్రమించినవే. జెండా మాత్రమే మారింది. దీదీ దాదాగిరి ఏ స్థాయిలో ఉంటుందంటే, బీజేపీ ఏ గ్రామంలో అడుగుపెట్టినా, ఏ పట్టణంలో అడుగుపెట్టినా తృణమూల్ దాదాలతో తలపడాల్సిందే.

తాను బీజేపీ బాధితురాలినని, మోదీ-అమిత్ షాలు కలిసి తనను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ప్రచారం చేసుకుంటుంటారు. బీజేపీ అధికారంలోకి వస్తే పశ్చిమ బెంగాల్‌లో మాంసాహారాన్ని భుజించడానికి అవకాశం ఉండదని, ముఖ్యంగా చేపలు తినడానికి కూడా అవకాశం ఉండదని కూడా ఆమె ప్రచారం చేయడం ప్రారంభించారు. గంగానది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోకి ప్రవహించవచ్చు కానీ, ఆ నీటిని ఫరక్కా బ్యారేజ్ దగ్గర కంట్రోల్ చేసేది మాత్రం దీదీనే.

అయితే, తృణమూల్ కాంగ్రెస్ అంటే బిహార్‌లోని రాష్ట్రీయ జనతాదళ్ కాదని బీజేపీ వ్యూహకర్తలకు బాగా తెలుసు. ఇక్కడ తాము విజయం సాధించాలన్న పక్షంలో విభిన్న వ్యూహాన్ని అనుసరించాలన్న విషయం కూడా వారికి తెలుసు. ఓటర్ల జాబితాను సవరించిన తర్వాత మమతా బెనర్జీ బలమెంతో ఆమెకే కాక, తమకు కూడా అర్థమవుతుందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి మిగిలిన రాష్ట్రాల్లో మాదిరిగానే ఈ రాష్ట్రంలో కూడా బలం లేదు. శాసనసభ ఎన్నికల్లో తృణమూల్, బీజేపీల మధ్యనే పోటీ ఉండనుంది. ఈసారి మోదీ, అమిత్ షాలు తప్పకుండా చక్రం తిప్పే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు ఎంతో ధైర్యంగా ఉన్నాయి. ★



తెలంగాణలో భూముల పంచాయితీ నడుస్తోంది. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా పరిస్థితి తయారయ్యింది. నువ్వెందుకు అమ్ముకుంటున్నావ్? అంటే.. అప్పుడు నువ్వెందుకు అమ్ముకున్నావ్? అన్న రీతిలో ఆరోపణలు ప్రత్యారోపణల పర్వం సాగుతోంది. 'మేము మళ్లీ అధికారంలోకి వస్తే.. అమ్ముకోవడానికి భూములు వద్దా?' అన్నట్టుంది.. బీఆర్ఎస్ తీరు. ఇటు.. 'అప్పుడు మీరు చేయగా లేనిది.. ఇప్పుడు మేం చేస్తేనే ఎత్తి చూపుతారా చేస్తారా? అన్నట్లు కనిపిస్తోంది ప్రస్తుత అధికార పక్షం తీరు. 'మీరు చేస్తుంటే మేము చూస్తూ ఊరుకోబోం' అన్న బీఆర్ఎస్ హెచ్చరికలను, ఆరోపణలకు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఖండిస్తూ, వివరణ ఇచ్చుకోవడాన్ని బట్టి ఈ అంశం ఎంత ప్రాధాన్యమైనదో అర్థమవుతోంది.



# భూ వివాదంపై అధికా

రాష్ట్రంలో భూదందా వ్యవహారం రెండు రకాలుగా సాగుతోంది. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత.. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మొదలు పెట్టిన దానిని కాంగ్రెస్ ప్రభుత్వం మరోరకంగా అనుసరిస్తోంది. ఒకటి–ప్రభుత్వ భూముల వేలం కాగా, మరోటి, కంపెనీలకు తక్కువ ధరలకు సర్కారు భూములను కేటాయించడం. అయితే భూముల వేలం విషయంలో పెద్దగా విభేదాలు, వివాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు లేకపోయినప్పటికీ.. ప్రైవేటు, కార్పొరేట్, అంతర్జాతీయ కంపెనీలకు వాటిని అతి తక్కువ ధరలకు కేటాయించే అంశమే ఇప్పుడు వివాదాస్పదంగా తయారయ్యింది.

కాంగ్రెస్ ప్రభుత్వం భూముల అమ్మకాలు, లెక్కలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. రేవంత్‌ది ల్యాండ్ లూటింగ్ పాలసీ అని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక భూములను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేటు వ్యక్తులకు తెగనమ్ముతున్నారని, ముఖ్యమంత్రి పేరు 'అనుముల రేవంత్ రెడ్డి' కాదని, 'అమ్మకాల' రేవంత్‌రెడ్డి అని వ్యక్తిగత విమర్శలు చేశారు. రూ. 5 లక్షల కోట్ల విలువైన భూములను కేవలం రూ.5 వేల కోట్లకే ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. 'ఇది మీ అయ్య జాగీర్ కాదు.. బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు' అనీ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ కాదని.. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ 'లూటింగ్' పాలసీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నమ్మకాన్ని పెంచితే, కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకాన్ని పెంచిందని వ్యాఖ్యానించారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న 9వేల 292 ఎకరాల పారిశ్రామిక పార్కుల భూముల విలువ రూ. 5 లక్షల కోట్లు కాగా, వాటిని రూ. 5 వేల కోట్లకే ఎందుకు? ఎలా? కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న మతలబు ఏమిటని నిలదీశారు. ఈ అక్రమం రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ కంటే రెండు రెట్లు అధికమని తెలిపారు.

టీజీఐఐసీ రేటును పక్కనబెట్టి, భూమి ఎస్ఆర్‌వో రేటులో 30 శాతం కడితే చాలని ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'హైదరాబాద్‌లో ఎస్ఆర్‌వో ధరలు తక్కువగా ఉన్నాయని. త్వరలో పెంచుతామని ప్రకటనలు చేసిన రేవంత్ ప్రభుత్వం.. ఇప్పటి వరకు పెంచలేదు. పారిశ్రామిక వేత్తలకు ఒక విధానం, పేదలకు ఒక విధానమా? సవరించిన భూముల రేట్లు కేవలం పేదలకేనా? పేదవాడు కొన్న భూమికి ఎస్ఆర్‌వోపై 60 – 80 శాతం ఎల్ఆర్ఎస్ వసూలు చేసి, ఇప్పుడు పారిశ్రామిక భూములను 30 శాతానికే మల్టీపుల్ జోన్‌గా మారుస్తున్నారు.

పేదవాడికి ఒక న్యాయం.. పెద్దోడికి ఒక న్యాయం ఉంటుందా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. దేశంలో ఇంత పెద్ద అవినీతి వ్యవహారం మరొకటి లేదని, దీనిపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

ఇక, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు.. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పదేపదే చెబుతున్నవి కాకి లెక్కలే అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు ధ్వజమెత్తారు. ఈ డొల్లతనం సాక్షాత్తూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అక్టోబరు నివేదికలో బట్టబయలైందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అప్పులతో ఆస్తులు సృష్టిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్ సర్కారు అప్పుల సునామీతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నడిపిస్తోందని అన్నారు. 'బీఆర్ఎస్ సర్కారు పదేళ్ల రూ. 2లక్షల 80 వేల కోట్ల అప్పులతో కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి ఉత్పాదక ఆస్తులు సృష్టించిందని పార్లమెంటు వెల్లడించిన లెక్కలు చెతుతున్నాయి.

కాంగ్రెస్ 23 నెలల పాలనలో ఒక్క ప్రాజెక్టు నిర్మించకుండా, మౌలిక వసతులకు ఒక ఇటుక కూడా పేర్చకుండానే రూ. 2 లక్షల 30 వేల కోట్ల అప్పు చేశారు. వీటిని ఢిల్లీకి మూటలు మోయడానికే వీటిని ఉపయోగిస్తున్నారు 'అని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. రాష్ట్రాన్ని 'స్కాంగ్రెస్ ఏటీఎం'గా మార్చారని మండిపడ్డారు. ప్రతి నెలా రూ. 6 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్లు అప్పులపై వడ్డీలు కడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ పదే పదే చెబుతున్నారని, కాగ్ నివేదిక ప్రకారం చూస్తే ఈ ఏడాది ఏప్రిల్– అక్టోబరు మధ్య అప్పులపై రూ.16వేల 529 కోట్ల పైచిలుకు వడ్డీ చెల్లించిందని, అంటే నెలకు సగటున 2వేల 361 రూ. కోట్ల పైచిలుకు మాత్రమే వడ్డీ చెల్లింపులకు వినియోగిస్తు న్నారని అర్థమవుతోందన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా 7 నెలల్లో తెచ్చిన అప్పుల వివరాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. వడ్డీల పేరుతో పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్న రేవంత్ ప్రభుత్వం ఈ అప్పులన్నింటినీ తమ





# ర విపక్షాల సిగపట్లు

అనుచరులు, మధ్యవర్తులు, ఢిల్లీకి మూటలను పంపడానికే ఉపయోగిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

బీఆర్ఎస్ నేతల మాటల దాడికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందిస్తూ, అదంతా బీఆర్ఎస్ కుట్రలు అని మీడియాకు వివరించారు. దమ్ముంటే ఆ ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు. అంతేకాదు.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోల వెనుక ఉన్న రూ. లక్షల కోట్ల మతలబేంటి? అని ప్రశ్నించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీపై బీఆర్ఎస్ నేతలు చేసిన విమర్శలను మంత్రి తిప్పికొడుతూ, అబద్ధాలు ప్రచారం చేయడం కేటీఆర్, హరీశ్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య అని,తిమ్మిని బమ్మిని చేయడంలో వారిని మించినవారు మరొకరు లేరని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. వాళ్లు పదేపదే చేస్తున్న రూ. 5 లక్షల కోట్ల దుర్వినియోగం ఆరోపణలు పూర్తిగా నిరాధారం, అవాస్తవమని అన్నారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలని, లేదంటే ఈ ప్రచారం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నదని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 2023 ఆగస్టులో బీఆర్ఎస్ తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోలు 19, 20, 21 వెనుక ఉన్న రూ. లక్షల కోట్లు మతులబు గురించి ముందు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అజమాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట ఇండస్ట్రియల్ లీజ్ ల్యాండ్స్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలని చూశారని శ్రీధర్ బాబు ఆరోపించారు.

గత అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు.. ప్రభుత్వం నుంచి తీసుకున్న లీజు భూములకు ఫ్రీ హోల్డ్ హక్కులు ఇచ్చి 100 – 200 శాతం ఛార్జీలు విధించి వాళ్ల వసూలు చేద్దామనుకున్న రూ. లక్షల కోట్ల సంగతేంటని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు దక్కకుండా బీఆర్ఎస్ నేతలు అడ్డుకుంటున్నారని విమర్శించారు. వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వం 9వేల 292 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టిందని తమపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ప్రాంతం ఫ్రీ హోల్డ్ ప్రాపర్టీ 4వేల 740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని స్పష్టం చేశారు. మిగిలిన భూములు రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించామని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

రాష్ట్ర ఖజానాకు రూ. 4 వేల కోట్ల నుంచి రూ. 5 వేల కోట్ల రూపాయల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలు అవినీతి వ్యవహారాలు అలవాటైన బీఆర్ఎస్ నేతలకు మింగుడు పడటం లేదని శ్రీధర్ బాబు విమర్శించారు. గత ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వానికి పాల్పడిందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడి పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చూస్తూ పని చేస్తున్నామని అన్నారు. గ్లోబల్ సిటీ చేయాలని చేస్తున్న ఆలోచనలను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తుందని అన్నారు.

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ ఫార్మేషన్ పాలసీ వెనుక రూ. ఐదు లక్షల కోట్ల భూ అవినీతి జరిగిందని, ఈ వ్యవహారంలో రూ. 50 వేల కోట్లు ముఖ్యమంత్రి జేబులో వేసుకోవాలని చూస్తున్నారని తారక రామారావు ఆరోపించారు. దీనిపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవోనే తాము అనుసరిస్తున్నామని, తాము ఇంకా అలాంటి జీవోనే ఇవ్వలేదని స్పష్టత నిచ్చారు. మీరు జీవో ఇవ్వకుండానే బీఆర్ఎస్‌కు ఎలా వెళ్లిందని మీడియా ప్రశ్నించగా దాట వేశారు.

జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. ఓవైపు బీఆర్ఎస్ నేతల ఆరోపణలను తిప్పికొడుతూనే.. మరోవైపు.. అట్నుంచి కూడా నరుక్కొస్తోంది. ప్రభుత్వం నిర్ణయాలపై బీఆర్ఎస్‌కు సమాచారం ఇస్తున్న వాళ్లెవరు? సచివాలయంలో ఆర్డర్లు మాయం వెనుక ఉన్నవాళ్లెవరు? అనే అంశాలపై ఆరా తీయిస్తోంది. ఇంటెలిజెన్స్ అధికారులు ఈ అంశాలను నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమయ్యారని చెబుతున్నారు. సచివాలయంలో డ్రాఫ్ట్ దశలో ఉన్న ఆర్డర్లు మాయమవుతుండటం, అవి కాస్తా బీఆర్ఎస్ ఆఫీసుకు చేరుతుండటాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసు కుంటోంది. ఈ క్రమంలో సమగ్ర విచారణ ప్రారంభమైంది.

**హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ ఫార్మేషన్ పాలసీ వెనుక రూ. ఐదు లక్షల కోట్ల భూ అవినీతి జరిగిందని, ఈ వ్యవహారంలో రూ. 50 వేల కోట్లు ముఖ్యమంత్రి జేబులో వేసుకోవాలని చూస్తున్నారని తారక రామారావు ఆరోపించారు. దీనిపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవోనే తాము అనుసరిస్తున్నామని, తాము ఇంకా అలాంటి జీవోనే ఇవ్వలేదని స్పష్టత నిచ్చారు.**

**సుజాత గోపగోని**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**



# విశ్వప్రేమకు

**విశ్వప్రేమకు ప్రతిరూపం భగవాన్ సత్యసాయి బాబా అని, ఆయన చూపిన ప్రేమ,పాటించిన సేవాభావనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో జరిగిన సత్యసాయి జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌లతో కలిసి ప్రశాంతి నిలయంలో బాబా మహ సమాధిని దర్శించి పుష్పాంజలి ఘటించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సత్యసాయి స్మారక రూ.100 నాణేలు, పోస్టల్ స్టాంపులను ఆవిష్కరించారు.**

సేవే పరమ ధర్మమని మన నాగరికత చెప్పిందని, భక్తి, జ్ఞానం, కర్మ.. ఈ మూడు సేవలే భారతీయ నాగరికతకు మూలమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తి భూమిని, గొప్పతనాన్ని గౌరవిస్తూ 'ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు' అంటూ తెలుగు జాతి గొప్ప తనాన్ని, త్యాగరాజ కీర్తనలోని సారాంశాన్ని ప్రధాని గుర్తుచేశారు. పుట్టపర్తి వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో అడుగుపెట్టడం, ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకోవడం తనకు లభించిన అదృష్టంగా పేర్కొన్నారు. బాబా కేవలం ఒక వ్యక్తి కాదని, 'విశ్వ ప్రేమకు పతిరూపం' మని నివాళులు అర్పించారు. 'భారతీయ సనాతన ధర్మంలో 'సేవే పరమ ధర్మం' అని వేల ఏళ్లుగా మన రుషులు, మునులు చెప్పిన మాటలను సత్య సాయి బాబా అక్షరాలా ఆచరించి చూపారు. భక్తి, జ్ఞానం, కర్మ అనే మూడు మార్గాల ద్వారా మోక్షం పొందవచ్చని మన శాస్త్రాలు చెబుతుంటే, బాబా ఈ మూడింటినీ 'సేవ' అనే ఒకే ఒక్క మార్గంలోకి మలచి మానవాళికి సులభమైన దారిని చూపారు. ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినప్పటికీ, ఆయన రగిలించిన సేవా జ్యోతి, ఆయన బోధించిన ప్రేమతత్వం, ఆయన చేసిన దిశానిర్దేశం విశ్వ వ్యాప్తమై ఉన్నాయని, అవి యుగయుగాలకు తరగని ఆస్తి' అని ప్రధాని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ వంటి ప్రముఖులతో కలిసి వేదికను పంచుకోవడం, సత్యసాయి స్మారకార్థం రూ.100 నాణెం, పోస్టల్ స్టాంపులను ఆవిష్కరిం చడం.. బాబా సేవలను భారత ప్రభుత్వం అధికారి కంగా గుర్తించి గౌరవించడమేనని స్పష్టం చేశారు. ఈ పవిత్ర భూమికి ఒక మహత్తు ఉందని, ఇక్కడ గడిపే ప్రతి క్షణం మనసులో సేవా భావనను, దైవ చింతనను రెట్టింపు చేస్తుందని, బాబా చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ప్రధాని మోదీ భావోద్వేగంతో ప్రస్తావించారు.



**గ్రామీణాభివృద్ధి, జలయజ్ఞం - విద్యా విప్లవం**

భగవాన్ సత్యసాయి బాబా జీవితమంతా 'లవ్ ఆల్ – సర్వ్ ఆల్' (అందరినీ ప్రేమించు – అందరినీ సేవించు) అనే మూలసూత్రంపైనే నడిచిందని, కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించిన మహనీయుడని ప్రధాని మోదీ ప్రశంసిం చారు. ముఖ్యంగా గ్రామీణ భారతదేశం ఎదుర్కొం టున్న కష్టాలను బాబా తన గుండెలో పెట్టుకుని, ప్రభుత్వాలు కూడా చేయలేనంత గొప్ప స్థాయిలో మంచినీటి ప్రాజెక్టులను నిర్మించడం ఒక అద్భుతమని కొనియాడారు. నీరు, విద్య, వైద్యం అనేవి వ్యాపార వస్తువులు కాకూడదని, అవి మానవుని మౌలిక హక్కులని బాబా బలంగా విశ్వసించారని, అందుకే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని వేలాది కరవు పీడిత గ్రామాలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించి 'సత్యసాయి గంగ'ను పారించారని గుర్తుచేశారు. ఈ నీటి ప్రాజెక్టులు నేటికీ కోట్లాది ప్రజల దాహార్తిని తీరుస్తూ, వారికి జీవనా ధారంగా నిలుస్తున్నాయంటే బాబా దూరదృష్టి ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇక విద్యా రంగంలో బాబా సృష్టించిన విప్లవం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని పేర్కొన్నారు. పుట్టపర్తి మొదలు కొని వైట్ ఫీల్డ్, ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ద్వారా ఎల్.కే.జీ నుంచి పీ.జీ వరకు, పరిశోధనల వరకు పూర్తిగా ఉచితంగా, అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం సామాన్యమైన విషయం కాదని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పేద పిల్లలు, ఆదివాసీ బిడ్డలు బాబా విద్యాసంస్థల్లో చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదిగి, తమ కుటుంబాల తలరాతలను మార్చుకున్నారని, విద్యాదానం కంటే గొప్పదానం మరొకటి లేదని బాబా నమ్మిన సిద్ధాంతం వల్లే ఇది సాధ్యమైందని విశ్లేషించారు. ఈ విద్యా సంస్థలు కేవలం పుస్తక జ్ఞానాన్ని మాత్రమే కాకుండా, సంస్కారాన్ని, మానవీయ విలువలను నేర్పిస్తూ భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్నాయని మోదీ ప్రశంసించారు.

**ఆరోగ్య సంరక్షణలో నిస్వార్థ సేవ - నైతిక పునరుజ్జీవనం**

ఆరోగ్య రంగంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను వర్ణించడానికి మాటలు చాలవని, అది మానవ సేవా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయ మని ప్రధాని మోదీ అభివర్ణించారు. నేటి కార్పొరేట్ ప్రపంచంలో వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన తరుణంలో, పుట్టపర్తి, బెంగళూరు, నాందేడ్ వంటి చోట్ల బాబా స్థాపించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు పేదలకు ఆశాదీపాలుగా నిలుస్తున్నాయని అన్నారు. గుండె ఆపరేషన్లు, కిడ్నీ మార్పిడి, కంటి శస్త్ర చికిత్సల వంటి అత్యంత ఖరీదైన వైద్యాన్ని కూడా ఏ విధమైన రుసుం లేకుండా, పూర్తిగా ఉచితంగా అందించడం బాబా దివ్యత్వానికి నిదర్శనమని చెప్పారు. 'జీవితాన్ని రక్షించడం కన్నా గొప్ప సేవ లేదు' అనే బాబా మాటలే ఈ ఆసుపత్రుల నిర్మాణా నికి పునాది రాళ్లని, ఇక్కడ వైద్యం పొందిన లక్షలాది మంది పేదల ఆశీస్సులే ఈ సంస్థలను ముందుకు నడిపిస్తున్నాయని అన్నారు. కేవలం భౌతికమైన సేవలే కాకుండా, మనిషి ఆంతరంగిక పరివర్తనపై బాబా




# ప్రతిరూపం సత్యసాయి

చేసిన బోధనలు సమాజానికి అత్యవసరమని మోదీ గుర్తుచేశారు. “మనిషి మారితేనే ప్రపంచం మారుతుంది” అనే బాబా సిద్ధాంతం, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, ధర్మం, నిజాయతీ అనే నాలుగు స్తంభాలపై సమాజాన్ని నిర్మించాలనే ఆయన ఆశయం నేటి తరానికి ఆచరణీయమని చెప్పారు. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే సమాజం బాగుంటుందని, ప్రేమ, సహనం, త్యాగం వంటి గుణాలు ప్రతి ఇంటిలో వెల్లివిరియాలని బాబా కోరుకున్నారని, ఆయన పండుగలు, వేడుకల్లో ఇచ్చిన ప్రతి ప్రసంగం మానవతా విలువల పరిమళాలను వెదజల్లిందని, అందుకే దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు ఈ సిద్ధాంతాలకు ఆకర్షితులై సేవా మార్గంలో నడుస్తున్నారని ప్రధాని విశ్లేషించారు.

**సామాజిక బాధ్యత, మహిళా సాధికారత - వికసిత్ భారత్ లక్ష్యం:**

బాబా ప్రేరణతో ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రధాని ప్రస్తావిస్తూ, సామాజిక భద్రత, మహిళా సాధికారతలో సత్యసాయి ట్రస్ట్ పాత్రను ప్రత్యేకంగా అభినందించారు. ‘సుకన్య సమృద్ధి యోజన’ కింద వేలాది మంది పేద బాలికలకు ట్రస్ట్ ఆర్థిక సాయం అందించడం, ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమేనని అన్నారు. దేశవ్యాప్తంగా 4 కోట్ల సుకన్య సమృద్ధి ఖాతాల్లో రూ. 3.25 లక్షల కోట్ల నిధులు జమ కావడం వెనుక ప్రజల భాగస్వామ్యంతో పాటు, ఇటువంటి సేవా సంస్థల కృషి కూడా ఉందని గుర్తుచేశారు. గోమాతను పూజించడమే కాకుండా, పేదలకు జీవనోపాధి కల్పించేందుకు శ్రీసత్యసాయి ట్రస్ట్ వంద గిర్ జాతి ఆవులను పంపిణీ చేయడం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ లక్ష్యాలకు ఊపిరి పోస్తోందని అన్నారు. వారణాసిలో, రువాండాలో గిర్ ఆవుల పెంపకం ద్వారా వచ్చిన ఆర్థిక మార్పును ఉదహరిస్తూ, గోదానం అనేది ఆర్థిక స్వావలంబనకు ఒక మార్గమని వివరించారు. “వికసిత్ భారత్” లక్ష్యంతో దేశం ముందుకు వెళ్తున్న తరుణంలో, ప్రజలందరూ ‘వోకల్ ఫర్ లోకల్’ (స్థానిక ఉత్పత్తుల వినియోగం) మంత్రాన్ని పాటించాలని, తద్వారా ఆత్మనిర్భర్ భారత్ సాకారమవుతుందని పిలుపునిచ్చారు. చివరగా, బాబా చూపిన ప్రేమ, కరుణ, శాంతి, సేవా మార్గంలో ప్రతి పౌరుడు నడిస్తే, భారతదేశం విశ్వగురువుగా మారడం తథ్యమని, సత్యసాయి ప్రేరణతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, సేవలో తరించాలని ప్రధాని మోదీ ఈ శత జయంతి వేదికగా జాతికి ఉద్బోధించారు.

**సేవే బాబా మార్గం:చంద్రబాబు నాయుడు**

ఈ భూమిపై మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ సత్యసాయి బాబా అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనియాడారు. ‘లవ్ ఆల్– సర్వ్ ఆల్’ అనే బాబా సిద్ధాంతం విశ్వవ్యాప్తమైందని, మానవ సేవే మాధవ సేవగా ఆయన జీవించారని గుర్తుచేశారు. సత్యసాయి ట్రస్ట్ ద్వారా 102 విద్యా సంస్థలు, ఆసుపత్రుల ద్వారా ఉచిత సేవలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టడానికైనా సిద్ధపడ్డ బాబా సంకల్పం గొప్పదని, తద్వారా 1600 గ్రామాలకు తాగునీరు అందుతోందని చెప్పారు. బాబా స్ఫూర్తిని, సేవా మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని చంద్రబాబు పేర్కొన్నారు.

**బాబా కీర్తి విశ్వవ్యాప్తం:పవన్ కళ్యాణ్**

సత్యసాయి బాబా గొప్పతనం మనకంటే విదేశీయులకే బాగా తెలుసని, ఆయన కీర్తి విశ్వవ్యాప్తమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సింగపూర్‌లో, హాలీవుడ్‌లో బాబా పట్ల ఉన్న భక్తిని చూసి ఆశ్చర్యపోయానని, తన సోదరుడు చిరంజీవి కూడా బాబాను దర్శించుకున్నారని గుర్తుచేశారు. రాయలసీమ కరువును చూసి ప్రభుత్వాలు ఆలోచించకముందే సొంత నిధులతో బాబా తాగునీటి ప్రాజెక్టులు నిర్మించారని, ఇది నేటి ‘జల్ జీవన్ మిషన్’కు అంకురార్పణ అని కొనియాడారు. సచిన్ టెండూల్కర్ వంటి ఎందరో ప్రముఖులను, ఐఏఎస్‌లను బాబా సేవా మార్గంలో నడిపించారని, ఆ సేవా స్ఫూర్తిని తాము కొనసాగిస్తామని పవన్ స్పష్టం చేశారు.

**సేవలోనే దైవత్వం - నారా లోకేశ్**

ప్రశాంతి నిలయం శాంతికి చిరునామా అని, ఇక్కడ బాబా తనను ‘బంగారూ’ అని పిలిచిన అనుభూతి కలుగుతుందని మంత్రి లోకేశ్ అన్నారు. మనుషుల్లో ప్రేమ ఉన్నంతకాలం బాబా మన మధ్యే ఉంటారని, ‘ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న’ అనే ఆయన సూక్తి ఆచరణీయమని చెప్పారు. సత్యసాయి ఆసుపత్రులు లక్షలాది మందికి పునర్జన్మనిస్తున్నాయని, విద్యాసంస్థలు యువతలో నైతిక విలువలు పెంచుతున్నాయని ప్రశంసించారు. కులమతాలకు అతీతంగా సేవా మార్గంలో నడవడమే బాబాకు నిజమైన నివాళి అని, స్మారక నాణెం విడుదల చేసిన ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.

**నా విజయం బాబా ఆశీస్సులు: సచిన్**

తన చిన్నతనంలో అందరూ తనను ‘బాల సత్యసాయి’ అని పిలిచేవారని, బాబాతో తనకు దైవిక అనుబంధం ఉందని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గుర్తుచేసుకున్నారు. 1990లో బాబాను కలిసినప్పుడు అడగకముందే తన సందేహాలు తీర్చారని, 2011 ప్రపంచ కప్ సమయంలో తీవ్ర ఒత్తిడిలో ఉన్న తనకు బాబా పంపిన పుస్తకం ఆత్మవిశ్వాసాన్ని నింపిందని చెప్పారు. ఆ విజయానికి బాబా ఆశీస్సులే కారణమని, ఆయన బోధనలు తన మానసిక ఆరోగ్యాన్ని కాపాడాయని అన్నారు. బాబా మన వెంటే ఉన్నారనే భావన భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇస్తుందని సచిన్ ఉద్వేగంగా చెప్పారు.

**5డి లతో జీవన మార్గం:ఐశ్వర్యరాయ్**

బాబా భౌతికంగా లేకపోయినా ఆయన స్ఫూర్తి కోట్ల హృదయాల్లో ఉందని నటి ఐశ్వర్యరాయ్ అన్నారు. బాబా బోధించిన డిసిప్లిన్, డెడికేషన్, డివోషన్, డిటర్మినేషన్, డిస్క్రిమినేషన్ జీవన గమనానికి దిక్సూచి అని చెప్పారు. మానవ సేవే మాధవ సేవగా బాబా స్థాపించిన ఉచిత ఆసుపత్రులు, విద్యాసంస్థలు ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలే బాబా జీవితమని, ఆయన చూపిన కరుణ, సేవా మార్గం ప్రపంచానికి వరమని ఆమె అభివర్ణించారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

అస్థిరతకు మారుపేరైన బాంగ్లాదేశ్ తన అంతర్గత రాజకీయాలతో భారతదేశంపై తోక జాడించాలని చూస్తోంది. భారతదేశం భిక్షతో ఆవిర్భవించిన ఆ దేశం గతాన్ని మర్చిపోయి ఘర్షణ వైఖరి పంథాలో నడుస్తోంది. భారత్ పై కుట్రలు పన్నుతోంది. ఒకసారి మతం కోణంలో, మరోసారి మన వైరి దేశాలకు స్నేహం అందిస్తూ కాలుదువ్వుతోంది. ఈ సందర్భంగా "మిత్రులను మార్చుకోవచ్చు, కానీ పొరుగువారిని మార్చలేరు..." అని మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితులకు సరిగ్గా సరిపోతాయి. తమ దేశ అంతర్గత రాజకీయ పరిణామాల్లో భాగంగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భారతదేశంలో శరణార్థిగా ఉంటున్న ఉద్వాసనకు గురైన ఆ దేశ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా లక్ష్యంగా భారత్‌తో కయ్యానికి దిగాలని యత్నించడం ఆ దేశ పాలకుల మూర్ఖత్వానికి నిదర్శనం. భారతదేశంలో ఉంటున్న 78 ఏళ్ల షేక్ హసీనాకు అక్కడి కోర్టు మరణ శిక్ష విధించడంతో ఆ సాకుతో భారత్‌పై ఘర్షణ వైఖరి అవలంబిస్తున్నది.



# హసీనా సాకు
# భారత్‌తో బాం

బాంగ్లాదేశ్‌లో సైనిక ఆధిపత్యం, మతోన్మాదం సర్వసాధారణం. ఆ దేశంలో ఎవరు అధికారంలో ఉన్నా భారత్‌కు ప్రత్యేకంగా ఒరిగేదేమీ లేదు. ఆ దేశ పాలకులు ఎవరైనా వారి స్వప్రయోజనాల కోసం మన దేశంతో ఇష్టం లేకపోయినా స్నేహం నటిస్తారు. 1971లో బాంగ్లాదేశ్ ఆవిర్భావం అనంతరం ఆ దేశ తొలి ప్రధాని ముజిబుర్ రహ్మాన్ మొదలుకొని ఇప్పటి ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం సలహాదారుడు మహ్మద్ యూనస్ వరకు ఇదే పంథాను కొనసాగిస్తున్నారు. మిగతా పాలకులతో పోలిస్తే 1996లో పగ్గాలు చేపట్టిన షేక్ హసీనా భారత్‌తో ఘర్షణ వైఖరికి కొంత దూరంగా ఉన్నారు. దీంతో ఆ దేశ మతోన్మాద శక్తులకు ఆమె లక్ష్యంగా మారారు. హసీనా భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆక్రోశంతో పాకిస్తాన్ అక్కడి మతోన్మాద శక్తులను ప్రోత్సాహించేది. మరోవైపు చైనా కూడా మనకు వ్యతిరేకంగా ఆ దేశాన్ని ఎగదోసేందుకు ప్రయత్నిస్తోంది.

షేక్ హసీనాకు వ్యతిరేకంగా ఆ దేశంలో జరిగిన హింసాత్మక ఉద్యమంలో సుమారు 1400 మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. ఆమెను హత్య చేసేందుకు ముష్కరులు ఆమె నివాసంపై దాడి చేస్తున్న సమయంలో ఆమె త్రుటిలో తప్పించుకొని భారత్‌లో శరణు పొందారు. ఆగస్టు 5, 2024న పదవి నుండి వైదొలగిన నాటి నుండి మనదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. 2006లో నోబెల్ బహుమతి పొందిన ఆ దేశ ఆర్థికవేత్త మహ్మద్ యూనస్ సలహాదారుడిగా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. హసీనాను పదవి నుంచి తప్పించడంలో ఆ దేశ సైనిక అధికారులతో పాటు మతోన్మాదుల హస్తం ఉంది. ఈ శక్తులను పాకిస్తాన్ ప్రోత్సాహించింది. తెరవెనుక వీరందరికీ యూనస్ సంధానకర్తగా వ్యవహరించారు. త్వరలో ఎన్నికలు నిర్వహించి ప్రజాపాలన అందిస్తానని చెప్పిన యూనస్‌పై ఎన్నికలు నిర్వహించాలని ఆ దేశంలో ఒత్తిడి పెరగడంతో ఫిబ్రవరి, 2026లో ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హసీనాకు చెందిన అవామీలీగ్ పార్టీని ఎన్నికల్లో పాల్గొనకుండా చేయాలని చూస్తున్న బాంగ్లా పాలకులు భవిష్యత్‌లో ఆమె నుండి ఎలాంటి రాజకీయ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు మరణశిక్ష విధించారనే ప్రచారం ఉంది. మానవాళిపై హింసకు పాల్పడ్డారనే కారణంగా బాంగ్లాదేశ్‌లోని 'అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్' హసీనాకు నవంబర్ 17వ తేదీన మరణ శిక్ష విధించింది. ఆమెతోపాటు అప్పటి హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు కూడా ఇదే తరహా శిక్షపడింది. దీంతో శిక్ష అమలుకు ఆమెను తమకు అప్పగించాలని అక్కడ ప్రభుత్వం భారత ప్రభుత్వాన్ని కోరడంతో ఇరు దేశాల మధ్య దౌత్య ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి.

అధికారంలో కొనసాగాలన్నా ఏకైక లక్ష్యంతో హసీనా అనేక అవినీతి అవకతవకలకు పాల్పడడం, తమ వ్యతిరేకుల్ని జైలుపాలు చేయడం, ఉద్యమాలను అణిచివేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఆమెను తప్పించి అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం కూడా ఇదే బాటలో సాగుతోంది. ప్రభుత్వ సలహాదారుడిగా పగ్గాలన్నీ యూనస్ చేతిలో ఉన్నట్టు పైకి కనిపిస్తున్నా తెరవెనుక నిర్ణయాలన్నీ సైనికుల, మతతత్వవాదుల చేతిలోనే ఉన్నాయి. తాత్కాలిక ప్రభుత్వంలో హసీనాకు వ్యతిరేకంగా కఠినమైన తీర్పు వస్తుందనే ఊహాగానాలు జరిగాయి. ఆమె గైర్హాజరీలో చట్టాలను మార్చి హడావిడిగా ఐదు నెలల్లోనే కేసు విచారించి శిక్ష విధించారనే ఆరోపణలున్నాయి. పార్లమెంట్ ఆమోదం లేకుండా చట్టాలను సవరించారు. చివరికి ఆమె తరపున వాదించేందుకు న్యాయవాదులను కూడా అనుమతించలేదు. రాజకీయ సంబంధాలున్న వారిని న్యాయమూర్తులుగా నియమించారు. ప్రజా పాలన కోసం ఎన్నికలు నిర్వహించాలని దేశ వ్యాప్తంగా ఒత్తిడి పెరగడంతో ఇన్ని లోపా భూయిష్టమైన విధానాలతో వెలువరించిన ఈ తీర్పును కక్షసాధింపుతో కూడుకున్న రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆరోపిస్తూ ఆ దేశంలో అవామీ లీగ్ నేతృత్వంలో

అధికారంలో కొనసాగాలన్నా ఏకైక లక్ష్యంతో హసీనా అనేక అవినీతి అవకతవకలకు పాల్పడడం, తమ వ్యతిరేకుల్ని జైలుపాలు చేయడం, ఉద్యమాలను అణిచివేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఆమెను తప్పించి అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం కూడా ఇదే బాటలో సాగుతోంది. ప్రభుత్వ సలహాదారుడిగా పగ్గాలన్నీ యూనస్ చేతిలో ఉన్నట్టు పైకి కనిపిస్తున్నా తెరవెనుక నిర్ణయాలన్నీ సైనికుల, మతతత్వవాదుల చేతిలోనే ఉన్నాయి. తాత్కాలిక ప్రభుత్వంలో హసీనాకు వ్యతిరేకంగా కఠినమైన తీర్పు వస్తుందనే ఊహాగానాలు జరిగాయి. ఆమె గైర్హాజరీలో చట్టాలను మార్చి హడావుడిగా ఐదు నెలల్లోనే కేసు విచారించి శిక్ష విధించారనే ఆరోపణలున్నాయి.



# ంగా
# ంగ్లా కయ్యం!

నిరసనలు కూడా భారీగానే జరిగాయి. ఈ మరణ శిక్షపై అమ్నెస్టీ వంటి అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు నిరసనలు తెలియజేశాయి.

హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించిందనే అక్కసుతో బాంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువుల లక్ష్యంగా దాడులు జరిగినా అక్కడి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు హిందువులపై దాడులు జరుగుతున్నాయని, రక్షణ కల్పించాలని కోరినా ప్రభుత్వం స్పందించ లేదు. ఇదే సమయంలో యూనస్ ప్రభుత్వం చైనా సహకారంతో రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకుంటోంది. పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపర్చుకుంటూ ఆ దేశ సైనిక అధికారులతో సంప్రదింపులు జరిపి ఆ రెండు దేశాల మధ్య గూఢచర్య సమాచారాన్ని అందిపుచ్చుకుంటోంది. బాంగ్లాదేశ్ పాకిస్తాన్, చైనాలతో జతకట్టడం కచ్చితంగా భారతదేశానికి వ్యతిరేకంగా ప్రణాళికలు రూపొందించడమే. హసీనాకు భారత్ ఆశ్రయం కల్పిస్తుందని ఆగ్రహంగా ఉన్న ఆ దేశం ఇప్పుడు హసీనాను మరణ శిక్ష కోసం అప్పగించాలని పట్టుబడడంతో రెండు దేశాల మధ్య అంతరం మరింత పెరిగింది.

బాంగ్లాదేశ్ హసీనా అప్పగింత కోసం రాసిన ఇంటర్ పోల్ సాయాన్ని అభ్యర్థించాలని నిర్ణయించింది. రాజకీయ కోణంలోనే ఆమెపై చర్యలు తీసుకుంటున్నారనే ప్రచారం నేపథ్యంలో భారత్ ఆచితూచి అడుగులేస్తోంది. ఇరు దేశాల మధ్య ఖైదీల అప్పగింత ఒప్పందం ఉన్నా ఇవి రాజకీయ అభియోగాలు కాబట్టి మన దేశం పట్టించుకునే అవకాశాలు లేవు. ఆమెను అప్పగించాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ ఆ దేశంలో శాంతి భద్రతలు, ప్రజాస్వామ్యం, సుస్థిరత ఆశిస్తున్నట్టు తెలిపింది. అందుకోసం నిర్మాణాత్మక సంబంధాలు కొనసాగిస్తామని చెప్పింది. అయితే యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారతదేశంపై అంతర్జాతీయంగా ఒత్తిడి తేచ్చేందుకు ప్రయత్నిస్తుంది. “దేశం విడిచి పారిపోయి మరణశిక్ష ఎదుర్కొంటున్న హసీనాకు ఆశ్రయం కల్పించిన వారు ఆమె చేసిన నేరాలను సమర్థించినట్టే...” అని వాదిస్తోంది. అయితే దీనిపై దీటుగా స్పందిస్తూ “హసీనా పదవీచ్యుతురాలైనపుడు ఆమె ప్రధానమంత్రి బాధ్యతల్లో ఉన్నారు. ఆమె స్థానంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారిని మాత్రమే భారత్ గుర్తిస్తుంది..” అని కేంద్రం స్పష్టం చేసింది. ఒకవేళ ఫిబ్రవరిలో అక్కడ ఎన్నికలు జరిగితే అంతవరకు వేచి చూసే ధోరణిలో ఉంది. మరోవైపు దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను అప్పగించాలని మన దేశం కోరుతున్నా ఇంటర్‌పోల్ సహా అంతర్జాతీయ సంస్థల నుండి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పుడు హసీనా విషయంలో కూడా అదే తరహాలో స్పందన వచ్చే అవకాశం ఉంది.

ఆగస్టు, 2024లో మహ్మద్ యూనస్ ప్రధాన సలహాదారుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ చైనా, పాకిస్తాన్ దేశాలకు స్నేహ హస్తం అందించారు. ఇప్పుడు మరోసారి అదే పంథాలో హసీనా మరణశిక్షపై తీర్పును మనదేశానికి వ్యతిరేకంగా మార్చేందుకు ఆయన పూర్తిగా ప్రయత్నిస్తున్నారు. తమ దేశంలో విద్యార్థుల ఉద్యమానికి భారత్ వ్యతిరేకమని ప్రకటించారు. మైనార్టీలైన హిందువులపై దాడులను తప్పుడు ప్రచారం అంటూ సమర్థించుకున్నారు. చైనా ఎకనామిక్ కారిడార్ గురించి మాట్లాడుతూ ఈశాన్య భారత్ ప్రాంతాలను ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించారు. ఆర్థిక రంగంలో నోబెల్ అవార్డు పొందిన విద్యావేత్తగా ప్రచారం చేసుకునే యూనస్ మతోన్మాదంతో పాకిస్తాన్‌తో చేతులు కలపడమే కాకుండా భారత్ వ్యతిరేక శక్తులతో జట్టు కట్టారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో దశాబ్దకాలంగా మన దేశం ఆర్థిక, రక్షణ, సాంకేతిక రంగాలతో పాటు అన్నింట్లో పురోగతి సాధించి అగ్రదేశాలకు ధీటుగా మారుతోంది. దీంతో తమ ఆధిపత్యానికి భారత్ అడ్డువస్తుందనే అక్కసుతో అంతర్జాతీయ కుట్రలు ప్రారంభమయ్యాయి. సరిహద్దుల్లో నిత్యం ఘర్షణలతో ఉండే పాకిస్తాన్‌కు సమయం వచ్చినపుడల్లా బుద్ధి చెబుతున్న దశలో ఇతర చికాకులు కలిగించేందుకు బాంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వంటి దేశాలను మనదేశంపై ఎగదోసేందుకు చైనా, అమెరికా దేశాలు ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాయి. ఇందులో భాగంగా హసీనా అప్పగింతపై కూడ ఒత్తిడి తేవచ్చు. అయితే రాజకీయ కుట్రలున్న ఈ కేసులో ప్రజా ప్రభుత్వం కాకుండా తాత్కాలిక ప్రభుత్వంతో ఖైదీల మార్పిడి ఒప్పందాన్ని అమలు చేసేందుకు భారత్ ముందుకు రాకపోవచ్చు. అక్కడ ప్రజా ప్రభుత్వం ఏర్పడే వరకు వేచి చూసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈలోగా యూనిస్ నేతృత్వంలో ప్రభుత్వం అతిగా వ్యవహరిస్తే తగిన బుద్ధి చెప్పడానికి కూడా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదు.

**– శ్రీపాద**



ఆ అడిగినవారు బయ్యమాంబ. అతని కన్నతల్లి.

నవమాసాలు కడుపున మోసి కని అల్లారు ముద్దుగా పెంచుకున్న తల్లి మాత్రమే గణపతి లోలోన సతమతమౌతున్న భావనల వొత్తిడిని గుర్తించింది.

మరునాడు పెద్ద తల్లి, పెంచుకున్న తల్లి దన్నాలదేవి గణపతిని చాలా సేపు రెప్పవెయ్యకుండా చూసింది. అతన్ని దగ్గరకు తీసుకుంది. గుండెకు హత్తుకుంది. అప్పుడు ఏడ్చింది ఆమె. ప్రక్కన తల్లి చిన్నగా మౌనంగా రోదిస్తుండగా పెద్దమ్మ పెద్ద పెట్టున రోదించడం.. తల్లి పెద్దమ్మతో తను చెప్పింది పంచుకున్నదని గ్రహించాడు గణపతి.

వారిద్దరి మధ్య ఉన్న అపూర్వ అనుబంధం గణపతికి తెలుసు. అన్నదమ్ముల మధ్య కూడా లేనంతటి అన్యోన్యత ఆ తోడికోడళ్ల మధ్య ఉండటం అంతఃపురంలో అందరూ చెప్పుకునేవారు. ఆ సంగతి గుర్తొచ్చిన గణపతి ఆమె ఒడిలో కాస్త సేదదీరాడు. ముగ్గురూ ఒకరినొకరు గట్టిగా హత్తుకుని చాలాసేపు ఉండిపోయారు.



తల్లులిద్దరూ ప్రాథమికంగా కొడుకు దుఃఖాన్ని గుర్తించారు. కారణం తెలియక ఇద్దరూ దిగులుతో గందరగోళమైపోతున్నారని గుర్తించాడు గణపతి. అప్పుడు కవ్వల సంగతి చెప్పాడు. వివరంగా పూసగుచ్చినట్లు చెప్పాడు.

ముగ్గురూ ఒకరి కన్నీటిని మరొకరు తుడిచారు.

అక్కడ ఓ ఆడపిల్లతో స్నేహం కుదిరింది. ఇద్దరూ దగ్గరయ్యారు. ఒకరికొకరు నచ్చారు. సరే.. పరిస్థితులు దగ్గరకు చేర్చాయి. ఇవన్నీ సహజమే. కానీ కాని ఆమెను ఎవరు హత్య చేశారు? ఎందుకు చేశారు??

ఆ రాత్రి కాకతీయయోధులు మెరుపుదాడి నిర్వహించడం ఆ తోడికోడళ్లకు తెలియదు.

ఇప్పుడు ఎవ్వరినీ అడగకూడదు కూడా. కారణం అది సైనికచర్య. అన్నిదారులు మూసుకుపోయినప్పుడు జరిపే అత్యంత సాహసోపేతమైన మెరుపుదాడి అది. కావచ్చు. వాళ్లు ఆ దుందుడుకు చర్యకు పాల్పడింది గణపతిని రక్షించడానికే కదా..

గణపతిని వదలి ప్రక్కనున్న అమ్మాయిని చంపాల్సిన పరిస్థితి ఏమొచ్చింది??

పోనీ.. దేవగిరి సైన్యమే ఇద్దరిని చూశారని అనుకున్నా.. వాళ్లకు కూడా ఆమెను చంపాల్సిన బలీయమైన కారణం ఏముంది.. ఉంది పో.. ఉంటే ఆమెను చంపవచ్చుననుకుందాం. కాని గణపతిని వదిలేయడం ఏవిటి?

గణపతిని కూడా చంపవచ్చు.. లేదా పట్టి బంధించవచ్చు. ఇతన్ని వదిలేసి ఆమెనే చంపడం ఏవిటి?

ఎవ్వరికి తెలియకుండా ముగ్గురూ తీవ్రంగా చర్చించు కున్నారు.

సోమలదేవిని అడిగితేనో???

ఓయమ్మో, అసలుకే మోసం వస్తుంది. అత్తలకు ఆమెపై సదభిప్రాయమే కాని అది సంపూర్ణం కాదు. ఆమె మాటలు.. రాజసం.. అధిక్య భావనలు వాళ్లకు ఆమెపై ఉన్న సదభిప్రాయంలో కొంత అసహనాన్ని ఉంచాయి.

ఆమెను అడిగినా.. ఆమెకు తెలిసినా.. కథ మరో రూపం తీసుకుంటుంది.

"కోడలు కొత్తపిల్ల. ఆమెపట్ల అసహనం వద్దు. కోపం ద్వేషం అసలే వద్దు. హాయిగా ఆమెను స్వీకరించు తండ్రి. నువ్వు కాకతీయ రారాజువి. నీపై పెద్ద బాధ్యతలున్నాయని మర్చిపోకు.." అన్నారు.

నిత్యమూ కొడుకును సాంత్వన పరుస్తూ గణపతి మళ్లీ మామూలు మనిషయ్యేలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మాతృత్వ మమకారం వల్ల గణపతి కొంత సాంత్వన చెందాడు. సంధ్యవేళ కొత్త జంటతో రాజమందిరం లో రాజకుటుంబ సభ్యులతో, గణపతి మిత్రులతో.. వారి కుటుంబాలతో సమావేశాలు ఏర్పరుస్తూ అతనిలో ఏర్పడిన భీతిని కొద్ది కొద్దిగా తొలగించసాగారు అమ్మలిద్దరూ..

అదే సమయంలో అమ్మలిద్దరూ గణపతికి తెలియకుండా రేచర్ల రుద్రయ, గంగాధరమంత్రితో సమావేశమయ్యారు. కవ్వల సంగతి విని వాళ్లిద్దరూ నోరు వెళ్లబెట్టారు.

అయితే ఆ రాత్రి.. మెరుపుదాడి జరిపిన రాత్రి గణపతి కనిపించకుండా పోవడం.. మందడి కాటయ బృందం కళ్లలో వత్తులు వేసుకుని దేవగిరి రాజ ప్రాసాదం అంతా అణువణువూ వెదికినా దొరకక పోవడానికి కారణం ఇప్పుడు తెలిసింది అనుకున్నారు.

ఆ ఆడపిల్లను మన సైనికులే చంపినా చంపి ఉండవచ్చు. యువరాజును రక్షించి తరలించేలోగా శత్రుసైన్యం దాడి చేసి ఉండవచ్చు. యుద్ధవీరులైన వాళ్లిద్దరికీ ఓ ఆడపిల్ల ఆ మెరుపుదాడిలో మరణించడం పెద్ద విషయం కాదు.

"మీరు కూడా ఆ విషయాన్ని మర్చిపోండి మహారాణి. పట్టాభిషిక్తుడయిన కాకతీయ మహారాజుపై గురుతర బాధ్యతలున్నాయి. అతని దృష్టి పరిపాలన పైకి మళ్లించాలి. అది మీరు ప్రముఖంగా స్వీకరించాలి.." అన్నారు.

తల్లులిద్దరూ అయోమయంగా ఏమి చేయాలో పాలుపోక తలలు ఆడించారు.

* * *

కళింగ సామ్రాజ్యం.. రాజధాని కటకం.

రాజనగరి.. చక్రవర్తి మంత్రాంగ మందిరం.

మహా ప్రధాని కరినాగుడు, మరికొందరు రాచ ప్రముఖుల మధ్య కళింగ మహారాజు రాజరాజ దేవుడు కొలువై ఉన్నాడు. మధ్య వయస్కుడు.. ఆలస్యంగా రాజ సింహాసనం ఎక్కినట్లు న్నాడు. రాజాభరణాలతో అలంకృతుడై ఉన్నా ఏదో సమస్యతో కొట్టుమిట్టాడు తున్నట్లు అసహనంగా ఉన్నాడు. ఆయన చుట్టూ ఉన్న రాచ ప్రముఖులు ఆయన చిరాకులో భాగం పంచుకుంటున్నట్లు హడావిడిగా చేతులు పిసుక్కుంటూ కనబడుతున్నారు.

అందరూ ఎవరి రాకకోసమో అన్నట్లు సింహ ద్వారం వైపు చూస్తున్నారు.

ఈశాన్య భారతంలో దక్షిణావర్తానికి చెంది

# గణపతిదేవుడు




12

**‘జాగృతి’ నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

నట్లున్న రాజ్యం కళింగ సామ్రాజ్యం. ఉత్తరపు అంచు గంగానది, వంగ రాజ్యాలు, పడమర మౌర్య సామ్రాజ్యం, దక్షిణాన గోదావరి సరిహద్దులుగా కలిగి గొప్ప ప్రాచీన చరిత్ర మాత్రమే కాక అపూర్వమైన పరిపూర్ణ సహజవనరులున్న సామ్రాజ్యం కళింగ. ఆది నుండి మౌర్యసామ్రాజ్యానికి పక్కలో బల్లెంలా ఉండేది. ఆదిమకాలం నుండి విదేశీ వర్తకంలో రాటుతేలిన సాహసోపేతులైన మహా వణిజుల వర్తకక్షేత్రం కళింగ. కొదమసింహాల్లాంటి వీర విక్రమ పరాక్రమ శూరులయిన మహారాజుల అద్భుత పాలనలో బహుముఖ సౌభాగ్యాలతో తులతూగుతున్న రాజ్యం.

కళింగ రాజ్యాన్ని నిజానికి మూడు భాగాలుగా చెప్పుకోవాలి. దక్షిణభాగం కళింగం అయితే ఉత్తర భాగం ఉత్కళ మధ్య భాగం కోసల..

ప్రధాన భాష ఓఢ్రం అయినా ఉత్తర భాగం వంగ దేశ సంస్కృతితో మిళితమై ఉంటుంది. మధ్య భాగం మౌర్య సామ్రాజ్య సంస్కృతితో ఉంటే దక్షిణ భాగం తెలుగు సంస్కృతితో మమేకమై ఉంటుంది. మూడు ప్రక్కలా పొంచి ఉన్న మహాశత్రువులను విజయవంతంగా ఎదుర్కొంటూ తమ సంస్కృతిని కాపాడుకుంటూ శత్రు దుర్భేద్యంగా తమ స్థానాన్ని కొనసాగించడం కళింగ పాలకుల ప్రత్యేకత. గొప్ప భాష, విద్యావసతులు, సాహిత్యం, కళలు, ఉత్కృష్టమైన దేవాలయాలు కళింగరాజ్యమంతటా అడుగడునా కనిపిస్తాయి. ఒకనాడు బౌద్ధం, అంతకు మించి జైనం.. సమాజాన్ని ప్రభావితం చేయగా ప్రస్తుతం శైవం, వైష్ణవం ఓఢ్ర ప్రజలను పరివేష్టించి ఉన్నాయి.

అందరూ ఎదురుచూస్తున్న ఆ ముఖ్యవ్యక్తి పరిమయభట్టు, కళింగరాజ్య ప్రధాన సంధివిగ్రహి.. లోపలికి వచ్చాడు. అందరూ తన కోసమే ఎదురు చూస్తున్నట్లు తెలిసినట్లు అతడు ముందు మహారాజుకు, అనంతరం మహాప్రధాని తదితరులకు వందనం చేశాడు.

పరిచారిక మంచితీర్థపు చెంబుతో వచ్చి ఆయనకు అందించగా గటగటా తాగాడు. ఉత్తరీయంతో మూతి తుడు చుకుని గొంతు సవరించుకుని ఏదో చప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు.

అప్పుడే ద్వారం వద్ద వినిపించింది. “జయము జయము.. మహాప్రభు..” అని.

అందరూ తలత్రిప్పి చూశారు. ఆ వ్యక్తి రాజ్య గూఢచారి నియోగం ప్రధాన నియోగి భజేంద్ర సాహు.

అతన్ని చూడగానే మహారాజు ముఖంలో ఉత్సుకత కనిపించడం మాత్రమే కాదు ఆయన సింహాసనం నుండి లేచాడు కూడా. “భజేంద్రా.. చెప్పు. వెళ్లిన కార్యం ఏమైంది?”

వంగి నమస్కరిస్తూ ఆయన సింహాసనం వరకు వెళ్లి చెప్పాడు.

“మనం ఊహించిందే జరిగింది ప్రభు! ఆ గణపతిదేవుడు సింహాసనం అధిరోహించడం లేదు. అతడేమీ శత్రుభీకరుడు కాడు. పిల్లి.. మ్యావ్..”

అందరూ పిక్కటిల్లి నవ్వారు. మహారాజు రాజరాజదేవుడు మరింత విశాలంగా.. అప్పటివరకు ఉన్న ఆందోళన ఏదో తొలగిపోయినట్లు.. అందరూ నవ్వడం ఆపినా ఆయన నవ్వుతూనే ఉన్నాడు. రాజుగారి ఆనందం చూసి అంతా సహజంగా సంతోషంగా మరీ మరీ నవ్వారు. సంధి విగ్రహి పరిమయ భట్టు చెప్పాల్సింది వినే వాళ్లెవ్వరూ లేరన్నట్లు మారిపోయింది అక్కడి వాతావరణం. ఆయన మౌనంగా ఓ ప్రక్కగా ఉండిపోయాడు.

కళింగ రాజ్యానికి దక్షిణం నుండి వచ్చి యుద్ధం చేయడం ఎవరికైనా బహుకష్టం. కారణం విశాలమైన గోదావరి మహానది. అది పెట్టని కోటగా కళింగను రక్షిస్తోంది. పైగా కళింగ సేనలే నది దాటి వెళ్లి ద్రాక్షారామం, వేంగిసీమ తదితర చిన్న చిన్న రాజ్యాలను దోచుకుంటూ ఉంటాయి. కళింగకు పెద్ద శత్రువు అయితే గియితే కాకతీయ రాజ్యం కావాలి. కాకతీయ రాజధాని అనుమకొండ కళింగకు చాలా దూరం. కళింగను గెలవాలంటే పెద్ద సైన్యంతో రావాలి. పెద్ద సైన్యం గోదావరిని దాటడం చాలా పెద్ద పని. గోదావరి దాటి ఆవలి ఒడ్డుకు వెళ్లి కత్తి గిత్తి సర్దుకుని యుద్ధానికి సిద్ధపడేలోపు కళింగ సేనలు వాళ్లపై బడి ఖండఖండాలుగా నరికేస్తాయి. అశోకుని మారణహోమం తర్వాత కళింగ సేనాల్లో శక్తిసామర్థ్యాలు తీవ్రమయ్యాయి. ఎవడైనా యుద్ధభేరి మ్రోగిస్తే వాడిపైకురికి జాలి దయ లేకుండా విచక్షణా రహితంగా చంపేస్తారనే గుర్తింపు తెచ్చుకున్నారు.

కాకతీయరాజ్యం దాని పాలకులైన మహారాజులు అరివీరి భయంకరులు, గొప్ప యోధానుయోధులుగా చుట్టుప్రక్కల రాజ్యాలలో భయం ఉంది. అందువల్ల రుద్రదేవుడి మరణం తర్వాత సమకాలిన రాజ్యాలన్నీ ఆయన తరవాత ఎవరు రాజ్యానికి వస్తారు అని చూశారు. రుద్రదేవుడి తమ్ముడు మహాదేవుడంటే ఎవ్వరికి భయం లేదు. ఆయన స్త్రీ లోలుడు. బాధ్యతా రాహిత్యం ఎక్కువ. కొద్దికాలానికే ఆయన మరణం, యువరాజు గణపతిదేవుడు యుద్ధబందీగా దేవగిరికి పోవడంతో శత్రురాజ్యాలన్ని ఆనందంతో పరవశించాయి. చివరికి ఊహాతీతంగా గణపతిదేవునికి పిల్లనిచ్చి జైత్రపాలుడు గౌరవంగా సాగనంపడంతో మళ్లీ అందరూ గణపతిదేవుని తీరును పరిశీలిస్తున్నారు.

పరిస్థితి తెలుసుకుని రమ్మని కళింగ రాజరాజ దేవుడు గూఢచారులను పంపాడు.

“గణపతిదేవుడు పెళ్లాంతో అనుమకొండ తిరిగి వచ్చాక ఏదో ఉత్సవం లాంటిది చేసి సింహాసనంపై కూర్చోబెట్టారు. కానీ అతడు పరిపాలన వదిలేసి పెళ్లాం కొంగు పట్టుకుని అంతఃపురం వదలి రావడంలేదు.”

ఈ సమాచారం రాజరాజదేవుని ఆనంద పరచింది. కాని ఆయన పరిమయభట్టు తెచ్చిన సమాచారాన్ని కూడా విని ఉంటే ఆ రాత్రి భోజనం కూడా చేసేవాడు కాదేమో!!

✻ ✻ ✻

చోళ రాజప్రాసాదం, తంజావూరు..

“కాకతీయరాజ్యానికి కొత్తగా మహారాజు అయిన గణపతిదేవుడు అమాయకుడు, పసివాడు,



మత్తి భానుమూర్తి

చేతకానివాడు."

కళింగ రాజప్రాసాదంలో కనిపించిన ఆనందమే దక్షిణావర్తంలోని తంజావూరు చోళ రాజప్రాసాదంలో కూడా వెల్లి విరిసింది.

మహారాజు మూడవ కులోత్తుంగుడు ముఖంలో దాచుకుందామన్నా దాగని ఆనందం కనిపిస్తోంది. ఏ రాజ్యం లోనయినా ఎంతటి మహారాజుకయినా నమ్మిన బంట్లు అనే వర్గం ఒకటి ఉంటుంది. ఈ బృందం ఎప్పుడూ ఆయన్ను పరివేష్టించి ఉంటుంది. వాళ్లు చెప్పినవి మహారాజు గుడ్డిగా నమ్మేస్తాడు. తొలి రోజుల్లో వాస్తవాలు చెబుతారు కానీ, పోను పోనూ రాజుగారి ముఖంలో ఆనందం కోసం ఆయనకు నచ్చినవే చెబుతుంటారు. అక్కడి నుండే ఆయన పతనం ప్రారంభం అవుతుంది.

కాకతీయరాజ్య సింహాసనాన్ని అధిష్టించిన గణపతిదేవుడు పాలనపై ఆసక్తి లేనివాడు అని తెలుసుకున్నట్లు చెప్పుకుని పరిహాసాలతో చోళ కులోత్తుంగుని మిత్రబృందం పరవశిస్తోంది.

పగలబడి నవ్వుతున్న మహారాజు కులోత్తుంగ చోళుడు అడిగాడు గూఢచారిని.

"ఏవిటేవిటి.. మళ్లీ చెప్పు! ఆ కుర్రకుంక సింహాసనం అంటేనే భయపడుతున్నాడా.. అంతఃపురం నుండి బయటకు రావడం లేదా.. వచ్చినా సమావేశ మందిరానికి వెళ్లడం లేదా..? పాపం.. ఆ ముసిలి రుద్రసేనాని, ఆ వృద్ధ ప్రధాని ఎంతకాలమని రాజ్య పాలన చేస్తారూ..! చూద్దాం మనం కూడా. ఇకపై మన సామంతులంతా కప్పాలు కట్టడం మానివేస్తే తగ్గేది లేదని.. దండోపాయమేనని దండోరా వేసి మరీ చెప్పండి." అన్నాడు ఆనందంగా.. కటువుగా. ఆయన ఆనందపు వాక్కులతో ఆ భజన బృందమంతా చేస్తున్న వికటాట్టహాసాలతో ఆ భవనమంతా మారుమ్రోగిపోతోంది.

* * *

పాండ్య రాజ్య ప్రాసాదం, మదురై.

అదే సమయంలో మదురై లోని పాండ్య కోట కూడా ఇలాంటి సంతోష సంబరాలలో తేలియాడుతోంది.

పాండ్య నృపతి జటావర్మన్ కులశేఖర గట్టివాడు. ఘటనాఘటన సమర్దుడు. విక్రమసింహపురిని సాధించాలని ఆయన కూడా పట్టుదలగానే ఉన్నాడు. సువర్ణాక్షరాలతో చరిత్ర లిఖించుకున్న చోళ వంశం అవసాన దశలో ఉంది. ఆదిమకాలం నుండి దిగువ దక్షిణావర్తంలో చోళులు, పాండ్యుల మధ్యనే ఎప్పుడూ పోరాటం. మరో రాజ్యవంశం అక్కడ ఎదగలేదు. చోళులు బలహీనంగా ఉన్నప్పుడు పాండ్యులు తప్పక బలపడతారు. ప్రస్తుత పరిస్థితి కూడా అదే. నిన్నటి వరకు దుర్నిరీక్షలయిన చోళులు అన్ని విధాలా బలహీనపడుతుంటే నిన్నటి వరకు మూలమూలల నక్కిన పాండ్యులు రానురానూ అన్ని రకాలుగా బలపడుతున్నారు.

పాండ్య కులశేఖరుని కూడా గణపతిదేవుని పట్ల కుతూహలం ఉంది. అతన్ని మిత్రుడిని చేసుకోవాలో శత్రువుగా ప్రకటించుకోవాలో నిర్ణయించుకునే ప్రయత్నంలో ఉన్నాడాయన. చోళ కులోత్తుంగుడు ఏమి చేయబోతున్నాడో పాండ్య రాజు ఎల్లప్పుడూ ఓ కన్నేసి ఉంచుతాడు.

తెలుగు చోడరాజులు కులోత్తుంగునికి కప్పాలు కట్టడం ఆపివేశారని విని పులకించాడు. కాకతీయ గణపతిదేవునికి, తమకు మధ్య విక్రమ సింహపురి రాజ్యమున్నదని.. మనుమసిద్ధిని కాదని గణపతిదేవుడు తమతో మంతనాలు జరపడని ఆయన గుర్తించాడు. కాబట్టి ముందు సంధి విగ్రహిని నెల్లూరు పంపి స్నేహం ప్రకటించాడు. జవాబు కోసం ఎదురు చూస్తున్నాడు.

స్నేహహస్తం చాపిన పాండ్యుడు తమిళంలోని తెలుగు భాషా ప్రాంతాలను మనుమసిద్ధి కోరితే ఇవ్వడానికి సిద్ధమా అంటే.. సూది మోపినంత స్థలం కూడా ఇవ్వను అనే అంటాడు కదా!!

* * *

ధనదుపురం, వెలనాడు రాజ్యం.

కాకతీయ రాచరికం వారి కదలికలు కనిపెట్టుకుని ఉండే శత్రురాజ్యాలు నాలుగు. దేవగిరి రాజ్యం, కళింగ రాజ్యం, చోళ రాజ్యం, పాండ్య రాజ్యం. ఇవి సరిహద్దులలోనున్న బలిష్టమైన రాజ్యాలు.. సామ్రాజ్యాలు. అయితే తెలుగు భాషా ప్రాంతాలలోనున్న చిన్న రాజ్యాలలో బలిష్టమైన శత్రు రాజ్యం.. వెలనాడు!!

ప్రస్తుత మహారాజు పృథ్వీశ్వరుడు. శత్రు భయంకరుడు. ప్రజాకంటకుడు కాదేమో కానీ నిరంకుశుడు. రాజ్యం ధనధాన్య రాశులతో మూలుగు తుంటుంది. అంతులేని విదేశీ వాణిజ్యంతో బంగారు నాణేలు ఇంట్లో పురులు కట్టి.. ఇత్తడి బానలలో నింపి.. నివాసం నిండా కోష్టాలు కలిగిన నౌకా నిర్మాతలు, ఎగుమతి దిగుమతి వణిజులు వందల్లో ఉన్న రాజ్యం. అందుచేత ఎవ్వరిని లెక్కచేయడు. ఎన్నెన్నో దేవాలయాలు, అగ్రహారాలు, ఘటికలు నిర్మించిన ఘనమైన చోడవంశ చరిత్ర కలిగినవాడు.

కాని అతనికి ఎక్కడో గుండెలోతుల్లో కాకతీయ రాజులంటే కించిత్ భయం. అందుచేత కాకతీయ రాజ్యం పై దేవగిరి విజయన్ని పృథ్వీశ్వరుడు స్వాగతించాడు. గణపతిదేవుని బంధించడాన్ని తెలివైన నిర్ణయంగా వర్ణిస్తూ జైత్రపాలునికి అభినందన సందేశాలు పంపించాడు. తర్వాత గణపతిదేవుని ఆయన అల్లుడిగా చేసుకోవడం అన్నది తెలిసి ఆశ్చర్యపోయాడు. మళ్లీ గణపతిదేవుని పట్టాభిషేకం.. కాకతీయ కేతనం తిరిగి రెపరెపలాడటం.. అన్నీ తెలిసి చిరాకుపడిపోయాడు.

మళ్లీ గణపతిదేవుడు పాలన పట్ల ఆసక్తి చూపడం లేదని వేగులు చెబితే కొంత కుదుటపడ్డాడు.

"మన జాగ్రత్తలో మనముండాలి ప్రభూ! ఎంతైనా కాకతీయుని నమ్మకూడదు. అతడు పాలన పట్ల దృష్టి పెట్టాడంటే.." ఓ మహామంత్రి చెబుతుండగానే చివ్వున లేచి ఆ మహామంత్రి వైపు ఉరిమి చూశాడు. తన అహంభావం అంతా ప్రదర్శించాడు.

"వాడి ముత్తాతను మన సామంతుడు చంపి పారేశాడు. వీడి తాత ఓ.. రెచ్చిపోయి తీరాస్త్ర రాజ్యాల్లో వ్రేలు పెడదామని ఎంతో ప్రయత్నించాడు. ఏమీ చేయలేక కత్తి ముడిచి అనుమకొండ వెళ్లిపోయాడు. వీడు భయపెడితే వెలనాడు రాజ్యం భయపడిపోతుందా? చెత్త వాగుడు వాగకు.."

త్వరలోనే గణపతిదేవుడు తొలియుద్ధం వెలనాడు మీదనే చేస్తాడని పృథ్వీశ్వరునికి, గణపతిదేవునికి కూడా ఇప్పటికి తెలియదు.

* * *

రాజప్రాసాదం, అనుమకొండ పట్టభిషక్తుడైనా గణపతి పరిపాలనపై ఏమాత్రం ఆసక్తిని చూపడం లేదు.

ఏదో నడుస్తోంది అంటే నడుస్తోంది.

ఇది కాకతీయ సమాజం కంటే కాకతీయ శత్రురాజ్యాలే ముందు గుర్తించాయి.

మహాప్రధాని గంగాధరమంత్రి తన మంత్రివర్గ సహచరులతో పాలనావ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాడు. సైనిక వ్యవహారాలన్నీ రుద్ర సేనాని చూసుకుంటున్నాడు. తిరిగి కాకతీయ కేతనం రెపరెపలాడటంతో సామాజికం ఒడుదొడుకులు లేకుండా సాగిపోతోంది. సామాన్యులు ఎప్పటిలా తన దైనందినం నిర్వహించుకుంటున్నారు.



"ఏవిటేవిటి.. మళ్లీ చెప్పు! ఆ కుర్రకుంక సింహాసనం అంటేనే భయపడుతున్నాడా.. అంతఃపురం నుండి బయటకు రావడం లేదా.. వచ్చినా సమావేశ మందిరానికి వెళ్లడం లేదా..? పాపం.. ఆ ముసిలి రుద్రసేనాని, ఆ వృద్ధ ప్రధాని ఎంతకాలమని రాజ్య పాలన చేస్తారూ..! చూద్దాం మనం కూడా. ఇకపై మన సామంతులంతా కప్పాలు కట్టడం మానివేస్తే తగ్గేది లేదని.. దండోపాయమేనని దండోరా వేసి మరీ చెప్పండి." అన్నాడు ఆనందంగా.. కటువుగా. ఆయన ఆనందపు వాక్కులతో ఆ భజన బృందమంతా చేస్తున్న వికటాట్టహాసాలతో ఆ భవనమంతా మారుమ్రోగిపోతోంది.

ఇద్దరమ్మల జాగరూకతతో గణపతి కేవలం అంతఃపురంలోనో లేదా రాజప్రాసాదంలోనో గడుపుతున్నాడు.

వివాహ సంబరాలు, పట్టాభిషేక మహోత్సవాలు పూర్తయ్యి, బంధు గణమంతా వారివారి రాజ్యాలకు ఊర్లకు వెళ్లిపోయినా అక్క మైలమాంబ ఇంకా అంతఃపురంలోనే ఉండటం.. బావగారు నతవాడి రుద్రయ రాజప్రాసాదంలో మంత్రిత్వ నియోగాల వద్ద కనపడటం.. అతన్ని ఆశ్చర్యపరచింది.

అక్కను అడిగాడు, “పెద్దక్కా.. ఏవిటి బావగారు రాజ్యాన్ని విడిచి ఇన్నిరోజులు ఇక్కడే ఉన్నారు? రాజ్యపాలన ఎవరు చూస్తారు మరి?”

తమ్ముని ప్రశ్న ఊహించలేదనుకుంటా.. పెద్దక్క మైలాంబ నివ్వెరపోయింది. ఏమీ చెప్పకుండా నీళ్లు నములుతోంది. ఎప్పుడూ గలగలా నవ్వుతూ గంతులు వేస్తూ తనను ఆట పట్టిస్తూ ఉండే పెద్దక్క అంత అన్యమనస్కంగా ఉండటంతో దగ్గరకు వెళ్లి చుబుకం పట్టి అడిగాడు. ఆమె కన్నుల్లో లీలగా నీళ్లు..

మరింత కంగారు పడిపోయాడు. “అక్కా.. అయ్యయ్యో.. ఏమైంది చెప్పక్కా..!”

“నేను చెబుతాను గణా..!”

తలతిప్పి చూస్తే బావగారు రుద్రుడు.. నతవాడి రుద్రుడుగా గొప్ప యోధుడు కావడంతో ఒక్కడిమల్ల రుద్రుడు అన్న బిరుదు పొందిన వీరుడు. అలాంటివాడు బేలగా కనిపిస్తూ చేతులు పిసుక్కుంటూ అత్తవారింట ఉండటం నిజానికి ఆత్మహత్యాసదృశం.

దగ్గరున్న ఊయల తల్పంపై ముగ్గురూ కూర్చున్నాక చెప్పాడు రుద్రుడు.

“నువ్వు చిన్నవాడివే అయినా నువ్విప్పుడు కాకతీయ మహారాజువి. ఇవ్వాళ కాకపోయినా రేపైనా నీకు తెలియాలి. మా రాజ్యం ఆర్థిక పరిస్థితి ఏమీ బావుండలేదు గణా. వర్షాలు లేక పంటలు పండ లేదు. రైతు ఏడ్చిన రాజ్యం శ్మశానం లెక్క. వృత్తి దారులు కూడా పనులు లేక చేతులు పిసుక్కుంటూ కూర్చున్నారు. మా రాజ్యంలో ఉత్పత్తి కర్మాగారాలు లేవు. వణిజులు, సెట్టిలు ఉన్నారు కాని కొనేవాడు లేడని వాళ్లూ తరాజు ముడిచి చూరులో గుచ్చి చేతులు ముడుచుకున్నారు. దరిమిలా పన్నులు, కప్పాల వసూళ్లు తగ్గిపోయాయి. కాని ఖర్చులు మాత్రం తగ్గవు కదా..”

“అదేవిటి.. రాజులకు డబ్బులకు కొదవా..?” నిజంగానే ఆశ్చర్యపోయి నిజాయితీగా అనేశాడు.

రాచకార్యాలలో డబ్బుల ప్రసక్తి గణపతి చెవిన ఎప్పుడూ పడలేదు. పెదనాన్న, నాన్న, మహాప్రధాని, ప్రధానులు, మంత్రులు, సైన్యాధ్యక్షులు, ఎందరెందరో నియోగప్రభువులు, అధికార లేఖకులు, కరణాలు.. మహామేధావులైన వారందరిని చూశాడు.. వాళ్ల మాటలు విన్నాడు.

“ఆ ఖర్చు ఎందుకయ్యింది.. సొమ్మంతా దుబారా చేస్తున్నారు.”

**నువ్వు చిన్నవాడివే అయినా నువ్విప్పుడు కాకతీయ మహారాజువి. ఇవ్వాళ కాకపోయినా రేపైనా నీకు తెలియాలి. మా రాజ్యం ఆర్థిక పరిస్థితి ఏమీ బావుండలేదు గణా. వర్షాలు లేక పంటలు పండ లేదు. రైతు ఏడ్చిన రాజ్యం స్మశానం లెక్క. వృత్తి దారులు కూడా పనులు లేక చేతులు పిసుక్కుంటూ కూర్చున్నారు. మా రాజ్యంలో ఉత్పత్తి కర్మాగారాలు లేవు. వణిజులు, సెట్టిలు ఉన్నారు కాని కొనేవాడు లేడని వాళ్లూ తరాజు ముడిచి చూరులో గుచ్చి చేతులు ముడుచుకున్నారు.**

“ఇకపై పొదుపు పాటిస్తాం ప్రభూ..”

“గుర్రాల అవదేసీకి సొమ్ము ఎందుకు చెల్లించ లేదు? చెల్లించకుంటే వాడు కావాలంటే గుర్రాలు ఇస్తాడా. కనీసం కన్నెత్తి చూడడు. తాంబూలం నమిలి మన ముఖాన ఉయ్యడు కూడా..”

ఇలాంటి సొమ్ముతో ముడిపడిన సంభాషణలు, అధికార ప్రశ్నలు జవాబులు విన్నాడు కాని రాజుగారి దిన వెచ్చానికే సొమ్ము తక్కువ పడింది ఎలా అన్నమాట వినలేదు. జీతాలకు, దినసరి ఖర్చులకు కూడా సొమ్ము లేదని ఓ రాజు రాజ్యాన్ని వదలి.. అప్పు కోసం చేతులు నలుపుకుంటూ అత్తవారింట కూర్చోవడం..

భలే.. పైకం లేకుంటే!? అవును. పైకం లేకుంటే కావలసిన సరుకులు ఎవడు ఇస్తాడు? పరిచారికలు, భటులు, వంటవాళ్లు, సేవలుచేసే ప్రతివారికి నెలవారీగా జీతం బత్తెం అందుతుంటేనే కదా వాళ్లు పనిచేయగలుగుతారు.

“ఆ వజ్రాల వ్యాపారి ఏమన్నాడు?” అక్క బావగారిని అడుగుతోంది.

ఆయన మౌనంగా ఉన్నాడు. రెట్టించి అడుగుతోంది అక్క. అప్పుడు చూశాడు అక్కను నఖశిఖ పర్యంతం. బోసి మెడ. కాళ్లకు పట్టీలు, నడుముకు వడ్డాణం, చేతులకు కడియాలు, మెడలో హారాలు, గ్రైవేయకాలు ఏమీలేవు. కేవలం నుదిటన బొట్టుతో కట్టుగుడ్డలతో ఓ మహారాణి.. కాకతీయ ఆడపడచు.. అవాక్కయ్యాడు.

“ఈ రోజు కాకపోతే రేపయినా పని సానుకూలం అవుతుందని చెప్పాడా..??”

వాళ్లున్న నిరాశ నిస్పృహల్లో భర్త ఏదైనా ఆశ చిగురించే మాట చెబుతాడేమోనన్న ఆదుర్దా ఆమె మాటల్లో గణపతి గుర్తించాడు. విభ్రమంగా అక్కను చూశాడు.

అక్క మైలాంబిక.. తొలిచూలు ఆడపిల్ల అయితే ఎంత ప్రాణప్రదంగా.. అల్లారుముద్దుగా పెంచుకుంటారో అలా పెరిగింది అక్క. బంగారు ఊయల.. ఒడలంతా బంగారం.. వజ్రవైఢూర్యాలు.. ప్రత్యేక నిపుణులైన కుట్టు పనివాళ్లతో రాజప్రాసాదంలోనే పట్టు పీతాంబరాలతో కుట్టించిన ప్రత్యేక దుస్తులలో మెరిసిపోయే అక్క.. బంగారు అచ్చులపై నడిచి పెరిగిన అక్క.. ఇప్పుడు అదే బంగారు వజ్రాభరణాలను కుదవ పెట్టడానికి భర్తను పురమాయించి ఆయన వచ్చాక ఆ అంశం ఏమైంది అని ఆత్రుతగా అడగడం.. గణపతిని విచలితుడ్ని చేసింది.

ఇప్పుడు సొమ్ములేనిదే నతవాడి వెళ్లలేరు. వెళితే కనీసం ద్వారపాలకుడు కూడా తలవంచి నమస్కరించడు.

వాడికి జీతం ఇచ్చి ఎన్నిమాసాలు అయ్యిందో.. వాడి పెళ్లాంబిడ్డలు ఏమి తింటున్నారో.. ఇలా ఎందరు.. ఎంద రెందరో ఉద్యోగులు.. సైనికులు..

పరిస్థితి అర్థమయింది. అపారమేధావి అయిన గణపతి రెప్పపాటులోనే పరిస్థితికి ముందు వెనుకలు ఊహించడం ఎలాగో పెద్ద తండ్రి వద్ద నుండి చిన్ననాడే వంటపట్టించుకున్నాడు.

ఊహాతీతమైన అక్కాబావల పరిస్థితి గుర్తించిన గణపతి హఠాత్తుగా చురుకయ్యాడు.

ఒక్కపెట్టున కవ్వల మరణం తర్వాత ఏర్పడిన నిర్వేదం, నిర్లిప్తత ఎగిరిపోయాయి. అప్పటివరకు మన్ను తిన్న పాములా మునగదీసుకుని పడుకున్న మేధ అనే వేయి పడగల నాగశేషుడు చివ్వున కదిలి వేయిపడగలు ఒక్కసారిగా విదిలించి అంతా చూశాడు. చప్పట్లు చరచి భటుని పిలిచాడు. వాడు వచ్చేలోగా ఒక్కమల్ల రుద్రయను అడిగాడు.

“బావగారూ మీరు అక్క నగలు కుదువ.. అమ్మడానికి ఎవరికి ఇచ్చారు.. ఏ మంత్రి మీకు సహాయపడుతున్నాడు?”

“అదే. భండాగార నియోగి సంకరయ ద్వారా బలిజశెట్టి అల్లంశెట్టిని కలిశాను. అయన ఇంకా ఏమీ చెప్పలేదు.”

గణపతి ముఖంలో కాస్త వెలుగు ఎదిగింది. అల్లంశెట్టి కొడుకు అంకాలశెట్టి గణపతి స్నేహితుడు.

“సరే సరే.. నేను చూస్తాను. మీరు నిశ్చింతగా ఉండండి. పని పూర్తి చేసి తగిన సొమ్ముతో మిమ్మల్ని నతవాడి పంపిస్తాను.”

అక్కబావలిద్దరూ మెరిసే కళ్లతో గణపతిని చూశారు. గణపతి ఎప్పుడూ భరోసాగానే మాట్లాడతాడు. మాట ఇచ్చాడంటే నెరవేర్చి తీరతాడు. వీళ్లిద్దరికీ ఆవలగా మరో ఇద్దరు చాటుగా జరుగుతున్నది చూస్తూ వింటూ సంతృప్తి చెందారు. వాళ్లు గణపతిదేవుని పెద్దమ్మ, కన్నమ్మ.

వాళ్లకు ఆవలగా మరోవైపు మరొకరు చిరాగ్గా చూస్తున్నారు. ఆమె సోమలదేవి. గణపతిదేవుని పట్టపురాణి.

**(సశేషం)**


అంజలక్ష్మి


కృష్ణభారతి

# త్యాగచరితా...

**ఆయన కృష్ణమూర్తి. ఆమె లక్ష్మి (అంజలక్ష్మి)**
**వారి తనయ– కృష్ణభారతి.**
**కుటుంబంలోని ఆ ముగ్గురిదీ స్వాతంత్ర్య ఉద్యమ సుదీర్ఘ చరిత్ర.**
**అన్ని వివరాలూ తెలియాలంటే... అది 1904. అంటే 121 ఏళ్ల క్రితం. ఆ ఊరు అత్తిలికి దగ్గర్లో ఉంది. పేరు – దాసుల్ల కుముదవల్లి. గోదావరి ప్రాంతం. కుముదవల్లి అనగానే ఇప్పటికీ గుర్తొచ్చేది అంజలక్ష్మీ!**
**ఆ సంవత్సరం 1932. అది తమిళనాట వెల్లూరు కారాగారం. అక్కడి గదిలో అంజలక్ష్మికి ప్రసవం! శ్రీకృష్ణ జన్మస్థానం మాదిరిగా అలా జరగడంతో, భారత స్వతంత్ర పోరాట సందర్భం కావడంతో, ఆ ఆడపిల్లకు కృష్ణభారతి అని పేరు పెట్టుకున్నారామె.**
**మరి కొంతకాలం గడిచింది. నెలల తన పసికందుతో జైలు నుంచి బయటి ప్రపంచంలోకి వచ్చారు అంజలక్ష్మి. అప్పటికే ఆమెను వెల్లూరు నుంచి కన్ననూరు కారాగారానికి మార్చారు ఆంగ్లేయ పోలీసు అధికారులు.**
**అటు తర్వాత ఎన్నెన్నో పరిణామాలు!**
**ఇప్పుడు మన ప్రత్యేక ప్రస్తావన ఆ తల్లి, తనయల గురించే!**
**ప్రధానంగా మాతృమూర్తి లక్ష్మి. డిసెంబరు మూడున తన స్మృతి.**

ఆస్తిపరుల కుటుంబంలో పుట్టిన అంజలక్ష్మికి సమాజసేవ మీదనే మక్కువ ఎక్కువ. ఇతరులకు ఇవ్వడంలోనే ఆమెకు ఆనందం! తల్లిదండ్రుల నుంచి చిన్ననాటనే దేశభక్తి అలవడింది.

చదువు మాత్రం అంతగా ఒంటపట్టలేదు. బడిలో పెద్దగా చదువుకోలేదు కానీ, చుట్టూ ఉన్న సంఘాన్ని ఆసాంతం చదివింది. మనుషులు, మనస్తత్వాలు, పరిస్థితులు, అనేక రకాల సమస్యలు, వాటికి పరిష్కారాలు – ఎన్నింటినో. ఇల్లే ఆమెకు పాఠశాల!

ఆ రోజుల్లో ఉద్యమం ఉద్ధృతంగా సాగుతోంది.

***శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం***
***పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం***
***సుహాసినీం, సుమధుర భాషిణీం***
***సుఖదాం వరదాం మాతరం... వందేమాతరం!***

(మనసును అలరించే తెల్లని వెన్నెల రాత్రిలా, వికసిత సుమంలా, పచ్చని వృక్ష సముదాయంలా విరాజిల్లే భరతమాతా! మధురాతి మధుర చిరునవ్వు నీది. అదేవిధమైన పలుకూ నీదే. ఆనందపుదాయినివి. వరప్రసాదినివి నీవే. నీకు నమస్సులమ్మా!)

***జనగణమంగళ దాయక జయహే***
***భారత భాగ్యవిధాతా! జయహే, జయహే, జయహే.***
***జయజయజయ జయహే***

(నీ పవిత్ర పేరునే స్మరిస్తూ, హృదయ జాగృతమవుతూ, మంగళప్రద ఆశీస్సుమాలను కోరుతూ, నీ విజయ చరితలనే పాడుతాం తల్లీ! అందరికీ శుభాలను అందించే భరతమాతా! నీకు జయం జయం).

ఇటువంటి గీతాల ప్రభావంతో ఉద్యమవాహినే అంతటా. సహాయ నిరాకణ, విదేశీ వస్తు బహిష్కరణ, అదేవిధంగా విదేశీ వస్త్రదహనం, మరోవైపు ఊరూరా వాడవాడలా ఖద్దరు ప్రచారభేరి. వీటన్నింటితో కొనసాగుతోంది పోరు ప్రభంజనం.

అది 1929వ సంవత్సరం. అప్పటికి లక్ష్మికి సరిగ్గా పాతికేళ్లు, సరిగ్గా ఆ రోజుల్లోనే చాగల్లు ప్రాంతం ఆనంద నికేతన ఆశ్రమంలో సమావేశ మయ్యారు వీరులంతా.

ఉద్యమ నిర్వహణకు సహాయం అవసరమన్న పిలుపు వినిపించింది అప్పుడు. ఒక్క క్షణమైనా ఆలోచన చేయలేదు తను. తన ఒంటిమీది ఆభరణాలన్నింటినీ నిధికి అర్పించింది.

అంతేకాదు– ఇక ముందు ఎన్నడూ, ఎప్పుడూ బంగారు నగల్ని వేసుకోనని శపథంచేసిన మహిళా మణీ ఆమే.

నాడు ప్రత్యక్ష, పరోక్ష మార్గాల్లో జరుగుతోంది పోరాటం.

అంజలక్ష్మి కదన కుతూహలం చెప్పనలవి కాదు. ఆ జోరే వేరు.

ఉప్పు సత్యాగ్రహ రంగంలోకి దూకింది.

అనంతర కాలంలో దుకాణాల దగ్గరి విదేశీ వస్త్రాలను దహనం చేయడం ముందుగా కార్య కర్తలతో కలిసి ఆయా వ్యాపారశాలల వద్ద పికెటింగ్.

**సకల పురాణేతిహాస సారభరితవు**
**సారభరితవు... ఓంకార మహితవు.**
**స్వరాజ్యదీక్షగొనిన సత్యమూర్తివి**
**సత్యమూర్తివి... అసహాయవర్తివీ!**
**వందనమిదె గైకొనుమీ భారతజననీ!**

అనేలా ముమ్ముందుకు పయనిస్తోంది సమరసేన!

భీమవరంలోనూ విస్తరిస్తోంది ఆ అగ్ని. విస్తరించి విస్తరించి ఒక్కసారిగా ఎగసింది. దమన పాలకులు రాక్షస బలాన్ని ప్రయోగించారు. ఫలితంగా అంజలక్ష్మి– పోలీసుల నిర్బంధంలోకి.

ఆమెను మద్రాసు కారాగారానికి తరలించారు. మరికొన్ని కారాగారాలకీ తిప్పుతూ వచ్చారు.

నెలల తరబడి కారాగారవాస దండన!

ఇరుకిరుకు గదుల్లో, గాలీ, వెలుతురూ మచ్చుకైనా లేని చోట్లలో నిర్బంధం.

నానారకాల బాధలుపెట్టినా, పంటి బిగువున భరించింది ఆ యోధ. దేశానికి స్వేచ్ఛ కావాలన్న సంకల్పదీక్ష పెరిగిందేకానీ, ఎక్కడా తగ్గలేదు. బాధల్లోని వేటినీ లెక్కచేయలేదు.

అటు తర్వాత విడుదల. మళ్లీ కొన్నాళ్లకే– అదే భీమవరంలో ఒకరోజున ఉద్యమకారుల సమావేశం. పసిగట్టిన పరపాలక పోలీసులు మోహరించారు. సభాస్థలికి ఏ ఒక్కరూ ఎక్కడి నుంచీ రాకుండా దారుల్ని మూసివేశారు.

అయినా, ప్రవాహాన్ని ఎవరు ఆపగలరు?

ఉద్యమ మహిళలు కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమ వేదికను మార్చేశారు. సభ జరగాల్సింది



అప్పట్లో తెలుగునాట పర్యటన వేళ.. కృష్ణభారతికి ప్రధాని మోదీ పాదాభివందనం

# ... రాగభరితా!

ఒక భవనంలో అయితే, దూరంగా ఉన్న పొలం గట్టును ఎంచుకున్నారు. నిర్ణయాలు తీసుకున్నారు. కూలంకష ఆలోచనలయ్యాక, తిరుగుముఖం పట్టారు. నేరుగా పాత భవంతి (మొదటి సభాస్థలి)కి చేరుకుని, అక్కడే ఉద్యమ పతాకను ఎగురవేశారు.

*వినువీధిన సగర్వంగా జెండా!*
*పతాకోత్సవము చేయండీ.*
*స్వతంత్ర భారత జాతి చిహ్న ఉత్సవం చేయండీ!*
*కొత్త వన్నెలూ, కొత్త చిన్నెలూ, కొత్త జీవం*
*కొమరప్పంగా... నూతన భారత జాతికి భువిలో*
*ఖ్యాతీ విజయమూ జరగాలంటూ –*
*పతాకోత్సవం చేయండీ!*

అన్నట్లు రెపరెపలాడించారు ఆ జెండాను. అంతకుముందు ఆ భవనం మీద అక్కడ ఉన్న ఆంగ్లేయ పతాకను తొలగించారు ఉద్యమ కార్యకర్తలు. వారిలో అనేకమంది వనితలు.

అలా పతాకాన్ని ఆవిష్కరించిన సందర్భం అప్పట్లో తెలుగునాట అదే. చరిత్రాత్మక సన్నివేశం.

రెచ్చిపోయిన బ్రిటిష్ పోలీసులు పాశవిక బలాన్ని ప్రయోగించారు. ఉద్యమ వనితలను నిర్బంధించి, వాహనాల్లో తరలించి, దమన నీతిని కనబరిచారు. ప్రతిఘటించిన వారి మీద లాఠీలు ఝుళిపించారు. తీవ్రగాయాలతో అల్లాడుతున్నా ఉద్యమ నినాదాన్ని ఆపలేదు అంజలక్ష్మి. ఎలుగెత్తి నినదిస్తున్న ఆమెను పశుబలంతో అణచివేయాలని చూశారు పోలీసులు. పదినెలల కారాగార వాస శిక్ష పడేలా చేశారు.

అప్పటికీ ఆ సాహసపడతికి చిన్నవయసు కుమారుడున్నాడు. ఆ పిల్లవాడినీ నిర్బంధించారు ముష్కరపాలకులు. నిర్బంధంలో మగ్గిన ఆమె అప్పటికి గర్భవతి! కారాగారంలోనే పుత్రికా జననం. ఆమె కృష్ణభారతి! ఆ పేరు అలా పెట్టడంలోనే తల్లి దేశభక్తి ప్రస్ఫుటమవుతుంది.

తల్లీ బిడ్డలు జైల్లోనే! నరకయాతన తప్పలేదు పిల్లలకి కూడా. ఎంతగా తల్లడిల్లారో పైనున్న ఆ భగవంతుడికే తెలుసు!

ఇంకొన్ని నెలలు గడిచిపోయాక, విడుదల చేశారు ఆమెని. పసివాళ్లతో సహ బయటికి వచ్చిన అంజలక్ష్మికి ఊరూరా ప్రజలంతా ఘనస్వాగతాలు పలికారు. అపార గౌరవం, ఆదరభావాలతో అంతటా నీరాజనాలు అర్పించారు. ఆ రోజుల్లో ఆమెకు లభించిన స్వాగత సత్కారాలు ఎనలేనివి. వందల మంది జేజేలు అందించారు.

కాలం ఆగలేదు సరికదా వేగంగా సాగింది. తల్లి ఆశయాలనే శ్వాసగా స్వీకరించారు కృష్ణభారతి. జీవితమంతటినీ సమాజసేవకు కేటాయించారు. తనకు ఉన్న ప్రతీరూపాయినీ సామాన్యుల కోసమే ఖర్చుపెట్టారు. తనది 92 వత్సరాల జీవితకాలం. సమయమంతటినీ జనసేవకే వినియోగించారు. దానాలూ, ధర్మాలూ అనంతంగా చేస్తూ వచ్చారు. స్వాతంత్ర్యం ముందు, స్వతంత్ర సమయం, అనతరకాలంలోనూ స్థితిగతులను చూశారామె.

**మల్లాదివారు అన్నట్లు :**

*జయ జయజయ భారత జనయిత్రీ, దివ్యజ్ఞాన ప్రదాత్రీ!*
*నిరుపమ మహిమోపేతా, చిరయశస్సమేతా*
*అతులిత దివ్యావేశ సంజనిత*
*విశ్వశాంతి కాంక్షిత వచస్వినీ!*
*చతురాశ్రమ జీవిన విధాన ని*
*ర్దేశిత పథదర్శినీ తపస్వినీ!*

అంటూ భారతమాతను నేత్రపర్వంగా దర్శించారు. మనస్వినిగా సంభావించారు. స్వతంత్ర భారతంలోనూ కృష్ణభారతి ఎప్పుడూ, ఎన్నడూ, ఎవరి నుంచీ ఏమీ ఆశించలేదు. పోరాట కాలంలో కారాగారంలో జన్మించిన కారణంగా స్వతంత్ర యోధగా గుర్తిస్తామన్న అధికారుల వినతినీ సున్నితంగా తిరస్కరించారు. 'మాకు ఇవ్వడమే తెలుసు. తీసుకోవడం తెలియదు. కుటుంబంలో అందరం స్వతంత్రతా సాధనే లక్ష్యంగా పనిచేశాం. అంతేకానీ, ఏ ప్రతిఫలాన్నో ఆశించికాదు' అని ప్రకటించడం కృష్ణభారతికే చెల్లింది. పరమ స్వచ్ఛంద సేవకు నిదర్శనరూపాలు తల్లి అంజలక్ష్మి. కూతురు కృష్ణభారతి!

భరతమాత ముద్దుబిడ్డ కృష్ణభారతి. అందుకే మూడేళ్లనాడు భీమవరంలో ఒక కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోదీ ప్రత్యేకంగా ఆమెను సత్కరించారు. వేదిక మీద ప్రణామం అర్పించారంటే... అంతా తల్లి అంజలక్ష్మి, కూతురు కృష్ణభారతి నిబద్ధతా పూరిత జీవిత విశేషమే. ఆ తల్లీ తనయా ఆదర్శ చరితులు!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్




# సమాన పిం

**వర్తమాన భారతంలో వయోవృద్ధులు చాలామంది తమకు పెన్షనే జీవనాధారం అని భావిస్తున్నారు. అయితే అందరికీ ఒకే రకమైన పెన్షన్ విధానం ఉండదు. అందువల్ల పెన్షన్ పొందేవారిలో అనేక వ్యత్యాసాలు ఉన్నాయి. అసలు ఈ పెన్షన్ విధానం ఏ సందర్భంలో బ్రిటిష్‌వాళ్లు మన దేశంలో ప్రవేశపెట్టారు. క్రమంగా అది ఎలా విస్తరించింది, ఎటువంటి మార్పులు జరిగాయనే విషయాలు సమాజంలో చాలామందికి తెలియవు. మన దేశంలో 1857లో తొలి స్వాతంత్ర్య పోరాటాన్ని అణచివేసిన అనంతరం బ్రిటిష్‌వాళ్లు ఈ పెన్షన్ విధానాన్ని మన దేశంలో ప్రవేశపెట్టారు.**

స్థానిక పాలకులు, స్వాతంత్ర్య సమరయోధులకు సహకరించకుండా, బ్రిటిష్‌వారికి అనుకూలంగా ఉండటానికి ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. స్థానిక పాలకులకు పెన్షన్ రూపంలో ధనం ఇవ్వడం ద్వారా వారిని తమకు కావలసిన విధంగా మార్చుకోవచ్చు. తమకు విధేయతగా మారవచ్చు. ఈ విధానం అమలుకు అప్పట్లో ప్రధాన కారణం ఆ తదుపరి 1871తో బ్రిటిష్‌వారు ఈ పెన్షన్ విధానాన్ని సైనికులకు (మిలిటరీవారికి), న్యాయాధికారులకు (Judicial Officers), ప్రభుత్వోద్యోగులకు వర్తించేలా మార్పులు చేశారు. అందుకోసం 1871లో భారతీయ పెన్షన్ల చట్టం 1871 (Indian Pensions Act 1871) అనే చట్టాన్ని చేశారు. అసలు ఈ పెన్షన్ అనేది లాటిన్ పదం. 1841లో చార్టర్డ్ గ్యాస్ లైట్, కోక్ కంపెనీ తమ ఉద్యోగుల కోసం పెన్షన్ నిధిని ఏర్పాటుచేసి ప్రైవేటు రంగ ఉద్యోగులకు పెన్షన్ అనే విధానానికి తెరతీసింది. దీనిని 1857లో కేవలం పాలకులకు మాత్రమే వర్తింపజేసి ఆ తదుపరి మన దేశంలో బ్రిటిష్ పాలన సాఫీగా సాగాలంటే కేవలం స్థానిక పాలకులే తమకు విధేయులుగా ఉంటే సరిపోదని భారతీయులైన బ్రిటిష్ సైన్యం, భారతీయులైన ఉద్యోగులు, భారతీయులైన న్యాయాధికారులు తమకు విధేయులుగా ఉండాలని, అందుకు వారికి సేవానివృత్తి అనంతరం కూడా డబ్బు వస్తుందనే ఆశ లేక భరోసా కల్పించాలని 1871 చట్టం చేశారు. అయితే అప్పట్లో పెన్షన్ అంటే కేవలం నెల, నెలా ఇచ్చే సొమ్ము మాత్రమే కాదు, ప్రభుత్వం వసూలు చేసే భూమి శిస్తులో వాటా కూడా దాని కిందకే వచ్చేది. అయితే ప్రైవేటు రంగంలో పనిచేసే వారికి ఇటువంటి సౌకర్యాలు ఉండేవి కావు. పారిశ్రామిక విప్లవంలో భాగంగా మన దేశంలో 1850 నుంచే ప్రైవేటు రంగం పారిశ్రామిక రంగంలో ప్రాముఖ్య పాత్ర పోషించినప్పటికి, అందులో పనిచేసేవారి వేతనాలు, తదితర అంశాలు ఆయా యాజమాన్యాలే నిర్ణయించుకునేవి. 1875లో అమెరికాలో అమెరికన్ ఎక్స్‌ప్రెస్ కంపెనీ అనే సంస్థ తమ ఉద్యోగులకు పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆ తదుపరి ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు తమ ఉద్యోగులకు పెన్షన్ విధానాన్ని అమలు జరిపాయి. 1885 నుంచి మన దేశంలో కూడా విదేశీ వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు తమ ఉద్యోగులకు పెన్షన్ విధానాన్ని అమలుచేయటం ప్రారంభించాయి. వాటి ప్రభావంవల్ల 1960 కల్లా మన దేశంలో ప్రైవేటు రంగంలోని సంస్థలు కూడా తమ ఉద్యోగులకు పెన్షన్ విధానాన్ని అమలుచేయటం పెరిగింది. అయితే ప్రైవేటు రంగంలోని సంస్థలన్ని ఈ విధానాన్ని అమలుచేయలేదు. కొన్ని పెద్ద సంస్థలు, ఆర్థికంగా పటిష్టంగా ఉన్న సంస్థలు మాత్రమే ఈ విధానాన్ని అమలుచేయడం ప్రారంభించాయి. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఈ పెన్షన్ విధానానికి చట్టపరమైన రక్షణ ఉండేది కాదు. అందువల్ల ఈ వ్యాపార సంస్థలు ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పుడల్లా ఈ పెన్షన్లను రద్దుచేసేవి. ఉదాహరణకు అమెరికాలో స్టూడ్‌బేకర్ 8500 మందికి పైగా ఉద్యోగులను హఠాత్తుగా తొలగించటంతోపాటు, వారి పెన్షన్‌ను కూడా రద్దు చేయటంలో ఆటోమొబైల్ రంగంలో పనిచేసేవారంతా ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైనారు. ఇటువంటి సంఘటనలు పెరగటంతో 1974లో అమెరికాలో (Employee Retirment Income Security Act) (ఉద్యోగుల పదవీ విరమణ / సేవానివృత్తి అనంతర ఆదాయ భద్రతా చట్టం) రూపొందించటం జరిగింది.

ప్రైవేటు రంగంలో పనిచేసే వారికి వర్తించ కుండా కేవలం పెన్షన్ సదుపాయంలేనివారి సేవా నివృత్తి అనంతర జీవనానికి ఊతం అందించటానికి మన దేశంలో 1925లో ప్రావిడెంట్ ఫండ్ ఆక్ట్ (భవిష్యనిధి చట్టం) రూపొందించటం జరిగింది. ఇది ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వేల ఉద్యోగుల కోసం చేసిన చట్టం అయినప్పటికి ప్రైవేటు రంగంలోని పెద్ద సంస్థలు, ఎంప్రెస్ మిల్స్ టిస్కో వంటి సంస్థలు స్వచ్ఛందంగా తమ ఉద్యోగుల కోసం భవిష్యనిధి పథకాన్ని అమలుచేశాయి.

స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం నవంబర్ 15వ తేదీ 1951లో ఈపిఎఫ్‌ను ఆర్డినెన్స్ ద్వారా పారిశ్రామిక ఉద్యోగులు (కార్మికులకు) వర్తింపచేశారు. ఆ ఆర్డినెన్స్‌ను 1952లో ఈపిఎఫ్ చట్టం అమలు జరిపిన అనంతరం రాజ్యాంగ బద్ధంగా రద్దైంది. అయితే మొదట్లో ఈ చట్టం కేవలం కొన్ని రకాల పరిశ్రమలలోని కార్మికులకు మాత్రమే వర్తించేది. ఉదాహరణకు సిమెంటు, ఉక్కు, జౌళి, పొగాకు ఉత్పత్తులు (సిగరెట్లు), విద్యుత్, మెకానికల్ ఇంజనీరింగ్ సంస్థల కార్మికులకు మాత్రమే వర్తించేది. క్రమంగా ఈ చట్టాని మరిన్ని పరిశ్రమలకు వర్తింప చేశారు. ఆ తరువాత 1971లో Employees Family Pension Schemeని ప్రవేశపెట్టారు. దీనికంటే ముందు ప్రభుత్వోద్యోగులకు 1964లో Family Pension విధానాన్ని అమలుచేశారు. ఈ Family Pension పథకం ప్రకారం ప్రభుత్వోద్యో గులు తమ జీతాలలో నుంచి ప్రతి నెల కొంత డబ్బు Family Pension అర్హత సాధించటం కోసం చెల్లించాల్సి వచ్చేది. ఈ Contribution పద్ధతిని 1977లో రద్దుచేశారు. నవంబర్ 16, 1995 నుంచి Employees Pension Scheme 1971 స్థానంలో Employees Pension Scheme అనే పథకాన్ని కార్మికుల కోసం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ప్రైవేటు రంగ కార్మికులకు ప్రభుత్వ రంగ సంస్థలలో కొంతమంది ఉద్యోగులకు మూడు పథకాల ద్వారా సాంఘిక భద్రతను కలిగించే ప్రయత్నం జరుగు తున్నది. అవి 1. భవిష్యనిధి పథకం, 2. పెన్షన్ పథకం, 3. బీమాపథకం. వర్తమాన కాలంలో అమలులో ఉన్న




# ంఛనుకు పరిష్కారం

చట్టాల ప్రకారం కార్మికులు, యాజ మాన్యాలు కార్మిక భద్రతకు నెలవారి Contribution చెల్లించవలసి ఉంటుంది. యాజ మాన్యాలు కార్మికవేతనంలో 12 శాతం Contribution చెల్లించవలసి ఉంటుంది. అందులో 8.33 శాతం పెన్షన్ పథకం క్రిందా, మిగిలిన 3.67 శాతం భవిష్యనిధి క్రింద జమ చేస్తారు. ఇది కాక యాజమాన్యాలు 0.5 శాతం Deposite Linked Insurance Scheme పథకానికి, 1.1 శాతం పరిపాలన ఖర్చుల నిమిత్తం చెల్లించవలసి ఉంటుంది. అయితే ఈ Contribution చెల్లించటానికి వేతనాలకు గరిష్ఠ పరిమితులు ఉన్నాయి. అంటే కార్మికుడి జీతం ఎంత ఉన్నా ఉదాహరణకు కార్మికుడి జీతం 50వేలు ఉన్నా ఈ చట్టం ప్రకారం యాజమాన్యాలు చెల్లించవలసిన Contribution గరిష్ఠంగా రూ.15 వేలుగా భావించి దానిపై 12 శాతం Contribution చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ గరిష్ఠ పరిమితి మరింత తక్కువగా ఉండేది. ఈ గరిష్ఠ పరిమితి ఎలా పెరుగుతూ వచ్చిందో పట్టికలో చూడవచ్చు.

ఈ సాంఘిక భద్రత పథకం క్రింద పెన్షన్ ఇవ్వటానికి యాజమాన్యాలు చెల్లించిన 8.33 శాతం Contribution, దానిపై వచ్చిన వడ్డీ లేదా డివిడెండ్లే ఆధారం. ఈ Contribution చాలా తక్కువగా ఉండటంవల్ల వారికి చెల్లించే పెన్షన్ చాలా తక్కువగా ఉంటుంది. ఈ పెన్షన్ పథకానికి కార్మికుడి నుంచి ఎటువంటి Contribution తీసుకోరు. వారు చేసిన 12 శాతం Contribution పూర్తిగా వారి ఈపీఎఫ్ ఖాతాకే జమ అవుతుంది. ఈ ఈపీఎఫ్ ఖాతాలో కార్మికులు చేసిన Contribution, యాజమాన్యం నుంచి పెన్షన్ పథకానికి పోను మిగిలిన 3.67 శాతం జతచేసి, దానిని లాభానికి పెట్టుబడులు పెట్టి, వడ్డీతో సహా కార్మికుడు సేవానివృత్తి అయినప్పుడు చెల్లిస్తారు. అదనంగా ఈ పెన్షన్‌ను చెల్లిస్తారు. దానిని మదింపు చేయటానికి ఒక ఫార్మూలాని నిర్దేశించారు. అదేంటంటే

| | | |
|---|---|---|
| **1.11.1952 – 31.5.1957** | **రూ.** | **300** |
| **1.6.1957 – 30.12.1962** | **రూ.** | **500** |
| **31.12.1962 –10.12.1976** | **రూ.** | **1000** |
| **11.12.1976 – 31.8.1985** | **రూ.** | **1600** |
| **1.9.1985 – 31.10.1990** | **రూ.** | **2500** |
| **1.11.1990 –30.9.1994** | **రూ.** | **3500** |
| **1.10.1994– 31.5.2001** | **రూ.** | **5000** |
| **11.01.2001–31.8.2014** | **రూ.** | **6500** |
| **1.4.2014 నుంచి ఇప్పటివరకు** | **రూ.** | **15000** |

**పెన్షన్‌కు అర్హమైన వేతనం × పెన్షన్‌కు అర్హమైన సర్వీసు / 70**

ఇక పెన్షన్‌కు అర్హమైన వేతనం అంటే పైన ఉదహరించిన పట్టిక గరిష్ఠ వేతన పరిమితిగా గ్రహించాలి. ఈ పథకంలో కార్మికుడు పెన్షన్ ఎటువంటి Contribution చెల్లించడు కాబట్టి యాజమాన్యం చెల్లించే 8.33 శాతానికి కేంద్ర ప్రభుత్వం 1.16 శాతం చెల్లిస్తుంది. గరిష్ఠ వేతన పరిమితి 15వేలు కాబట్టి యాజమాన్యం ప్రతి నెల పెన్షన్ పథకానికి 1250 రూపాయలు చెల్లిస్తుంది. దానికి కేంద్ర ప్రభుత్వం 1.16 శాతం చెల్లిస్తుంది అంటే ప్రభుత్వం నెలకి 174 రూపాయలు చెల్లిస్తుంది. గతంలో ఈ గరిష్ఠ పరిమితి తక్కువగా ఉండేది కాబట్టి అప్పట్లో సేవానివృత్తి అయినవారికి పెన్షన్ చాలా తక్కువగా ఉండేది. ఈ పథకం ప్రవేశపెట్టిందే 1995లో కాబట్టి అంతకుముందు చేసిన సర్వీసుకు Contribution లేదు కాబట్టి పెన్షన్ తక్కువగా ఉండటానికి మరో కారణమైంది. పలు కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు సెప్టెంబర్ 1వ తేదీ, 2014 నుంచి కనీస పెన్షన్ వెయ్యి రూపాయలుగా నిర్ణయించారు. ఈ కనీస పెన్షన్ చెల్లించటానికి అయ్యే అదనపు ఆర్థికభారాన్ని కేంద్ర ప్రభుత్వం ఈపిఎఫ్ఓ కి గ్రాంటు రూపంలో అందిస్తుంది. ఈ గరిష్ఠ వేతన పరిమితి వల్ల ఎంత వేతనం ఉన్నా, పెన్షన్‌కు అర్హత కలిగిన సర్వీసు 35 సంవత్సరాలు ఉన్నప్పటికి ఈ పథకం కింద పెన్షన్ 7500 కంటే మించి వచ్చేది కాదు. ఈ పెన్షన్ జీవితం మలి దశలో ఉన్నవారికి గౌరవంగా జీవించటానికి సరిపోదు కాబట్టి ఈ గరిష్ఠవేతన పరిమితి తొలగించాలని చాలామంది అభ్యర్థించారు. అయితే ఈ పరిమితి ఎత్తేస్తే తమపై అధిక భారం పడుతుందని యాజమాన్యాల వాదన. ఇప్పటికే అనేక వ్యాపార, పారిశ్రామిక, వాణిజ్యసంస్థలు లాభాలు తగ్గి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ ఇప్పుడు ఈ అదనపు భారం వహించటం తమకు మోయలేనిదిగా పరిణమిస్తుందని, పోనీ ఈ ఖర్చు తాము ఉత్పత్తి చేసే వస్తుసేవలపై వేసి వాటి ధరలు పెంచుదామా అంటే తమకు విదేశీ ఉత్పత్తుల నుంచి, ముఖ్యంగా చైనా, బాంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వచ్చే చౌక వస్తువుల నుంచి పోటీ పెరగటంవల్ల అది సాధ్యపడదని, ఈ స్థితిలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువైతే తమ సంస్థలను మూసేయాల్సిన పరిస్థితి వస్తుందని యాజమాన్యాలు వాదిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో కార్మికులకు పెన్షన్ పెంచి, యాజమాన్యాలపై అదనపు భారం పడకుండా మార్గం అన్వేషించాలనే ఆలోచనను ప్రక్కనపెట్టి పెన్షన్

మదింపు ఫార్ములాని మార్చవలసి వచ్చింది. దీనికి సుప్రీంకోర్టు 2022లో ఇచ్చిన తీర్పు ప్రధాన కారణం. తమకు లభించిన వేతనం ఆధారంగా తమ పెన్షన్‌ను మదింపు చేయాలని కొంతమంది సుప్రీంకోర్టును ఆశ్రయించటంతో ఈపీఎస్ నిబంధనలలో కల్పించ బడిన సౌకర్యం ఆధారంగా కార్మికులకు తమ వేతనం ఆధారంగా పెన్షన్ మదింపు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈపీఎస్ పథకంలో 2014లో మార్పులు చేసినప్పుడు, ఏ కార్మికులకైతే వాస్తవ వేతనం గరిష్ట పరిమితి అయిన 15వేలకు మించి ఉంటుందో వారికి వారి వాస్తవ వేతనం ఆధారంగా Contribution చెల్లించటానికి యాజమాన్యం కలిపి కార్మికుడు ఆరుమాసాలలోపు ఆప్షన్ ఇవ్వాలని నిబంధన చేసినా, చాలామంది ఈ ఆప్షన్ ఇవ్వలేక పోయారు. సుప్రీంకోర్టు తీర్పువల్ల కొంతమందికి అయినా తమ వాస్తవ వేతనం ఆధారంగా పెన్షన్ పొందే అవకాశం వచ్చింది. అయితే ఈపిఎఫ్ఓ నిర్వహించే ఈపీఎస్ విధానంలో లోపం ఏంటంటే ఏ కార్మికుడి పక్షాన యాజమాన్యం కాని, ప్రభుత్వం కాని ఎంత జమ అయ్యింది, దానిపై ఎంత ఆదాయం వచ్చింది. ఎంతమేరకు పెన్షన్ ఇవ్వ వచ్చునే వివరాలు విడి విడిగా లెక్కించదు. దానివల్ల కార్మికుడు లేదా లబ్ధిదారుడు పక్షాన యాజమాన్యం ఎంత పెన్షన్ పథకానికి జమచేసిందో తెలియదు. గరిష్ట పరిమితి వల్ల ఈపీఎఫ్‌కి వచ్చే Contributions చాలా తక్కువగా ఉంటున్నాయి. ఉదాహరణకు ఎవరైనా కార్మికుడు 1996లో ఏదైనా సంస్థలో చేరి ఆ యాజమాన్యం క్రమం తప్పకుండా Contribution చెల్లిస్తే, అతనికి అక్టోబర్, 2025 నాటికి ఆ యాజమాన్యం పెన్షన్ కంట్రిబ్యూషన్ క్రింద జమ చేసిన సొమ్ము 2.30 లక్షలు మాత్రమే. దానికి వడ్డీ ఎంత కలిపినా తక్కువ పెన్షన్ మాత్రమే ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. అందుకే ఈపీఎఫ్ / ఈపీఎస్ ద్వారా పెన్షన్ వచ్చేవారిలో చాలామందికి అతి తక్కువ పెన్షన్ వస్తుంది. 2023-24లో ఈపీఎస్ పథకం క్రింద పెన్షన్ల చెల్లింపుల వివరాలు పట్టికలో చూడవచ్చు.

| నెల పెన్షన్ | మొత్తం పెన్షనర్ల సంఖ్య | చెల్లించిన మొత్తం (కోట్లు) |
|---|---|---|
| 1000 | 36,60,201 | 3437.78 |
| 1001- 1500 | 12,06,470 | 1743.63 |
| 1501-2000 | 8,98,560 | 1881.59 |
| 2001-2500 | 9,29,483 | 2492.38 |
| 2501-3000 | 5,22,173 | 1857.48 |
| 3001-3500 | 2,56,059 | 1098.26 |
| 3501-4000 | 2,07,399 | 1085.80 |
| 4001-4500 | 1,19,935 | 664.60 |
| 4501-5000 | 19,550 | 679.73 |
| 5000 కంటే ఎక్కువ | 29,608 | 536.50 |
| | **78,49,338** | |




పట్టికను పరిశీలించినప్పుడు 4500 కంటే ఎక్కువ పెన్షన్ అందుకొంటున్నవారి సంఖ్య కేవలం 49,158, అంటే 78 లక్షలమంది కంటే ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్నప్పటికి, అందులో అత్యధికులు దాదాపు 99 శాతం మంది కేవలం రూ.4500 కంటే తక్కువ పెన్షన్ పొందుతున్నవారే. 36 లక్షలమంది కంటే పైన కేవలం వెయ్యిరూపాయల కనీస పెన్షన్ పొందుతున్నారు. ఆ చెల్లింపులు చేయడానికి కూడా ప్రభుత్వం రూ.958 కోట్లు ఈపీఎఫ్ఓకి అదనపు ఆర్థిక సాయం అందించవలసి వస్తున్నది. ఈ పెన్షన్ పథకం క్రింద 2023-24 నాటికి నిధికి చేరిన సొమ్ము రూ.8,88,270 కోట్లు. ఆ సంవత్సరం అంటే 2023-24లో చెల్లించిన మొత్తం పెన్షను విలువ రూ.14,866 కోట్లు. ఈ పెన్షన్ నిధిని కనీసం 7 శాతం వడ్డీకి ఇచ్చినా 62వేల కోట్లకు పైన ఆదాయం వస్తుంది కాబట్టి, ఇప్పుడు చెల్లిస్తున్న పెన్షన్లను పెంచటానికి (అది కూడా ప్రభుత్వం నుంచి అదనంగా గ్రాంటు అడగకుండా) అవకాశం ఉందని కొంతమంది వాదన.

అయితే లబ్ధిదారులు చేసిన Contribution గురించి నేరుగా లెక్కలు వేయనప్పటికి, వారి గరిష్ట వేతన పరిమితి ఆధారంగా పెన్షన్ గణించే విధానంలో మార్పు చేయటంవల్ల తీవ్రమైన పరిణామాలు ఉంటాయి కాబట్టి ఈపీఎఫ్ఓ అటువంటి నిర్ణయం తీసుకోవటానికి వెనుకడుగు వేస్తున్నది. పలు రాష్ట్రాల్లో వృద్ధాప్య పెన్షన్లు చెల్లించే సొమ్ము కన్నా తక్కువ అంటే 1000 రూపాయలు పెన్షన్ తమకు సరిపోకపోవడమేకాక తమ ఆత్మగౌరవం భంగపరిచే విధంగా ఉంటున్నదని ఈ పెన్షన్ పొందుతున్న కార్మికులు వాపోతున్నారు.

ఒకవైపు ప్రభుత్వోద్యోగులు సేవానివృత్తి అనంతరం తమ చివరి జీతంలో సగం పెన్షన్‌గా పొందుతున్నప్పుడు, సాంఘిక భద్రత క్రింద పేద వృద్ధులు పలు రాష్ట్రాలలో రూ. 4వేల వరకు పెన్షన్ పొందుతున్నప్పుడు తమ పెన్షన్‌ను పెంచకపోవడం సరైనది కాదని వారి వాదన. కనీస పెన్షన్ నిర్ణయించి 10 సంవత్సరాలు దాటినందున దానిని సవరించ వలసిన అవసరం ఉన్నదని ఒప్పుకోక తప్పదు. అయితే కేవలం కనీస పెన్షన్‌ను పెంచితే సరిపోతుందా? పెంచితే ఎంతమేరకు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని ఈపీఎఫ్ఓ కాని, కార్మిక మంత్రిత్వశాఖ కాని అధికారిక అంచనాలు విడుదల చేయనప్పటికి, కనీస పెన్షన్ రూ.2000 చేస్తే అదనంగా సంవత్సరా నికి రూ.6,000 కోట్ల భారం పడుతుంది. ఆ భారాన్ని ప్రభుత్వం అదనంగా గ్రాంట్‌గా ఇచ్చినా కేంద్ర ప్రభుత్వానికి పెద్ద భారం కాదు, లేదా ప్రస్తుతానికి పెన్షన్ నిధి నుంచి వచ్చే ఆదాయం నుంచి ఈ భారం భరించమని ఆదేశించినా ఇబ్బంది ఉండక పోవచ్చు. గరిష్టవేతన పరిమితి ప్రతి 5 సంవత్స రాలకు ఒకసారి పెంచటానికి ఒక శాశ్వత విధానాన్ని ఏర్పాటుచేయకపోతే ఈపీఎస్ క్రింద ఇచ్చే పెన్షన్లు, ఇతర పెన్షన్ల మధ్య వ్యత్యాసాలు కొనసాగుతాయి. ప్రభుత్వోద్యోగులకు నూతన పెన్షన్ విధానం ప్రవేశపెట్టినప్పుడు గరిష్ట వేతన పరిమితి విధించనప్పుడు ప్రైవేటు రంగంలో మాత్రం ఈ పరిమితిని కొనసాగించటం సరైనది కాదనే వాదన కూడా బలంగా ఉన్నది. మారుతున్న సామాజిక పరిస్థితులలో ఈపీఎస్ గరిష్ట వేతన పరిమితి పెంచి, కార్మికులకు సేవానివృత్తి అనంతరం గౌరవప్రదమైన పెన్షన్ వచ్చే విధంగా నిబంధనలను సవరించవలసిన అవసరం ఉంది. అయితే ప్రైవేటు యాజమాన్యాలలో పనిచేసి సేవానివృత్తి అయిన వారి పెన్షన్లు, ప్రభుత్వంలో పనిచేసి సేవానివృత్తి అయిన వారితో సమానంగా ఉండేట్టు మార్పులు చేయటం సాధ్యపడక పోవచ్చు. 2004 అనంతరం ప్రభుత్వంలో చేరిన వారికి నూతన పెన్షన్ విధానం క్రింద కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ప్రైవేటు సంస్థలు కూడా అమలు జరపవచ్చు కాబట్టి కొన్ని పెద్ద, పటిష్ట ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకి ఎన్‌పీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఈపీఎస్‌ను ఎన్‌పీఎస్‌తో సమానంగా సవరించటానికి మంత్రిత్వ శాఖ చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**– సాయి,** ఆర్థిక నిపుణులు


INTO YOUR LIFE
SURYA
INTO YOUR LIFE, WE BRING LIGHT, WARMTH, & STRENGTH.
INTO YOUR LIFE, WE BRING SURYA ROSHNI.
Surya Roshni is the trusted companion bringing light, warmth, and care to every moment. From purity in every sip to safe spaces, we bring innovation and reliability into your life. Let's brighten up your world together!
Consumer Lighting | Steel & PVC Pipes | Fans | Appliances | Professional Lighting
I am SURYA | 50 YEARS OF TRUST | DURABLE PRODUCTS | ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya surya_roshni surya.roshni surya-roshni
Email: info@surya.in Tel.: +91-11-47108000




"**Ma**haraja Prithu: The Unsung warrior King who annihilated Bakhtiyar Khalji" (Raktim Patar and Ranjit Hazarika), ‘ The Safron Souls’ (Mansosis Sinha) అనే వారు గ్రంథాలు రాశారు. ఈ గ్రంథాలు చరిత్రలోని ఒక ప్రత్యేక కోణాన్ని బహిర్గతం చేస్తాయి. జ్ఞానం మీద పగబట్టిన మతోన్మాదుల గురించి చెబుతాయి. పుస్తక భాండాగారాలకు నిప్పు పెట్టిన అనాగరిక మూకల గురించి వెల్లడిస్తాయి. అలాంటి వారిని ఎదిరించిన వాడే పృథు మహారాజు.కానీ ఆయన వీరత్వం గురించి చరిత్రపుస్తకాలు స్మరించుకోలేదు.

పుస్తకం మంచి మిత్రుడు, జీవిత మార్గదర్శి. పుస్తక పఠనంలో విజ్ఞానం, వెలకట్టలేని మానసిక ఆనందం సొంతం అవుతాయి. గ్రంథాలయం జీవిత పయనంలో ప్రతీ అడుగులోను తోడ్పడుతుంది. కలాలతో కాలాన్ని వెలిగించిన కవుల కావ్యాలను అధ్యాయనం చేస్తుంటే కలిగే ఆనందానుభూతి పరమాద్భుతమైనది. అక్షరం అంటే గుండె గుడిలోని దీపానికి ఇంధనం. మనస్సు ఎదుగుదలకు ఎనలేని సాధనం. కానీ ఇలాంటి జ్ఞానజ్యోతులను ఆర్పివేసిన దౌర్భాగ్యులు చరిత్రలో కొన్నిచోట్ల కనిపిస్తారు. వారిని ఎదిరించి, మట్టుపెట్టిన పృథు భారతీయుడు.

అక్షరం మీద ద్వేషం గురించి చెప్పే ఉదాహరణలు ప్రతిదేశంలోను ఉన్నాయి. చైనాలో క్విన్ రాజ వంశ మొదటి చక్రవర్తి క్విన్‌షి హుయాంగ్ క్రీ॥పూ॥ 213లో ‘పుస్తకాలను కాల్చండి, పండితులను పూడ్చి పెట్టండి’ (burning of books and burying of scholars) అంటూ ఆజ్ఞను జారీ చేశాడు. వీరు ఉంటే, వీరి ద్వారా జనం చైతన్యవంతులైతే తిరగబడతారని భయం.

బాబిలోనియాలో హమ్మురబీ క్రీ॥పూ॥ 1761లో మారి రాజ్యాన్ని ఆక్రమించి అక్కడి జిమ్రిలిమ్ లైబ్రరీని ధ్వంసం చేశాడు. 1258లో మంగోలులు బాగ్దాద్ ముట్టడి సమయంలో హౌస్ ఆఫ్ విజ్‌డం సహ నగరంలోని గ్రంథాలయాలన్నింటిని తగుల బెట్టాడు. కాలిపోయిన పుస్తకాల బూడిదను టైగ్రిస్ నదిలోకి తోసివేశాడు. కాబట్టే టైగ్రిస్ నీళ్లు నల్లబడ్డాయంటారు.

16వ శతాబ్దంలో డియోగోలాండా మాయా నాగరిక ప్రజలకు చెందిన విలువైన (కొడెక్స్‌లు) పురాతన పుస్తకాలు– మాన్యుస్క్రిప్టులు తగులబెట్టాడు. అవి అన్యమత విశ్వాసాలకు సంబంధించినవని కారణం కూడా ప్రకటించాడు.

ఈజిప్టులోని కైరో చారిత్రక విశ్వవిద్యాలయాన్ని 12వ శతాబ్దంలో సలావుద్దీన్ అయ్యూబీ ఫాతిమిద్ ఖిలాపత్‌ను పడగొట్టి, సున్నీ విద్యాకేంద్రంగా మార్చాడు. అయితే ఈ ప్రక్రియలో విశ్వవిద్యాలయానికి చెందిన గ్రంథాలయంలో లక్షలాది పుస్తకాలను ధ్వంసం చేయించాడు. అలెగ్జాండ్రియా లైబ్రరీని క్రీ॥పూ॥ 48లో సీజర్ కొంతవరకు నష్ట పరిచాడు. తరువాత క్రీ॥శ॥ 391లో అలెగ్జాండ్రియాలోని క్రైస్తవులు సెరాపియంలోని ఒక గ్రంథాలయాన్ని ధ్వంసం చేశారు. క్రీ॥శ॥ 642లో ఆరబ్ జనరల్ అమర్ ఇబీ–అల్–అస్ ఖలీఫా ఒమర్ ఆ దేశంలోని అన్ని పుస్తకాలను నగరంలోని స్నానపు గదులకు ఇంధనంగా వాడారు. కాని ఆధునిక చరిత్రకారులు దీనిని అంగీకరించడం లేదు. అయినా ఆ లైబ్రరీ కాలక్రమేణ పతనమైంది.

ఇలాంటి చరిత్రహీనులు భారతదేశ మధ్య యుగాల చరిత్రలోను ఉన్నారు. శాంతి కాముకత్వం, అహింస, సంఘ అభ్యుదయం, అభివృద్ధిని కాంక్షిస్తూ ఆచార్యులు నలందా విశ్వవిద్యాలయంలో పాఠాలు చెప్పిన కాలంలోనే ముస్లిం మతోన్మాదులు జ్ఞానం మీద దాడి చేశారు. బిహార్ రాష్ట్రంలో ఉన్న ప్రాచీన నలందా విశ్వవిద్యాలయాన్నీ కుమారగుప్తుడు 5వ శతాబ్దంలో (క్రీ.శ.427) ప్రారంభించినట్లు చెపుతారు. కాని బౌద్ధుల వాదన వేరు. ఏ వాదనలున్నా ప్రాచీన మగధ రాజ్యంలో సుమారు 700 సంవత్సరాలు (సుమారు 5వ శతాబ్ది నుండి 12 శతాబ్దం వరకు) వర్ధిల్లిన విద్యాకేంద్రమది. ప్రపంచంలోనే మొట్టమొదటి ఆవాస విశ్వకళా పరిషత్. విద్యార్థులకు వసతి గృహాలుండేవి. సుమారు 10,000 మంది విద్యార్థులు, 2000 మంది ఆచార్యులతో ఎనిమిది ప్రత్యేక ఆవరణలతో, పది దేవాలయాలతో, అనేక ధ్యానమందిరాలతో, ఎన్నో తరగతి గదులతో, ఉద్యానవనాలతో, కొలనులతో, ఎంతో ఆహ్లాదకర వాతావరణం ఉండేదని కొన్ని ఆధారాలు చెబుతున్నాయి.

నలంద విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రం, వేదాలు, అనేక విజ్ఞాన శాఖలు బోధించేవారు. ఇక్కడి గ్రంథాలయం గురించి ఎంత చెప్పినా తక్కువే. తొమ్మిది అంతస్తుల భవనంలో, మూడు విభాగాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయమది. ఆ విభాగాల పేర్లు–రత్నరంజక, రత్నోదధి, రత్నసాగర. వీటిలో లక్షలాది తాళపత్ర గ్రంథాలు భద్రంగా ఉండేవి. వాటిలో సుమారు 400,000 సంస్కృత గ్రంథాలున్నాయని ఒక అంచనా. ఇక్కడ పని చేసిన అధ్యాపకులలో ధర్మపాల, నాగార్జున, ధర్మకీర్తి, అసంగా, వసుబంధు చంద్రకీర్తి, జువాన్జాంగ్, శీలభద్ర, వజ్రబోధ, ఆర్యభట్ట కూడా ఉండి ఉండవచ్చునని చరిత్రకారుల అభిప్రాయం. వీరుగాక అభయంకర గుప్తా (వజ్రాయాన బౌద్ధసన్యాసి) విక్రయశిల విశ్వవిద్యాలయంలో కూడా పనిచేసి ఉండవచ్చును. అరియా బల్మ (కొరియా బౌద్ధ సన్యాసి) ఆర్యదేవుడు నాగార్జునుని విద్యార్థి, అతిషా బుద్ధ, గుహ్య (వజ్రాయన బౌద్ధ పండితులు), చంద్రగోమిన్ మహాయాన బౌద్ధ పండితుడు, ధర్మస్వామి (టిబెటన్ సన్యాసి), ప్రభాకర మిత్ర, శాంతిదేవ, ప్రజ్ఞా (ఆఫ్ఘనిస్తాన్‌లోని కపిసా), వుంకాంగో జువాన్జాంగ్, యిజింగ్ (చైనా) మరెందరో పండితులు ఇక్కడ పనిచేశారు.

# చరిత్ర పుటలకె
# పృథు మహారా


నలందా విశ్వవిద్యాలయం శిథిలాలు

హ్యువాన్‌త్సాంగ్ అనే ప్రసిద్ద చైనా యాత్రికుడు క్రీ॥శ॥ 637–642 మధ్య నలందా విశ్వవిద్యాలయాన్ని దర్శించి అక్కడ విద్యార్థిగా చేరి, చదువు పూర్తి అయ్యాక ఉపాధ్యాయునిగా పనిచేశాడు. ఈ విషయాన్ని ఆయన ది గ్రేట్ టాంగ్ రికార్డ్సు ఆన్ ది వెస్ట్రన్ రీజియన్స్‌లో ప్రకటించాడు. నలంద విశ్వవిద్యాలయ గొప్పతనాన్ని, దాని అద్భుతమైన నిర్మాణాన్ని, బోధనా పద్ధతులను, అక్కడ చేరిన పండితులను గురించి ఆయన వర్ణించాడు. హ్యువాన్‌త్సాంగ్ ఇక్కడ బౌద్ధతత్వం, వ్యాకరణం, తర్కం, సంస్కృత భాషలను విశ్వవిద్యాలయాధిపతి శీలభద్ర పర్యవేక్షణలో నేర్చుకున్నాడు.

భారతదేశం నుండి తిరిగి వెళ్లేటప్పుడు హ్యూవాన్ త్సాంగ్ 657 సంస్కృత గ్రంథాలను 20 గుర్రాలపై వేసుకొని వెళ్లాడు. ఆయన జ్ఞాపకార్థం నలందాలో యువాన్‌త్సాంగ్ మెమోరియల్ హాలును నిర్మించారు.

భారత్‌కు వచ్చిన మరో చైనా యాత్రీకుడు ఇత్సింగ్. ఇతడు బీజింగ్ దగ్గర చోచౌలో క్రీ॥శ 635లో జన్మించాడు. తన 19వ ఏట (654లో) తాను చదివిన బౌద్ధ గ్రంథం 'వినయ పిటక' బాగా నచ్చింది. దానిని చైనా భాషలోనికి తర్జుమా చేయాలనే కోరిక కలిగింది. చాంగన్ నగరంలో హ్యూవాన్‌త్సాంగ్‌ను కలిశాడు. కొన్నాళ్లకే హ్యూవాన్‌త్సాంగ్ 664లో మరణించాడు. ఇత్సింగ్ ఆయన అంత్యక్రియలు

## ...క్కని ...జు విజయం



పూర్తిచేసి భారత్‌కు బయలు దేరాడు. 671లో కాంటన్ నుండి సముద్రయానం ద్వారా భారత్‌కు 673లో చేరాడు. మగధ చేరాడు. నలందా విశ్వవిద్యాలయంలో 676-685 వరకూ ఉన్నాడు. అక్కడ నుండి సుమిత్రాలోని పాలెం బంగ్‌కు 689లో చేరి 692లో తిరిగి చైనాకు వచ్చాడు. అప్పటికి వూజితెయిన్ చైనా దేశపు రాణి. ఆమె ప్రోత్సాహంతో అనేక సంస్కృత గ్రంథాలను చైనా భాషలోనికి తర్జుమా చేశాడు. ఆమె తరువాత వచ్చిన రాజు జోంగ్ జంగ్ కూడా ఇత్సింగ్‌కు మంచి ప్రోత్సాహాన్నిచ్చాడు. తద్వారా తన తర్జుమా పనిని పూర్తిచేసి 713లో తన 79వ ఏట మరణించాడు.

హ్యూవాన్‌త్సాంగ్ తన రచనలో విక్రమశిల, ఓదంతపురి, తెల్‌హర (నలందాకు 33 కిలో మీటర్ల దూరంలో) విశ్వవిద్యాలయాలను గురించి రాశాడు. తిలాస్-అకియా లేక తిలదక్‌గా హ్యూవాన్‌త్సాంగ్ వివరించాడు.

ఇప్పుడు తలుచుకోవలసిన జ్ఞానద్వేషి భక్తియార్ ఖిల్జీ. 12-13 శతాబ్దాలలో ఉత్తర, తూర్పు భారత దేశంపై దాడిచేసిన ఆఫ్ఘన్ సైనికాధిపతి ఇతడే. నలందా, విక్రమశిల, ఓదంతపురి వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేసినందుకు చరిత్రలో గుర్తుండిపోయాడు. అతని దండయాత్రలు బిహార్-బెంగాల్‌లో విధ్వంసం సృష్టించాయి.

1197-1206 మధ్య భారత ఉపఖండంపై ఖిల్జీ దండయాత్రలు సామూహిక వలసలకు, సన్యాసుల ఊచకోతకు దారితీశాయి. ఉత్తర భారతంలోని సాంప్రదాయ బౌద్ధ ఉన్నత విద్యా సంస్థలను సమూలంగా నాశనం చేశాడు. మహాయాన బౌద్ధానికి ప్రధాన కేంద్రమైన నలందాలో రక్తపాతం, మానవ హననం ఊహకు అందనంతగా జరిగింది. కుతుబుద్దీన్ ఐబక్ కూడా భక్తియార్‌ను సత్కరించాడు. తారానాథ్ అనే చరిత్రకారుని ప్రకారం ఆక్రమణదారులు ఓడంతపురిలో అనేకమంది సన్యాసులను ఊచకోత కోసి విక్రమశిలను కూడా నాశనం చేశారు.

1202లో జరిగిన దండయాత్రలో అతను బౌద్ధ సన్యాసులను చంపి, అక్కడి భారీ గ్రంథాలయాలకు ఖిల్జీ నిప్పు పెట్టాడు. ఈ గ్రంథాలు దగ్ధమవ్వడానికి దాదాపు ఆరు నెలల సమయం పట్టిందని చెబుతారు. 1204లో బెంగాల్‌పై దాడికి వెళ్లి నదియా ప్రాంతాన్ని ఆక్రమించాడు. మ్లేచ్ఛ అనే హిందువును ఆలీగా మతం మార్చి తన సైనికాధికారిగా నియమించాడు. పాలకులు ఎప్పుడూ చరిత్రను తమకు అనుకూలంగా, తమకు కావలసిన మేరకే రాస్తారు. ఈ విషయం మనందరకు తెలుసు. అసలు కథ ఆ తరువాత ప్రారంభమయ్యింది.

పృథు మహారాజు (ఈయనకే విశ్వసుందర దేవుడు అనే పేరుంది) కామరూపా (అస్సామ్) పాలకుడు. ఆ సమయంలోనే భక్తియార్‌ఖిల్జీ నలందా, విక్రమశిల, ఓదంతపురి, తలికిమ్ విశ్వవిద్యాలయాలను నాశనం చేసి నలందాలోని గ్రంథాలయాన్ని అగ్నికి ఆహుతి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న మహారాజ పృథు ఆటవిక జాతులైన బోడో, దిమాసాలను, కోచ్ రాజవంశీయులను స్థానికుల సహాయంతో సైన్యంతో ఖిల్జీకి గుణపాఠం చెప్పడానికి మహారాజ పృథు సిద్ధమయ్యాడు. భక్తియార్ సైన్యం కామరూపకు వచ్చే మార్గంలో (Scorched Earth Policy) సైన్యానికి మంచినీరు ఆహారం దొరకకుండా గ్రామాలలోని బావులను పూడ్చడం, ఆహారాన్ని తగలబెట్టించాడు పృథు. దానితో భక్తియార్ సైన్యం



పృథు మహారాజు

ఆకలి దప్పికలతో అల్లాడిపోయింది. అతి కష్టం మీద ఉత్తర గౌహతికి చేరుకుంది ఆ సైన్యం. అక్కడ యుద్ధం జరిగింది. దానిలో భక్తియార్ మరణించాడు. అలీమ్లేచ్‌తో సహ తిరిగి వార్త చేరవేయడానికి కూడా మిగలకుండా సైన్యాన్ని చంపేసింది పృథు సేన. ఇది 1206వ సంవత్సరంలో జరిగింది. ఈ ఘటన చరిత్రపుటలకు ఎక్కలేదు. అయితే ఉత్తర గౌహతిలో ఒక శిలపై ఇలా రాసి ఉంది.

**"సాకే తురగ యుగ్మే సమధు మాస త్రయోదసే కామ రూపం సమాగత్య తురుష్కః క్షయ మాయమ్"**

సాకేతు సంవత్సరంలో కామరూపదేశానికి వచ్చిన తురుష్క సైన్యాన్ని సమూలంగా నాశనం చేశామని దీని అర్థం. దీనిని లెక్క కడితే సుమారు 1206కి వస్తుంది.

ఈ శిలను స్థానికులు "కానాయి బరోకి దువా కిరాలేక్" అంటారు. కృష్ణుడు ఆ రాతిపై కూర్చుండి చేపలు పట్టాడని చెపుతారు. ఈ రాయి పవిత్రతను కాపాడటానికి అలా వార్త ప్రాచుర్యంలోనికి తీసుకు వచ్చి ఉండవచ్చును.

ఈ పై సంఘటన గురించి అస్సామ్ ముఖ్య మంత్రి హిమంత బిశ్వశర్మ ఇలా అభిప్రాయపడ్డారు "A timeless reminder that Assam has always stood as the defender of Bharat's Soul"



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

# పతనం అంచున పాక్ ప్రజాస్వామ్యం

నవంబర్ 13న పాకిస్తాన్ పార్లమెంట్ ఒక కీలక రాజ్యాంగ సవరణను ఆమోదించింది. పాక్ న్యాయశాఖ మంత్రి అజాం నజీం తరార్ 27వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో దీన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. అంతకు ముందు నవంబర్ 8న ఈ బిల్లుకు ఫెడరల్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదేరోజు న్యాయశాఖ మంత్రి ఈ బిల్లును సెనెట్‌లో ప్రవేశపెట్టారు. తర్వాత ఈ బిల్లును ఉమ్మడిగా పరిశీలించేందుకు సెనెట్-నేషనల్ అసెంబ్లీ స్టాండింగ్ కమిటీలకు పంపారు. 26వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదన సమయంలో పక్కన పెట్టిన కొన్ని నిబంధనలను తిరిగి ప్రతిపాదించడమేంటంటూ ఈ కమిటీ సమావేశాన్ని జామాతే ఉలేమా-ఇ-ఇస్లామ్ (ఫజల్) పార్టీ నేతలు బహిష్కరించారు. తర్వాత దీనిపై సెనెట్‌లో చర్చించి తదనంతరం నేషనల్ అసెంబ్లీకి పంపగా నవంబర్ 12న దీనికి ఆమోదం తెలిపింది. ఎట్టకేలకు సెనెట్ నవంబర్ 13న ఆమోదం తెలుపగా ప్రెసిడెంట్ అసీఫ్ అలీ జర్దారీ దీనిపై అదేరోజు సంతకం చేశారు. తనను తాను ఎందుకూ కొరగాని బలహీన స్థాయికి దిగజార్చుకున్న ఇటువంటి ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రపంచంలో మరే ఇతర దేశంలో కానరాదు. ఇంతటి దౌర్భాగ్య స్థితి దాపురించడం పాకిస్తాన్‌కే చెల్లింది!

ముఖ్యంగా న్యాయవ్యవస్థలో నియామకాలు, రక్షణరంగ కమాండ్ వ్యవస్థ నిర్మాణ క్రమానికి సంబంధించిన రాజ్యాంగ అధికరణల్లో కీలక మార్పులను చేపట్టిన బిల్లు కావడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. దీని ప్రకారం "ఫెడరల్ రాజ్యాంగ కోర్టు" కొత్తగా ఏర్పాటవుతుంది. ఇప్పటి వరకు న్యాయమూర్తుల బదిలీలకు అనుసరిస్తున్న విధానా లను దాదాపు పూర్తిగా మార్చివేశారు. సైనిక దళాల నియంత్రణకు సంబంధించి 243వ అధికరణాన్ని సవరించారు. అంతేకాదు ప్రావెన్స్‌ల విత్త, పరి పాలనా స్వేచ్ఛకు సంబంధించిన అంశాలను కూడా సమీక్షించారు. ఈ బిల్లును ప్రవేశ పెడుతూ జాతీయ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు, పరిపాలనా క్రమాన్ని మరింత ఆధునికీకరించేందుకు ఈ సవరణలు అవసరమని అధికారంలోని సంకీర్ణ ప్రభుత్వం సమర్థించుకుంది. అయితే ప్రావెన్స్‌ల స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి ఇది భంగం కలిగించేదిగా ఉన్నదంటూ విపక్షాలు, న్యాయ నిపుణులు తీవ్రంగా విమర్శించారు. ఇక వాణిజ్య వర్గాలైతే దేశంలో విస్తృత చర్చ జరపకుండా రాజ్యాం గంలో ఈవిధంగా సమూల మార్పులు తీసుకొని రావడం అత్యంత ప్రమాదకరమని, మార్కెట్లు అస్థిరం కావడమే కాకుండా, మదుపర్ల విశ్వాసం దెబ్బ తింటుందని, ఇప్పటికే దేశ ఆర్థిక వ్యవస్థ అధ్వాన్నంగా ఉన్న పరిస్థితుల్లో మరింత అస్థిరతకు దారితీస్తుంటూ హెచ్చరించారు.

**కీలక రాజ్యాంగ సవరణ**

ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్తాన్ రాజ్యాంగాన్ని (1973) గతంలో చాలాసార్లు సవరించారు. ముఖ్యంగా సమాఖ్య, ప్రావెన్షియల్ ప్రభుత్వాల మధ్య అధికార సమతుల్యత, సంస్థాగత పాత్రలను పునర్ నిర్వచించడం, రాజకీయ భద్రతాపరమైన వాస్తవికతలకు తగిన విధంగా స్పందించాలన్న నెపంతో ఈ సవరణలు ఎప్పటికప్పుడు చేస్తూ వచ్చారు. ఇందులో భాగంగానే అక్టోబర్, 2024లో పాక్ పార్లమెంట్ 26వ రాజ్యాంగ సవరణను ఆమోదించింది. ప్రస్తుతం పార్లమెంట్‌లో మెజారిటీ సాధించిన షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం కొత్తగా 27వ రాజ్యాంగ సవరణను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. పార్లమెంట్ ఆమోదం పొందిన ఈ సవరణ చట్టం ప్రకారం, సుప్రీంకోర్టు ఇక ముందు రాజ్యాంగ సంబంధ కేసులను విచారించడానికి వీల్లేదు. కొత్తగా ఏర్పాటు చేసే పాకిస్తాన్ సమాఖ్య రాజ్యాంగ కోర్టు (ఎఫ్‌సీసీ)ఈ కేసులను విచారిస్తుంది. ముఖ్యంగా ప్రావెన్షియల్ ప్రభుత్వాల మధ్య, ఫెడరల్- ప్రావెన్షియల్ ప్రభుత్వాల మధ్య ఏర్పడే రాజ్యాంగపరమైన వివాదాలను పరిష్కరించే బాధ్యతను ఈ కొత్త కోర్టుకు దఖలు పరచారు. హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలు, బదిలీలు, పర్యవేక్షణ విషయంలో జ్యుడిషియల్ కమిషన్ ఆఫ్ పాకిస్తాన్‌కు పాత్ర ఉంటుంది తప్ప, స్వతంత్రంగా వ్యవహరించలేదు. అంటే న్యాయ వ్యవస్థ విచక్షణాధికారాల్లో ఈ సవరణ కోత విధిస్తోంది. అసెంబ్లీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా చిన్న ప్రావెన్స్‌ల్లోని ప్రావెన్షియల్ మంత్రి వర్గాల్లో మంత్రుల కనీస సంఖ్యను 11% నుంచి 13%కు పెంచారు. రాజ్యాంగంలోని 243వ అధికరణాన్ని సవరించడం ద్వారా సైనిక దళాలపై ఇప్పటివరకు ఫెడరల్ ప్రభుత్వానికున్న అధికారాల్లో మార్పులు తెచ్చారు. అంతేకాదు సైనిక నాయకత్వ కమాండ్ నిర్మాణంలో కూడా మార్పులు చేశారు.





దీని ప్రకారం ఇప్పటివరకు ఉన్న ఛైర్మన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీజేసీఎస్‌సీ) పోస్టు నవంబర్ 27 నుంచి రద్దవుతుంది. అప్పటినుంచి సైనిక దళాల ప్రధానాధికారి (చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్) చీఫ్ ఆఫ్ ది డిఫెన్స్ ఫోర్సెస్‌గా వ్యవహరిస్తారు. ఆర్మీ ఫీల్డ్ మార్షల్, మార్షల్ ఆఫ్ ఎయిర్ ఫోర్స్ లేదా అడ్మిరల్ ఆఫ్ ది ఫ్లీట్ స్థాయి అధికార్లకు జీవితకాలం అదే స్థాయి ప్రయోజనాలు కల్పించారు. ఫెడరల్ ప్రభుత్వ ఆదాయాన్ని ప్రావెన్స్‌లకు నేషనల్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా పంపిణీ చేసే విధానాన్ని సమీక్షించారు. ఈ సవరణలను ప్రధాన విపక్షమైన పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది రాజ్యాంగ మూలాలనే దెబ్బతీసేదిగా ఉన్నదని, కేవలం రాజ్యాంగంపై పన్నిన కుట్రగా అభివర్ణించింది. సెనెటర్ సయ్యద్ అలీ జాఫర్, సెక్రటరీ జనరల్ సల్మాన్ అక్రమ్ రాజా, ఖైబర్ ఫఖ్తూన్‌క్వా ప్రభుత్వం, విపక్ష కూటమి తెహ్రీక్-ఇ-తహఫజ్ అయాన్ పాకిస్తాన్ (టీటీఏపీ), ఫఖ్తూన్ క్వా మిల్లీ అవామీ పార్టీ, బెలూచిస్తాన్ నేషనల్ పార్టీ-మెంగాల్ (బీఎన్‌పీ-ఎం)లు ఈ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపు నిచ్చాయి. ఈ సవరణను వ్యతిరేకిస్తూ ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు మన్సూర్ అలీ షా, అతహర్ మినల్లాలు తమ రాజీనామాలు సమర్పించారు. ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ జూరిస్ట్స్ ఇది చట్టంపై జరిపిన దాడిగా వర్ణించడం తదనంతర పరిణామం.

**అసీమ్ మునీర్ అసలు స్వరూపం**

ఈ సవరణలో అత్యంత కీలకంగా పేర్కొనదగిన అంశం ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్‌కు జీవితకాలం, విచారణ, అరెస్ట్‌లనుంచి పూర్తి రక్షణ కల్పించడం. ఇప్పటికే పరోక్ష సైనిక పాలన కొనసాగుతున్న తరుణంలో, ఈ సవరణ ప్రత్యక్ష నియంతృత్వానికి దారితీస్తుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనరల్ జియా ఉల్ హక్, పర్వేజ్ ముషారఫ్‌లు దేశాధ్యక్షులుగా పాలించడాన్ని "సివిల్-మిలిటరీ హైబ్రిడ్" పాలనగా సమర్థకులు పేర్కొంటున్నారు. ఇప్పుడు దేశం ఈ "హైబ్రిడ్" వ్యవస్థను కూడా దాటి "హైబ్రిడ్ అనంతర దశ" కు చేరుకున్నదని చెప్పాలి. ఎందుకంటే ప్రజలచేత ఎన్నిక కాకుండానే మునీర్ అన్ని రకాల అధికారాలను, రక్షణలను పొందుతున్నారు మరి! ప్రస్తుత సవరణతో సైన్యంతో పాటు నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లు అసీమ్ మునీర్ ఆధీనంలోకి వస్తాయి. ఇందుకోసం చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎస్) పోస్టును ఏర్పాటు చేస్తారు. ఈ విధులను కూడా ఆర్మీ చీఫే నిర్వర్తిస్తారు! ఫీల్డ్ మార్షల్‌గా మునీర్ తన జీవితకాలం యూనిఫాంను ధరించవచ్చు. రిటైరైన తర్వాత ప్రధాని సలహా మేరకు, దేశాధ్యక్షుడు మునీర్‌కు కొన్ని "బాధ్యతలు-విధులు" అప్పగించవచ్చు! సైన్యంలోని కీలక పోస్టులనుంచి పదవీ విరమణ చేసివారిని కూడా అరెస్ట్, విచారణల నుంచి రక్షణ కల్పించడంపై ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. రాజ్యాంగంలోని 248వ అధికరణం ప్రకారం దేశాధ్యక్షుడు, గవర్నర్లు తమ పదవుల్లో కొనసాగుతున్నప్పుడు ఏవిధమైన నేరపూరిత విచారణలను జరపడానికి వీల్లేదు! అంటే వారు పదవినుంచి తొలగిన తర్వాత ఈ విచారణ చేపట్ట వచ్చు. ఇప్పుడు సైనికాధికార్లకు ఇటువంటి విచారణల నుంచి జీవితాంతం రక్షణ కల్పించడమనే అపభ్రంశపు నిర్ణయం కేవలం పాకిస్తాన్‌కే చెల్లింది. ప్రస్తుతం జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీజేసీఎస్‌సీ)గా ఉన్న జనరల్ షాహిర్ షంషార్ నవంబర్ 27న పదవి విరమణ చేసారు. ఈయన ఫోర్ స్టార్ జనరల్. ఈయన తర్వాత ప్రస్తుత రాజ్యాంగ సవరణ ప్రకారం ఈ పోస్టు రద్దవుతుంది. కొత్తగా దీని స్థానంలో ఏర్పాటు చేసిన సీడీఎస్ పోస్టులో ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ కొనసాగుతారు.

> ఈ ఏడాది మే నెలలో ఆపరేషన్ సింధూర్‌లో భారత్ చేతిలో ఘోర పరాభవాన్ని మూటకట్టుకున్న తర్వాత, ఫైవ్ స్టార్ స్థాయి ఫీల్డ్ మార్షల్‌గా అసీమ్ మునీర్ ప్రమోషన్ పొందారు. ఒక "ఫెయిల్డ్ మార్షల్"గా ఆ పోస్టు స్థాయిని దిగ జార్చిన ఘనత కూడా మునీర్‌దే! 1960లో ఫీల్డ్ మార్షల్‌గా అయూబ్ ఖాన్ ఒక్కరే ఇప్పటి వరకు ఫైవ్ స్టార్ స్థాయిని పొందారు.

సీజేసీఎస్‌సీ త్రివిధ దళాలను సమన్వయం చేస్తే, సీడీఎస్‌గా మునీర్ ఆధీనంలో నేరుగా ఈ మూడు విభాగాలు పనిచేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే నెలలో ఆపరేషన్ సింధూర్‌లో భారత్ చేతిలో ఘోర పరాభవాన్ని మూటకట్టుకున్న తర్వాత, ఫైవ్ స్టార్ స్థాయి ఫీల్డ్ మార్షల్‌గా అసీమ్ మునీర్ ప్రమోషన్ పొందారు. ఒక "ఫెయిల్డ్ మార్షల్"గా ఆ పోస్టు స్థాయిని దిగజార్చిన ఘనత కూడా మునీర్‌దే! 1960లో ఫీల్డ్ మార్షల్‌గా అయూబ్‌ఖాన్ ఒక్కరే ఇప్పటి వరకు ఫైవ్ స్టార్ స్థాయిని పొందారు. ఇప్పుడు అసీమ్ మునీర్ రెండోవారు. 27వ రాజ్యాంగ సవరణకు ముందు ఫీల్డ్ మార్షల్ పోస్టు కేవలం ఒక గౌరవ ప్రదమైన స్థాయిగా పరిగణించేవారు. ఈ స్థాయిలో ఏ విధమైన ప్రత్యేక ప్రయోజనాలు ఉండేవి కావు. కానీ ప్రస్తుత రాజ్యాంగ సవరణ ద్వారా దీన్నొక రాజ్యాంగ పదవిగా పరిగణిస్తారు. అంతేకాదు ఫీల్డ్ మార్షల్ పదవినుంచి తొలగించాలంటే పార్లమెంట్‌లో 2/3వ వంతు మెజారిటీ అవసరం. అదే ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చడానికి సాధారణ మెజారిటీ సరిపోతుంది. తన స్వార్థం కోసం సివిలియన్ ప్రభుత్వాన్ని మునీర్ తన కట్టు బానిసగా ఏవిధంగా ఉపయోగించుకున్నారో దీన్నిబట్టి స్పష్టమవుతోంది. ఈ విధంగా ఒక ఆర్మీ జనరల్‌కు ప్రయోజనాలు కల్పించడమంటే "నిర్లక్ష్యాన్ని రాజ్యాంగ హక్కుగా పరిగణించడమే". ఇంతటి ప్రయోజనాలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఏ నాయకుడికీ కలిగించలేదు. ఇప్పటి వరకు నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాల్లో ఎవరూ ఫైవ్‌స్టార్ ర్యాంకు ఆఫీసర్లు లేకపోవడం గమనార్హం. అంతేకాదు ప్రస్తుత సవరణ, కమాండర్ ఆఫ్ నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ (ఎన్ఎస్‌సీ) పోస్టును కూడా సృష్టించింది. దేశ న్యూక్లియర్ కమాండ్ ఈయన నియంత్రణలోనే ఉంటుంది. ఈ కమాండర్‌ను ఆర్మీ



చీఫ్/సీడీఎస్‌లను సంప్రదించిన తర్వాత ప్రధాని నియమిస్తారు. అంటే రాబోయే కాలంలో అసీమ్ మునీర్ సూచించిన వ్యక్తే ఈ పోస్టులో నియమితుడవుతారు. ఆయన కేవలం సీడీఎస్‌గా ఉన్న అసీమ్ మునీర్‌కే జవాబుదారీగా ఉంటారు తప్ప ప్రధానికి కాదు! గతంలో జియా ఉల్ హక్, పర్వేజ్ ముషారఫ్‌లు దేశాధ్యక్షులుగా సర్వాధికారాలు చలాయించారు. ఆర్మీ చీఫ్‌లుగా కూడా పరోక్షంగా దేశాన్ని నియంత్రించారు. సైనిక పాలన ప్రకటించడం ద్వారా వారు కొంతమేర అప్రతిష్టను మూటకట్టుకున్నారనే చెప్పాలి. కానీ మునీర్ ఎటువంటి మార్షల్ లా ప్రకటించకుండానే, పౌర ప్రభుత్వం చేతనే తనకు కావలసిన సర్వాధికారాలను పొందారు. ఆ విధంగా ఒక పద్ధతి ప్రకారం పౌర ప్రభుత్వాన్ని ఒక తోలు బొమ్మగా మార్చిన అసీం మునీర్ పాక్ చరిత్రలో ఒక "అసమర్థ, నక్కజిత్తుల, స్వార్థపర" సైనిక జనరల్‌గా మిగిలిపోనున్నారు. నిజం చెప్పాలంటే పాక్‌లో పౌర ప్రభుత్వం ఇంత దారుణమైన బలహీన స్థితికి గతంలో ఎప్పుడూ చేరుకోలేదు. అసలు సైన్యంలో సంస్కరణలు చేపట్టాల్సిన తరుణంలో ఈవిధంగా గంపగుత్తగా అధికారాలను అప్పగించడమేంటనేది విమర్శకుల ప్రశ్న. ప్రజాస్వామ్యం కోసం గట్టిగా పోరాడు తాయనుకునే పశ్చిమ దేశాలు కూడా పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యాన్ని నిలువెత్తు గొయ్యి తీసి పూడ్చేస్తున్న చర్యలను చూసి నోరెత్తకపోవడం విచిత్రం. అన్నింటికీ మించి అవి పాక్ సైన్యానికి తమ ఆమోదం తెలుపుతుండటం మరో వైపరీత్యం.

**నామమాత్రంగా సుప్రీంకోర్టు**

సుప్రీంకోర్టు అధికారాలను తగ్గించడం 26వ రాజ్యాంగ సవరణ దగ్గరి నుంచే మొదలైంది. గత ఏడాది అక్టోబర్‌లో అమల్లోకి వచ్చిన ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం సుప్రీంకోర్టు 'సుమోటో'గా ఏ కేసునూ విచారించడానికి వీల్లేదు. 2008లో సుప్రీంకోర్టు పర్వేజ్ ముషార్రఫ్‌ను పదవి నుంచి తొలగించింది కేవలం ఈ అధికారంతోనే! ఆ విధంగా అప్పట్లో పాక్‌లో సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో కీలక పాత్ర పోషించింది. ప్రస్తుత రాజ్యాంగ సవరణ ద్వారా న్యాయవ్యవస్థ నియామకాలు పూర్తిగా కార్యనిర్వాహక వ్యవస్థ చేతిలోకి వెళ్లిపోయాయి. అంటే ఇకనుంచి న్యాయవ్యవస్థలో నియామకాలు సైన్యం నిర్దేశం ప్రకారం, ప్రభుత్వ పాలకులు జరుపుతారన్నమాట. ఈవిధంగా పాలన, సైన్యం, న్యాయవ్యవస్థలపై సైన్యానికి (అసీమ్ మునీర్‌కు) పూర్తి ఆధిపత్యం వచ్చినట్టే. ఈ సవరణ పుణ్యమాని సుప్రీంకోర్టు గతంలో తన ఉనికికి ఒక 'ఛాయా' మాత్రంగా మిగిలిపోనున్నది. ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి యాహ్యా అఫ్రిదీ మాత్రం పదవీ విరమణ వరకు చీఫ్ జస్టిస్‌గానే కొనసాగనుండటం గుడ్డిలో మెల్ల! ఆయన తర్వాత సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు ప్రధాన న్యాయమూర్తుల్లో సీనియర్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులవుతారు. ఈ రాజ్యాంగ సవరణకు ముందు సుప్రీంకోర్టు రాజ్యాంగ వివాదాల కేసులను విచారించేది. ఇప్పుడు కేవలం అప్పిలేట్ కోర్టుగానే వ్యవహరించనుంది. ఇకనుంచి సుప్రీంకోర్డ్ ఆఫ్ పాకిస్తాన్‌కు బదులు కేవలం సుప్రీంకోర్టు అని మాత్రమే వ్యవహరిస్తారు. సివిల్ కేసులు కుప్పలు తెప్పలుగా పేరుకు పోవడం వల్లనే ఎఫ్‌సీసీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు సవరణ సమర్థకులు చెబుతున్నా, నిజానికి అంతటి స్థాయిలో కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో లేని అంశాన్ని విమర్శకులు గుర్తుచేస్తున్నారు. ఒకవేళ అటువంటి కేసులకు సత్వర పరిష్కారం లభించాలంటే, వాటికి సంబంధించిన సంస్కరణలు అమల్లోకి తేవడమే ఉత్తమమని వీరు వాదిస్తున్నారు.

**ఫెడరల్ కాన్‌స్టిట్యూషనల్ కోర్ట్**

కొత్తగా ఏర్పాటు కానున్న ఫెడరల్ కాన్‌స్టిట్యూషనల్ కోర్ట్ (ఎఫ్‌సీసీ)కి ఒక ప్రధాన న్యాయమూర్తితో పాటు, ప్రస్తుత సుప్రీంకోర్టుకు సమానంగా న్యాయమూర్తులుంటారు. పాకిస్తాన్‌లోని నాలుగు ప్రావెన్స్‌ల నుంచి నలుగురు న్యాయమూర్తులు నియమితులవుతారు. ఈ కోర్టుకు కూడా ప్రత్యేక భవనాలు, సిబ్బంది ఉంటారు. ఈ కోర్టు ప్రభుత్వాల మధ్య ఏర్పడే రాజ్యాంగ పరమైన వివాదాలపై విచారణ జరుపుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 65 ఏళ్లకే పదవీ విరమణ చేస్తే, ఎఫ్‌సీసీ జడ్జ్‌ల పదవీ విరమణ వయస్సు 68 సంవత్సరాలు! అయితే ఎఫ్‌సీసీ ప్రధాన న్యాయ మూర్తి పదవీకాలం మూడేళ్లుగా నిర్ణయించారు. జ్యుడిషియల్ కమిషన్ ఆఫ్ పాకిస్తాన్ (జేసీపీ) సిఫారసు మేరకు దేశాధ్యక్షుడు న్యాయమూర్తులను బదిలీ చేస్తారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నియామకాలపై సిఫారసు చేసే అధికారం ఈ సంస్థకే ఉంటుంది. గత ఏడాది అమల్లోకి వచ్చిన 26వ రాజ్యాంగ సవరణ ప్రకారం హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలు దేశాధ్యక్షుడి ఆమోదంతోనే జరగాల్సి ఉంటుంది. పాక్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రెండు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల సూచనతో పాటు బదిలీ విషయంలో సదరు న్యాయమూర్తి సమ్మతి కూడా అవసరం. తాజా రాజ్యాంగ సవరణ ప్రకారం కేవలం జేసీపీ సిఫారసు మేరకు దేశాధ్యక్షుడు బదిలీ చేయవచ్చు. ఇందుకు న్యాయమూర్తుల సలహాలు, సమ్మతి అవసరంలేదు. ఒకవేళ సదరు న్యాయమూర్తి తన బదిలీని వ్యతిరేకిస్తే అందుకు సరైన కారణాలు చూపుతూ జేసీపీని ఆశ్రయించాలి. ఆయన చూపే కారణాలు సరైనవి కాదని జేసీపీ భావిస్తే, ఆ జడ్జికి పదవీ విరమణ తప్ప గత్యంతరం ఉండదు. దీనివల్ల రాజకీయ నాయకులు జడ్జీల బదిలీల్లో కక్షసాధింపు చర్యలకు పాల్పడే అవకాశముంది. రాజకీయ నాయకులు సైన్యం చేతిలో పావులు కనుక, సైన్యమే తనకు అనుకూలంగా బదిలీలు చేయిస్తుందనుకోవాలి! ఈవిధంగా సైన్యం ఛత్రం కింద, కార్యనిర్వాహక శాఖ... న్యాయవ్యవస్థ నుంచి తనను తాను కాపాడుకోవడమే కాకుండా, జవాబుదారీతనం నుంచి తేలిగ్గా తప్పించుకోగలుగుతుంది. ఆవిధంగా కార్య నిర్వాహక శాఖ ఆధీనంలోకి వెళ్లిన న్యాయవ్యవస్థలో నిష్పాక్షిక న్యాయం జరుగుతుందని భావించడం వృథా!



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్



డిసెంబర్ 5
ప్రపంచ భూసార
దినోత్సవం

# నేల ఆరోగ్యం.. మానవాళికి కీలకం

**మనం నివసిస్తున్న ఈ భూగోళం ముఖ్యంగా రెండు పదార్థాలను కలిగి ఉండి, వాటి ద్వారా ఏర్పడింది. ఒకటి నీరు, రెండు భూమి (నేల). ఈ నేలమీద నివసిస్తూ, నేలనుండి ఉద్భవించిన, పండిన ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, మసాలా దినుసులు మొదలగు వాటిని ఆహారంగా స్వీకరిస్తూ మనం ఆరోగ్యంగా జీవిస్తున్నాం. అంటే నేల మన జీవనధారం. అలాంటి నేల గురించి ఆలోచించడం, ఈ నేలను మన మనుగడకై సంరక్షించుకోవడం, భావితరాలకు నాణ్యతతో మిగిల్చి అప్పచెప్పడం మన ప్రథమ కర్తవ్యం. ఈ మానవ జీవనధార మైన నేలను గౌరవిస్తూ డిసెంబర్ 5ను "ప్రపంచ నేల దినం" (వరల్డ్ సాయిల్ డే)గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ దినోత్సవాన్ని మొదటగా డిసెంబర్ 5, 2014న ప్రపంచ దేశాలు జరుపుకున్నాయి. ఇదేరోజు దివంగత థాయిలాండ్ రాజు భూమిబోల్ ఎడుల్యాడేజ్ జన్మదినం. ఆయన జన్మదిన గౌరవ సూచకంగా ఈ రోజుని వరల్డ్ సాయిల్ డేగా ప్రకటించారు. కారణం ఆయన వరల్డ్ సాయిల్ డే జరపాలని చాలా సంవత్సరాల క్రితమే అభిలాషించిన మహనీయుడు**

ఆరోగ్యకరమైన నేలలు- ఆరోగ్యకరమైన నగరాలు అన్నది 2025 వరల్డ్ సాయిల్ డే ముఖ్య నినాదం. ఈ నినాదం ముఖ్య ఉద్దేశ్యం మనందరికీ నగరాలలోని నేల ప్రాకృతిక, సేంద్రియ స్వభావాలను కాపాడు కోమని హితవు పలకడం, అలాగే హెచ్చరించడం కూడా. నగర ప్రజల, స్వచ్ఛమైన నగరాల మనుగడకు, అలాగే నగరాలలో స్వచ్ఛమైన భూగర్భ జలాలు, భూగర్భ ఉష్ణోగ్రతల సమతుల్యత లకు, నగర నేలలోని జీవనాధారమైన ఖనిజ లవణాల లభ్యతకు, జీవ వైవిధ్య మనుగడకు స్వచ్ఛమైన నేలలు ఎంత అవసరమో నొక్కి వక్కాణించి చెప్పడం. అలాగే ఈ నినాదం ప్రభుత్వాలలోని విధి, విధాన రూపకర్తలు, శాస్త్రజ్ఞులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా కృషి చేసి, నగర నిర్మాణ ప్రణాళికలలో హరిత వృద్ధి, కాలుష్య నియంత్రణతో, స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడానికి ఒక మేలుకొలుపుగా భావించాలి. భారతదేశానికి భూ పరిరక్షణ విధానం కొత్త విషయం కాదు. మన సనాతన చరిత్ర పరిశీలిస్తే రుగ్వేదంలో, అధర్వవేదంలో ఉన్న శ్లోకాలలో నేల సంరక్షణ తద్వారా ప్రకృతిలోని పర్యావరణ సమతుల్యత గురించిన ప్రస్తావన ఉంది. ముఖ్యంగా అధర్వవేదంలో సేంద్రియ ఎరువులు, మొక్కల మృత్తికలను, పశువుల ఎరువును వాడి భూసారం పెంచి, భూమిని వ్యవసాయ యోగ్యంగా చేసుకోవాలని ఉంది. క్రీ.పూ. 268-232లో అశోకుడు చెట్లు నాటించడం, ఔషధ/సుగంధ ద్రవ్య మొక్కలను సాగుచేయించడం భూసార పరిరక్షణను ఉద్దేశించి కూడా చేసినవని చరిత్రకారుల అభిప్రాయం. అలాగే కౌటిల్యుని అర్ధ శాస్త్రంలో (క్రీస్తు పూర్వము 4వ శతాబ్దం లోనే) వ్యవసాయానికి సేంద్రియ ఆధారిత భూసార పరిరక్షణ, వ్యవస్థీకృత నీటి నిల్వలు, నీటి పారుదల ఆవశ్యకతలు పేర్కొనడం జరిగిందని గ్రంథాలు చెపుతున్నాయి. పరాశరుని "కృషి పరాశర" లో (క్రీ. పూ. 400 లో) దీర్ఘ కాలిక నేల సేంద్రియ స్వభావ పరిరక్షణ కోసం సంప్రదాయ పద్ధతులు పాటించాలని ఉంది. వరాహమిహిరుని బృహత్ సంహిత అనే గ్రంథంలో (క్రీ. శ. 6వ శతాబ్దంలో) సేంద్రియ ఎరువుల వాడకం, నీటి పొదుపు, పంట మార్పిడి మొదలగు పద్ధతులు భూసార పరిరక్షణకు చాలా అవసరమని ఉంది.

ఆధునిక శకం- క్రీస్తు శకము 1000లో వృక్ష ఆయుర్వేద శాస్త్రం (సు రపాల)లో, వృక్ష విజ్ఞానశాస్త్రం అనే అంశంలో జీవ ఆధారిత ఎరువులను (బయో ఫర్టిలైజర్స్) వాడి నేలను ఎలా సారవంతం చేసుకోవాలి అనే విషయాలున్నాయి.. కుంజాఫల (పశువుల పేడ, మూత్రంతో చేసిన ద్రవరూపంలోని ఎరువు) అలాగే పంచగవ్య (ఆవుపేడ, ఆవు మూత్రం, పాలు, పెరుగు, నెయ్యిల మిశ్రమం) కలిపి తయారు చేసిన ఎరువులు వాడాలని పేర్కొన్నట్లు సమాచారం. ఆధునిక పరిణామాల విషయానికొస్తే జేడబ్ల్యూ లీథర్ అనే శాస్త్రవేత్తను భారత్‌లో మృత్తికా శాస్త్రం, వ్యవసాయ రసాయన శాస్త్రాలకు పితామహుడు అని చెప్పవచ్చు. ఆయనను భూసార పరిశోధనకు శ్రీకారం చుట్టిన మహానుభావుడని అంటారు. భూసార పరిశోధనా కేంద్రమైన పూసా పరిశోధన సంస్థ ఉద్భవించడానికి శ్రమించిన వ్యక్తి. అలాగే భారతదేశ హరిత విప్లవ పితామహుడు, రెండవ హరిత విప్లవానికి పునాది వేసిన మహా మనీషి, వ్యవసాయ విజ్ఞానవేత్త దివంగత డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్. ఈయన కూడా భూసార



మహావాది రామకృష్ణ

పరిరక్షణకు విశేషమైన కృషి చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎంతో ఉంది.

అందుకే ప్రతియేటా డిసెంబర్ 5ను ప్రపంచ నేల దినోత్సవంగా జరుపుకోవడంలో మన మందరమూ ముందుండడం ఎంతో అవసరం. ఎందుకంటే సారవంతమైన నేలనుండి పండే ఆహార పదార్థాలు తినే మనం ఆరోగ్యంగా జీవించగలుగుతున్నాము. అందుకే మనం భూమాతకు అత్యంత రుణపడి ఉన్నాం. అయితే అధిక దిగుబడులకోసం రసాయన ఎరువులు, అధిక మొత్తంలో విషపూరిత కీటక నాశినులను వాడుతూ సారవంతమైన నేలలను మనం పాడుచేసుకుంటున్న వైనం గమనార్హం, గర్హించదగ్గ విషయం. అందుకే ప్రపంచ నేల దినోత్సవాన మనమందరం సేంద్రియ పద్ధతులను పాటిస్తూ మన భూములను పరిరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేద్దాం. అప్పుడే మనము నేల, మొక్కలు, భూగర్భ జలాలు, జీవకోటి ఆరోగ్య సమతుల్యత లను సాధించగలం. ఒక వైపు పంట పొలాల భూసారమెంత ముఖ్యమో అలాగే రెండోవైపు పట్టణాలు/ నగరాలలో నేల పరిరక్షణ కూడా అంతే ముఖ్యమన్నది నిర్వివాదాంశం.

ప్రస్తుత పరిస్థితులలో ఈ సమస్య గంభీరమై మానవ మనుగడకే పెను ముప్పుగా మారుతోంది. విపరీతంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, వాణిజ్య కార్యకలాపాలు, పుట్టగొడుగుల్లా వెలుస్తున్న /విస్తరిస్తున్న కాలుష్య కారక పరిశ్రమల వలన, గ్రామాలనుంచి పట్టణాలకు, నగరాలకు వలసలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా నగరాలు, వాటి చుట్టుప్రక్కల ప్రాంతాలు అత్యధిక చెత్త, చెదారం, వాణిజ్య పరిశ్రమల వ్యర్థ్యాలతో నిండి కాలుష్య కాసారాలవుతున్నాయి. ఫలితంగా ఈ హానికారక వ్యర్థాలు భూమి మీద పేరుకొని పోయి, భూమి పొరల్లోకి హానికారక ఖనిజాలు, లవణాలు, బాక్టీరియా, వైరస్‌లు ప్రవేశిస్తున్నాయి. భూమిని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. వాననీటి కుంటలు, చెరువులు, చివరకు పట్టణ ప్రాంతంలో ప్రవహించే నాలాలు, నదులు (ఉదాహరణకు హైదరాబాదులో మూసీ, ఢిల్లీలో యమున, కాన్పూర్‌లో గంగ, చెన్నైలో కూవం లాంటి నదులు) కూడా కలుషితమవుతున్నాయి. ప్రజా ఆరోగ్యం ప్రశ్నార్థకంగా నిలిచింది. ఇక మున్సిపల్ ఘన వ్యర్థాల విషయానికి వస్తే నగరాల్లో ఎక్కడ చూసినా కుప్పలే. ఫలితంగా నగరాల్లో నేల విపరీతంగా కలుషితమవు తోందనడంలో సందేహం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీకి, వ్యర్థాలను తగ్గించాలని పరిశ్రమలకు కాలుష్య నియంత్రణ మండలి సూచిస్తుంటే, నెపాన్ని మున్సిపాలిటీ ప్రజల మీదకు, ప్రజలు మున్సిపాలిటీ, వాణిజ్య సంస్థలు, పరిశ్రమల మీదకు నెట్టడంతో సరిపోతోంది. ఇది చాలదన్నట్టుగా జీవ వ్యర్థాలు, రసాయన వ్యర్థాలు, తోళ్ల పరిశ్రమ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పెయింట్ వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు, ఇనుప వ్యర్థాలు, ఎలక్ట్రికల్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, మానవ విసర్జితాలు, చమురు వ్యర్థాలు లాంటి వాటిని ఎక్కడికక్కడ అనధికారి కంగా వదిలిపెట్టడం జరుగుతోంది.

ఈ సందర్భంగా రైతుగా రాణించాలనుకునేవారికి మొదటగా నేల స్వభావం తెలిసి ఉండాలి. పౌరులందరూ జీవనశైలిని మార్చుకొని వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన పౌరులుగా మనుగడ సాగించవచ్చు అని మన పెద్దలు చెప్పిన మాట ఇక్కడ ప్రస్తావనకు అర్హమైనది. అప్పుడే మనం మన పూర్వికులు మనకు జాగ్రత్తగా నిర్వహించి అప్పచెప్పిన నేలను మనం మన భావితరాలకు స్వచ్ఛతతో అప్పచెప్పగలం. తద్వారా ప్రపంచ నేల దినోత్సవాన్ని జరుపుకోవడంలో నిజమైన ఆనందం, అర్థం ఉంటుంది. ★



**1980లో తిరువేదగంలో స్వామి చిద్భావనానంద ఆర్‌ఎస్‌ఎస్ వార్షిక శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగం.**

**ప్రియమైన యువకులురా!**

మీరంతా ఎంతో పుణ్యం చేసుకున్నవారు. హనుమంతుడికి లంకలోకి చొరబడే ముందు తన శక్తి ఏమిటో ఆయనకు తెలియదు. దాని గురించి ఆయనకు గుర్తు చేసిన తర్వాత సీతాదేవి ఒక్క లంకలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సరే కనిపెట్టగలిగే శక్తి తనకు ఉందన్న సంగతిని ఆయన అవగతం చేసుకున్నారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించినట్టుగా మనం మనలోని పిరికితనాన్ని అధిగమించాలి. పెద్ద పెద్ద విషయాలు సాధించడానికి గొప్ప శక్తితో పూనుకోవాలి. మన దేశం ఈ యావత్ ప్రపంచంలో ఎంతో గొప్పది. భారతమాత బిడ్డలుగా మీరంతా భౌతిక, మానసిక శక్తిని, అత్యంత ఆధ్యాత్మికతను కలిగి ఉండాలి. ధైర్యవంతులైన మీరంతా గొప్ప గొప్ప పనులు చేయాలి. మనమంతా భౌతికంగానూ, భావజాలాలపరంగానూ ఐక్యతను అభ్యసించాలి, అనుసరించాలి. మనమంతా ఐక్యంగా ఉన్నపక్షంలో గొప్ప విషయాలను సాధించగలం. మనం చిన్న చిన్న కొబ్బరి తాళ్లను పెనవేయడం ద్వారా ఒక ఏనుగును బంధించడానికి అవసరమైన పెద్ద తాడులను చేయగలం. అదేవిధంగా, మనమంతా ఐకమత్యంగా ఉన్నప్పుడు పెద్ద విషయాలను సాధించగలం.

ధైర్యం అంటే ఏమిటి? ఒకసారి ఒక వానరాల గుంపు స్వామి వివేకానంద వెంటపడ్డాయి. ఆయన ఒక్కసారి ఆగి నిలబడి వెనక్కి తిరిగి చూశారు. దాంతో ఆ వానరాలు పత్తాలేకుండా పారిపోయాయి. అదేవిధంగా మనమంతా అధర్మానికి వ్యతిరేకంగా ఐకమత్యంతో నిలబడాలి. అది ధర్మానికి దారి చూపుతుంది. అదే మనకు బలాన్ని తెచ్చిపెడుతుంది!

గత నెలరోజులుగా మనం అంతర్గతంగా ఎంత మానసిక శక్తిని అభివృద్ధి

# స్వామి వివేకానంద బాటలో ఆర్‌ఎస్‌ఎస్




చేసుకున్నదీ మనకు తెలియదు. ఆంజనేయ స్వామి తన శక్తిని మరిచిపోయారు. అదే విషయాన్ని ఆయనకు గుర్తు చేసినప్పుడు ఆయన దానిని సరైన పద్ధతిలో వినియోగించుకున్నారు. భారతమాత బిడ్డలుగా మనం మన తల్లిదండ్రులను పూజించే పద్ధతిని అనుసరించాలి.

మనం ఇలా అనుసరించిన పద్ధతిని వాడుకుంటూ వారంలో కనీసం రెండు రోజులు సమాజం కోసం పనిచేయాలి. ప్రయోజనాలను పక్కనపెట్టి మీ కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. అయాచితంగా మీరు చేసిన సేవకు ప్రయోజనాలను పొందుతారు. మంచి లక్షణాలను అభివృద్ధి చేసుకొని సమాజ అభ్యున్నతి కోసం పనిచేయండి.

ఆ పరమాత్ముడు మనందరిపైన ఆశీస్సుల వర్షం కురిపిస్తారు.

స్వామి చిద్భావనానంద శిక్షణశిబిరంలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చారు.

1. సంఘ్ కార్యకలాపాల పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

– మనం సంఘ్‌ను స్వామి వివేకానంద సూత్రాలను అనుసరించే ఒక సంస్థగా చూడాలి. స్వామి వివేకానంద చెప్పినదాన్ని బట్టి బలం జీవితం, బలహీనత మృత్యువు. సంఘ్ స్వామి వివేకానంద స్వప్నాలను సాకారం చేస్తోంది. భౌతికపరమైన, మానసికపరమైన, జ్ఞానపరమైన శిక్షణ ఇవ్వడం ద్వారా మానవులను సృష్టిస్తోంది. అందుకనే తిరుపరైతురైలో గతంలోనూ ఇప్పుడూ వసతి సౌకర్యం సమకూర్చాం. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏ విధమైన సహాయం చేయడానికైనా మేం సిద్ధంగా ఉన్నాం

2. రాజకీయ పార్టీలు హిందువులను ఏకం చేస్తున్నదంటూ ఆర్‌ఎస్‌ఎస్ గురించి దుష్ప్రచారం చేస్తున్న కారణంగా అనేక మంది మాతో స్వేచ్ఛగా సంచరించడానికి భయపడుతున్నారు. మేం వారిలో ఆ భయాన్ని ఎలా పోగొట్టాలి?

– నిర్భయులు భయపడుతున్నవారికి అండగా నిలబడాలి. ఇక్కడ భయపడటానికి ఏమీ లేదు. ఆర్‌ఎస్‌ఎస్ దేశం బాగోగుల కోసం పనిచేస్తోంది. దీనిలో హానికరమైనది ఏదీ లేదు. అవివేకంలో నుంచి భయం పుడుతుంది. ఆర్‌ఎస్‌ఎస్ మీ జీవనశైలిని మార్చిన తీరు గురించి మీరు వివరించాలి. ఇది కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలి. మీరు మీ జీవన శైలిని ప్రదర్శించడం మొదలు పెట్టినప్పుడు ప్రజలు దానిపట్ల ఆకర్షితులవుతారు. అలాంటి జీవనశైలి కోసం మీతో చేరుతారు. మీరు దేశం పట్ల నిర్వర్తించవలసిన కర్తవ్యం ఇదే. మీ సామాజిక సేవ మీ జీవన శైలిని ఇతరుల ఎదుట ప్రదర్శిస్తుంది. వ్యతిరేక వాదనలు సూర్యుడి ముందు పొగమంచులాగా కరిగి మాయమైపోతాయి. మీ సేవా సంకల్పం ఇతరులకు ఆదర్శనీయం కావాలి. మీరు సేవ చేస్తున్నప్పుడే మాత్రమే అన్ని రకాల అవరోధాలు అడ్డుగా నిలుస్తాయి. ఎలాంటి భయం లేకుండా తెగువతో పని చేయండి. మంచితనం ఎప్పటికీ దెబ్బతినదు. నిరాధారమైన అపవాదులు ఏదో ఒక రోజున ధ్వంసమైపోతాయి.

**'RSS an Open Book Less Known Dimenstions'** నుంచి

## మోహన్ భాగవత్‌జీతో రతన్‌టాటా భేటీ

ఏప్రిల్ 18, 2019న పారిశ్రామికవేత్త రతన్ టాటా ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్‌ను నాగపూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో కలుసుకున్నారు. ఆయన ఇలా రావడం ఇది రెండవసారి. అంతకు మునుపు డిసెంబర్ 28, 2016న ప్రధాన కార్యాలయానికి వచ్చారు. రతన్ టాటా మర్యాద పూర్వకంగా కార్యాలయానికి విచ్చేశారు. అంతకుమునుపు ముంబైలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు నానా ఫాల్కర్ జయంతి సందర్భంగా ఆయన మోహన్ భాగవత్‌జీతో వేదికను పంచుకున్నారు. రతన్ టాటా ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. మోహన్ భాగవత్‌జీ ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో టాటా గ్రూప్‌ను కొనియాడారు. వ్యక్తిగత సంపదను సృష్టించడానికి బదులుగా సంపాదించిన దానిని సమాజం మేలు కోసం వినియోగిస్తున్నా రంటూ ప్రశంసించారు.



కథ

‘కాలం బలీయమైనది. అనుక్షణం మారిపోతూ, తన వేగంతో పోటీ పడమని ప్రపంచాన్నంతా ప్రేరేపిస్తుంది. దాని వెంటే పరుగెడుతున్న మనిషికదెపుడూ ప్రశ్నార్థకమే. గడచిన కాలాన్ని మధుర స్మృతులుగా, రానున్న కాలాన్ని అనూహ్యంగా భావించినా, మనిషి ఎప్పుడూ కాలానికనుగుణంగా సాగిపోవలసిందేగా!’ తాత్వికత్వం చుట్టూ తిరుగాడుతున్న నా ఆలోచనలన్నీ కట్టిపెట్టి కాలాన్ని గడియారం కొలిచి చూపిస్తుంటే, పనిలోకి వేగంగా దిగాను.

“ఏవండోయ్, మేజాపై తేనీరుంచి ఐదు నిమిషాలైయ్యింది. ఈ పాటికి చల్లారిపోయుంటుంది కూడా. పరీక్షలకు చదువుకుంటున్న విద్యార్థిలా ఆ వార్తాపత్రిక లోంచి మొహం బయటకు తీస్తేకానీ దాన్ని తాగాలన్న ధ్యాస కూడా ఉండదు” విసుగుని దాచుకుంటూ అన్నాను.

చెవిన పడ్డ మాటలకు ఎలాంటి సమాధానమూ రాలేదు. ఔషధం పుచ్చుకున్నట్టుగా యాంత్రికంగా దాన్ని తాగి అయ్యిందనిపించారు శ్రీవారు. మా ఇద్దరి పేర్లూ కలిపి ‘భావనానంద’ నిలయమని ఇంటికైతే పేరు పెట్టుకున్నామే కానీ, ఇప్పుడు జీవితాల్లో మధుర భావనలూ, ఆనందాలూ దూరమైయ్యాయి. సమాజంలో చెప్పుకునేందుకు ఇంటికి కావలసిన గోడలూ, పిల్లలూ, అచర వస్తువులూ, బ్యాంకు ఖాతాలైతే కనిపిస్తున్నాయి కానీ మనుషులతో కబుర్లు కరవై యంత్రాలతోనే కాలాయపన షరా మామూలైపోయింది. సరే, జీవితపు పరుగుల్లో ఈ ఆలోచనలకు సైతం గండివేస్తూ...

“రుషీ, ఇవాళ కాలేజీకి కొంచం త్వరగా వెళ్లాలన్నావు. ఇంకా తెమల్లేదేం..పలహారం సిద్ధమైయ్యింది, త్వరగా రా..” అంటూ హడావిడి పెట్టాను. రుషి రాకపోగా “వస్తూన్నా”నన్న సమాధానం కూడా రాలేదు.

ఈ కుటుంబంలో ఇంకా మాట్లాడడం చేతనైన వ్యక్తిగా నేనొక్కత్తినే మిగిలిపోయానేమో అనిపిస్తుంది. ఉన్న నలుగురమూ ఎవరికి వారన్నట్టు యంత్రాలకే వశమైపోయాము. కాదు.. కాదు... బానిసలైపోయామనే చెప్పాలి! యంత్రాలనేవి మానవ సౌకర్యార్థం తయారైనా ఇప్పుడవే మనిషిని శాసిస్తున్నాయి.

“పూజితా, ఇంకా లేవలేదేంటే?”

“ఇవాళ బడికి సెలవు కదమ్మా!” కప్పుకున్న దుప్పటి ముసుగులోంచే బదులిచ్చింది. అలా సమాధానమొచ్చిందంటే నిద్ర బద్ధకం కాదు చరవాణి సౌజన్యమని అనుకోక తప్పలేదు.

“రుషీ! నీ ఉరోపరి (ల్యాప్టాప్) ఇస్తే, కాసేపు ఆడుకుని ఇచ్చేస్తాను” అంటూ రాత్రి బతిమాలిందిగా, దాని ప్రభావమే ఇలా దారి తీసిందని ఇప్పుడర్థమైయ్యింది.

ఎప్పుడూ యంత్రాలతోనే కాలం గడిపే రుషి, పూజితలకు మా చిన్ననాటి కబుర్లు చెపితే నవ్వుతో పాటు విసుగుకూడా వస్తుంది.

‘మా చిన్నప్పటి సంగతులే వేరు!! బడి నుంచి ఇంటికొచ్చి ఉన్నదేదో తిని ఆటలకంటూ వీధిలోకి వెళితే మళ్లీ చీకటి పడేవరకూ ఇంటి దారే తెలిసేది కాదు. ఎన్ని రకాల ఆటలు ఆడేవాళ్లమో! కాలానికి తగ్గట్టు ఆటలూ మారిపోతూ ఉండేవి. బాగా ఆడుకుని అలసి ఇళ్లకు చేరి, కాసేపు ఆవేళ్టి పాఠాలు మననం చేసుకుని, ఆఫీసు నుంచి వచ్చి స్నానపానాదులు ముగించిన నాన్నగారితో ఆవేళ్టి కబుర్లన్నీ చెప్పేసరికి అమ్మ అన్నం సిద్ధం చేసేది. అందరమూ కలిసి తినేసి, ఆ తరువాత పడుకోవడమే. ఇదే నాటి తరానికి తెలిసిన రోజువారీ జీవితం. ఈ తరానికి



మాత్రం ఆటలూ యంత్రాల్లోనేనాయె! అలా అని, ఆ రోజుల గురించి గొప్పగా చెపితే ఇంకేమైనా ఉందా! మీకున్న జ్ఞానమంతేనని తీసిపారేస్తారు. అప్పటివన్నీ వెర్రాటలని కొట్టిపారేస్తారు' స్వగతంలోనే అనుకుని నిట్టూర్చాను.

పోనీ, ఉన్నత చదువుల్లోనైనా యంత్రాల ధ్యాస వదిలి ఏ సాంఘికమో, భాషా ప్రావీణ్యతకు



వాడపల్లి పూర్ణ కామేశ్వరి

భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన రచన

సంబంధించిన అంశాలను ఎంచుకుంటారా? అంటే అదీ లేదు. ఉచిత సలహాపడేస్తే అదీ ఫెలుసే కొట్టింది.

మొన్నటికి మొన్ననే ఆ విషయంలో పూజిత నాతో వాదించింది కూడాను.

“కృత్రిమ మేధస్సుపై భారత్ విశ్వవిద్యాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన విద్యావిధానాన్నే ఎంచుకుంటా నమ్మా” అని కచ్చితంగా చెప్పేసింది. ఆ కృత్రిమమేధ సహాయంతోనేగా వాడి కంప్యూటరుకు రుషిపెట్టిన తాళం కూడా సేసింది! తాళం అంటే భౌతికంగా కనిపించే మన తాళం కప్ప కాదండోయ్. నీ చరవాణిలో ఆడుతున్నది చాలక నాది కూడా కావాలా అంటూ వాడి కంప్యూటరుకు అంకెలతోనో బొమ్మతోనో తాళం పెడతాడుట. కనిపించని తాళాలూ, వినిపించని రాగాలతోనే సాగిపోతాయి వీళ్ల ఆటలూ..పాటలూ...

* * *

పెట్టిన పలహారాన్ని కూడా మరచి కాలేజీకి పరుగు తీశాడు రుషి. అందుకూ వాళ్లకో కారణముందం డోయ్. అమ్మచేసే పాతకాలపు పలహారాలు చేతులకు అంటకుండా గబగబా తినేందుకు వీలుగా ఉండవని వాళ్ల బాధ! అంత సమయాభావం అట.

“అమ్మా, నాకస్సలు సమయం లేదు. పన్నెండో తరగతంటే ఏంటనుకున్నావు కత్తి మీద సామే. పరీక్షలు రాయడం ఒకెత్తైతే ప్రవేశ పరీక్షలకు తయారవ్వడం మరో ఎత్తు. ఇవన్నీ చేస్తే కానీ లక్ష్యాన్ని చేరుకోలేను” అంటూ బోధించే మేధస్సున్న పూజితకు ఇన్ని పనులు చేసుకుందుకు కావలసిన మానసిక శారీరక బలానికి మంచి ఆహారం కూడా ఉండాలని తెలియదేంటో! చేసిన నాలుగు ఇడ్లీలూ నోట్లో వేసుకుని వెళ్లకుండా ఇన్ని మాటలు.

సరే ఏది ఏమైనా, కుటుంబాన్నంతా ఏదో వంకన ఒక్కరోజైనా కలిసి గడిపేలా చేయాలన్నదే నా

తాపత్రయం. నాకున్న ఒకే ఆయుధం ఇలవేల్పు కోవెలకు అంతా వెళ్లాలని పట్టుపట్టడం. అందరినీ బయల్దేరతీయాలని గట్టిగానే నిశ్చయించుకున్నాను.

"ఎప్పుడనగానో పెట్టుకున్న మొక్కు ఇంకా తీర్చలేదు. దైవకటాక్షం ఉంటేకానీ ఇంట్లో మంచి జరగదంటారు. ఏమైనాసరే ఈ వారం ఇలవేల్పు దర్శనానికి వెళ్లి తీరాల్సిందే"నంటూభక్తి పేరిట కట్టేయలేని శ్రీవారిని కట్టేయడానికి పాతమార్గాన్నే ఎంచుకుని, భయంతో కట్టేసి ఒప్పించి సాధించాను. ఒప్పుకోవడమే కాక పిల్లల్ని కూడా బయల్దేర తీసారు ఆనంద్.

"ఏంటమ్మా ఇదీ! నీక్కావాలంటే మీరిద్దరూ వెళ్లాలికానీ, గుళ్లకూ గోపురాలకూ మమ్మల్ని రమ్మని బలవంతమేంటీ" విసుక్కుంది పూజిత.

వాడిదీ ఇంచుమించు అదే ఉద్దేశ్యమైనా, అప్పటికే చిన్నబోయిన నా మొహాన్నిచూసి మాట్లాడక ఊరుకున్నాడు రుషి. ఎట్టకేలకు అందరినీ తెవిల్చేసరికి తలప్రాణం తోకకొచ్చినా, ఆదివారం తెల్లవారుతూనే ప్రయాణానికి సిద్ధమైయ్యాము.

* * *

ఉదయాన్నే లేచి పలహారాలూ, పళ్లూ , తేనీటికి కావలసినవన్నీ సిద్ధం చేశాను. కుటుంబమంతా కలసి గడపబోయే చక్కని రోజని లోలోపల ఆనందంగా ఉంది.

"భావనా, నా చరవాణినింట్లోనే ఉంచేస్తున్నాను. గుళ్లోకి ఎలాగూ తీసుకెళ్లనివ్వరన్నావుగా!"సెలవిచ్చిన శ్రీవారి మాటలకు సంతోషం కలిగింది. అందరూ నాలుగు చక్రాల వాహనంలో ప్రయాణమైయ్యాము. చరవాణి కానీ, మరే ఇతర సాంకేతిక యంత్రాలతో కానీ తీసుకు రాకూడదని ఈ ప్రయాణానికి నేను పెట్టిన నిబంధనను అందరూ పాటించారు. ప్రత్యామ్నాయంగా వారికిష్టమైన వస్తువులు తెచ్చుకున్నారు పిల్లలిద్దరూ.

**రచయిత్రి పరిచయం**



**వాడపల్లి పూర్ణ కామేశ్వరి స్వస్థలం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం. రైల్వేలో ఉద్యోగ రీత్యా చెన్నైలో స్థిరపడ్డారు. జాగృతి సహా వివిధ పత్రికలలో ఇప్పటికి నూరుకు పైగా కథలు ప్రచురితమయ్యాయి. హిందీ భాషా రచనలు, పుస్తక సమీక్ష పోటీలలో పురస్కారాలు అందుకున్నారు.**

కొన్న డిజిటల్ కెమెరాను చేతపట్టి ప్రకృతిని ఆస్వాదించడం మొదలుపెట్టింది పూజిత. వినడానికి తనకిష్టమైన కిషోర్ కుమార్ పాటలను తెచ్చుకున్నాడు రుషి. యంత్రాలతోనే జీవితం గడిపే వారికి తమకంటూ కొన్నిష్టాలున్నాయని అప్పుడే గ్రహించారు. భార్య పక్కనుండగా ఆమెతో గడిపే ఆ క్షణాలను, ఆ నిశ్శబ్దంలో వారు పంచుకునే మధురానుభూతులనుచాలా కాలం తరువాత పొందుతున్నాడు ఆనంద్. వాళ్ల ఇష్టాలకోసం అలాకొంత సమయాన్ని వెచ్చించి అందులో లభించే ఆనందాన్ని చవి చూస్తున్నది ఆ కుటుంబం.

డెబ్భైలనాటి కిషోర్ కుమార్ పాటల హుషారుతో ఉత్సాహంగా సాగిపోతోందా ప్రయాణం. దైవ దర్శనం మాటటుంచి, నలుగురమూ సంతోషంగా గడపడానికి కావలసిన సమయమే సుఖజీవనానికి ఇంధనమైతే, దాని ఖర్చు వాహనానికి ఖర్చయ్యే ఇంధనం కంటే ఎంతో తక్కువే కదా అనిపించింది.

శ్రీవారిని అలా ఆనందంగా చూస్తున్నప్పుడు నా ఆలోచనలన్నీ సాగిపోతున్న వాహన వేగంతో పోటీపడుతూ కాలగమనంలో గతంగా మిగిలిపోయిన పాతరోజుల్లోకి వెళ్లాయి.

"నా భవితవు నీవు, నా మధుర భావనవు భావనల కొలను నీవు" అంటూ ఇప్పుడు మాటలే రానట్టున్న శ్రీవారి అప్పటి మాటలు గుర్తుకు రావడమే కాక, చీరచెంగుని ఆసరాగా చేసుకుని చిట్టడుగులు వేస్తూ నడకలు నేర్చిన చిన్నారుల తొలి అడుగులూ కళ్లల్లో మెదిలాయి. ప్రతీ ఏడూ ఊళ్లో గడిపిన సంక్రాంతి పండుగ సంబరాలు, గొబ్బెమ్మలూ, గంగిరెద్దులూ, పిండివంటలూ, భోగిమంటలూ, తలంట్లూ, కొత్త బట్టలూ కళ్లల్లో నిలిచాయి. ఒకటేంటి ఎన్నెన్నో మధురానుభూతులతో ఊర్పుంచి మూటకట్టు కొచ్చి మనసులో పదిలంగా దాచుకున్న సంతోషాల ఊహలలో మునిగి తేల్తుండగా అల్పాహారానికి వాహనాన్ని ఆపారు శ్రీవారు.

జంబుఖానా పరిచి, చేసుకొచ్చినవన్నీ అందరికీ పళ్లాల్లో సర్ది ఇవ్వసాగాను.

"అమ్మా, ఇదేంటి ఇవాళ కూడా ఇడ్లీనా?" పూజిత మొహం చిన్నబోయింది.

"నిన్ననే తాజాగా వేయించి చేసిన కారప్పొడిలో నెయ్యి వేసి తెచ్చాను పూజితా. కారప్పొడితో నీకిష్టమేగా. ఎంత బాగుందో చూడు" ఒక ఇడ్లీ ముక్కను నోట్లో వేసుకుని ఉత్సాహాన్ని పెంచుతూ అన్నాను.

"వేరేదేమీ లేదా?" అసంతృప్తిగా అంటున్న పూజిత మాటకి "అన్నయ్యకిష్టమని నిమ్మకాయ పులిహోర చేసాను పోనీ అది తింటావా?" అన్నాను.

"ఇప్పుడు అవేవీ తినాలని లేదు" అన్నాడు రుషి.

'ఏ బర్గరో, పీజ్జానో అయితే ఈ పాటికి గెంతులేసు కుంటూ తినేసేవారు! ఉదయం నాలుగు గంటలకు లేచి చేసాను. మనిషి శ్రమకు విలువలేదు, కష్టపడి సంపాదించిన భోజనానికీ విలువలేదు. చేసుకొచ్చినవన్నీ నేను మాత్రం తృప్తిగా తింటాను' అనుకుంటూ పళ్లెంలో పెట్టుకున్నాను. ఇన్నేళ్ల అనుబంధంలో నన్ను చదివిన శ్రీవారికి నా మొహం చూసి అర్థమైయ్యో, లేక ఆకలేసో కానీ ఆయన మాత్రం ఏమీ మాట్లాడ కుండా కావలసినది తినేసారు. మళ్లీ ప్రయాణం కొనసాగింది.

ఆ త్రోవ పొడవునా చిట్టడవులు, చిన్న చిన్న సెలయేళ్లతో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. "నాన్నా, ఇక్కడ ఏదో పెద్ద చెరువుంది. దూరంగా కొండలనుండి వస్తున్న సెలయేళ్ల గలగలలు, పక్షుల కిలకిలలు వినిపిస్తున్నాయి. ఈ ప్రదేశం ఎంతో బాగుంది. కాసేపు ఆగుదాము" అన్నాడు రుషి.

అందరమూ దిగి తలో వైపూ నడుస్తూ ప్రకృతిని




**60వ సారి...**

**ఇండియా–పాక్ యుద్ధాన్ని తానే ఆపానన్న ట్రంప్**

ఆస్వాదిస్తున్నాము. తెచ్చిన కెమెరాలో కళ్లకు కనిపించిన ప్రతీ అందాన్నీ బంధిస్తోంది పూజిత. శ్రీవారితో నేను పాతజ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఒక వైపు నడుస్తుండగా, పక్షుల కువకువల రవములను వింటూ గుబుర్లలోకి సాగిపోతూ మరో వైపుకు నడువ సాగింది పూజిత.

కొంత దూరంలో పూజితకు అక్కడే నివసిస్తున్న ఒక అవ్వ కనిపించింది.

“అవ్వా, నీ ఫోటో తీసుకోనా?”ఉత్సాహంగా అడిగింది పూజిత. ఒళ్లంతా ముడతలు పడి, ఐదడు గల పొడుగుండే అవ్వ ఒంగి మూడడుగులే కనిపిస్తోంది. చేతి కర్ర ఆసరాతోనడుస్తోంది.

“ఇదామ్మా.. చింతపండు పులుసు పెడుతున్నా తల్లీ, కాసేపట్లో అయి పోతుంది. తిందువులే!” ఫొటో అంటే అర్థం కాని అవ్వ ఆదరంగా అంది.

ఆ ప్రాంతంలో అవ్వ ఎన్నేళ్ళనుండో ఉంటున్నట్టుగా అక్కడి ఆనవాళ్లు చెపుతున్నాయి. పాతబడ్డ నలిగిన చీరను చుట్టుకుని, అటూఇటూ నడుస్తూ పనులు చేసుకుంటోంది అవ్వ. కట్టెల పొయ్యిపైన ఒక మట్టిపాత్రలో ఏదో ఉడుకుతోంది. ఘుమఘుమ లాడుతున్న వాసన కడుపులో ఆకలిని పెంచుతోంది. నిర్మలంగా చిరునవ్వు చిందుతూ ఉంది అవ్వ ముఖం.

“అవ్వా, ఇక్కడింకెవ్వరూ ఉన్నట్టులేదే! నీకెవ్వరూ లేరా? ఈ చెట్ల మధ్యలో నువ్వు ఒక్కత్తివే ఉంటావా? భయమెయ్యదా?” ప్రకృతినంతా ఆస్వాదిస్తూ తన కెమెరాలో బంధించాలన్న ఉత్సాహం తగ్గి, అవ్వను ఆసక్తితో ప్రశ్నల వర్షం కురిపించింది పూజిత.

“ఈ అమ్మ నీడనుంటున్న నాకు బయమెందు కమ్మా” అంటూ చింతచెట్టుని చూపింది. తను నిలబడి ఉన్నది ఆ చెట్టు ఛాయలో అని అంత వరకూ తెలియ లేదు పూజితకి.

“ఈ తల్లి నీడనే బతుకుతున్నాను. ఇదిచల్లని నీడనిస్తుంది. చిగురించినపుడు ఇంత పచ్చడి నూరుకుంటే సరిపోతుంది. కాలం సాగిపోయి ఈ తల్లి కొమ్మలన్నీ కాయలతో నిండిపోతాయి. ఎండకి ఎండుతూ కిందగిరాలగా దోరగా పండిన ఆ కాయలతో కూసంత పులుసు పెట్టుకుంటే నా జానెడు పొట్టి నిండిపోతుంది. ఏ కాలానికా కాయలు కాస్తాయి ఈ చుట్టుపక్కల. ఈ నేలతల్లి ఇచ్చే దుంపలు, ఆకుకూరలూ ఒకటేంటమ్మా, ఇక్కడేం కావాలంటే అవే ఉంటాయి. బతకడానికి ఇంతకంటే కావలసిందే ముందమ్మా?” అంది అవ్వ.

అవ్వ మాటల్లోని అల్ప సంతోషాన్నీ, సంతృప్తినీ చూసి ఆశ్చర్యం కలిగింది పూజితకు. “అక్కడ తనకెలాంటి లోటూ లేదని నమ్ముతూ, ఒటరినన్న భయమే లేకుండా ఎలా ఉంటారో. ఎవరూ లేరని కానీ, ఏదో లోటుందని కానీ అనిపిం చదా అవ్వా?” అడిగింది.

“నాకేటి లోటున్నాది తల్లీ. తలదాచుకుందుకు నీడ ఉంది. కడుపు నింపే తల్లీ ఉంది. కాలం తీరితే ఈ చెట్టుతల్లి ఒడిలోనే ఊపిరి వదిలేస్తాను. అయినా అందరమూ ఒంటరిగానే వస్తాము, ఒంటరిగానే పోతాము. ఈ మధ్యలో మాత్రం ఒంటరితనమంటే భయమెందుకమ్మా!” అంటూ నవ్వేసింది. అవ్వతో కబుర్లు ముగించి వాహనం వైపు తిరుగు ప్రయాణమైన పూజిత మనసు ఇప్పుడు అనేక ఆలోచనలతో నిండిపోయింది. ఆలోచనల్లో మునిగితేల్తూ వాహనం దగ్గరకు చేరుకుంది.

“అమ్మా, ఆకలేస్తోంది, ఇడ్లీ, పులిహోర పెడతావా?” అప్రయత్నంగా అడిగింది. పూజితను చూస్తున్న ఆనంద్‌కు ఆశ్చర్యం కలగగా, భావనకు ఆనందం కలిగింది. అవ్వ కబుర్లు చెపుతూ కడుపు నింపుకుంది పూజిత.

నా పొదరింట చింతచెట్టుతెచ్చిన మార్పును చూసి ఆశ్చర్యం కలిగింది. అటుపై చేసుకున్న దైవదర్శనంతో మొక్కు తీరి, ఇది దైవకృప అని సంతృప్తి పడుతూ ఇల్లు చేరాం.

**ఈ తల్లి నీడనే బ్రతుకుతున్నాను. ఇదిచల్లని నీడనిస్తుంది. చిగురించినపుడు ఇంత పచ్చడి నూరుకుంటే సరిపోతుంది. కాలం సాగిపోయి ఈ తల్లి కొమ్మలన్నీ కాయలతో నిండిపోతాయి. ఎండకి ఎండుతూ కిందగిరాలగా దోరగా పండిన ఆ కాయలతో కూసంత పులుసు పెట్టుకుంటే నా జానెడు పొట్టి నిండిపోతుంది. ఏ కాలానికా కాయలు కాస్తాయి ఈ చుట్టుపక్కల. ఈ నేలతల్లి ఇచ్చే దుంపలు, ఆకుకూరలూ ఒకటేంటమ్మా, ఇక్కడేం కావాలంటే అవే ఉంటాయి.**



రెండేళ్లు ఇట్టే గడిచిపోయాయి.

* * *

అషాఢ మాసం వచ్చింది. మావయ్యగారికి సుస్తీ చేసి కొన్ని రోజులకే కాలం చేసారు. ఆయనతో గడిపిన అనుభూతులే పిల్లకు ఆస్తులైయ్యాయి. ఎందుకంటే, మావయ్యగారు పోయిన సంవత్సరమే ఎన్నేళ్ల తరువాతో మేమంతా కలసి ఊరు వెళ్లాం కనుక.

“నాన్నా ఈ ఏడు పండక్కెళదామా!”ఎప్పటికప్పుడు పండక్కి రామంటూ భీష్మించుకునే పిల్లలు ఆ మాట అనడమే తడవుగా ప్రయాణమైయ్యాము. ఇది చింతచెట్టు మహిమే అనుకున్నాను. సంక్రాంతి పండుగకు వారం రోజులు ముందుగానే వెళ్లి ముక్కనుమ నాడు తిరిగు ప్రయాణమైయ్యాము. అన్నాళ్లూ ఊళ్లోనే గడిపాము.

“తాతయ్యా, కనకాంబరం మడిపక్కనే ఆ మల్లెతీగ మొదలు ఉందిగా, ఎరువేసి దాని చూట్టూ పాదుకట్టి నీరు పెడతాను” అంటూ, తాతగారితో సమానంగా ఇంటి చుట్టూ వేసిన మొక్కలతోనే కాలక్షేపం చేసేది పూజిత. మంకెన పువ్వుని ఎరగని పూజిత మొదటి సారి దాన్ని చూసి మురిసిపోవడం నాకింకా కళ్లల్లో తాజాగా ఉంది.

“ఇవాళ ఆకుపచ్చ సంపెగ పువ్వు పూసుంటుంది, ఇక్కడిదాకా సువాస నొస్తోంది” అంటూ నిమ్మకు నీరు పెడుతూ మామయ్యగారు అన్నారు. వెంటనే పరుగున వెళ్లి చెట్టంతా గాలిస్తే గుప్పుమనొస్తున్న వాసనే కానీ పువ్వు కనిపించక సతమతమయ్యింది పూజిత. ఆకుల చాటుగా దాగిన పువ్వును కనుగొన్నాక దాని కళ్లల్లో కనిపించే కాంతులకు వెల ఉంటుందా అనిపించింది నాకు. అలా జరుపుకున్న పండుగ తరువాత మరో సంక్రాంతికి మావయ్యగారు లేరు.

మనసుకంటే వేగంగా ప్రయాణించే సాధనం ఏదీ లేదంటారే కానీ, కాలం అంతకంటే వేగంగా ప్రయాణిస్తోందని నమ్మక తప్పట్లేదు. అలా గిర్రున తిరిపోతున్న కాలచక్రంతోనే సాగిపోతోంది మానవాళి. అలాంటి చక్రవ్యూహంలో చిక్కుకున్నా, కొన్ని మార్పులు అభిలషనీయం. అదే ఇకిగాయ్ అనిపించింది.

జపాన్ దేశం ప్రబోధించిన శతాబ్దం నాటి తత్వం ఇకిగాయ్. జీవితాన్ని మెరుగు పరచుకోవాలని ఎందరో మహనీయులు ఆ తత్వాన్ని వెలుగులోకి తెస్తూ ప్రపంచానికి పంచుతున్నారు. తానెంచుకున్న వాటికి దూరమవ్వకుండా ప్రపంచంతో మమేకమవుతూ స్వయంగా ఆనందాన్ని పొందుతూ మనిషి ముందుకి సాగిపోవడానికి సహాయపడే తత్వాన్నే ఇకిగాయ్‌గా అభివర్ణించవచ్చు. ‘జీవించడానికి ఒక కారణం’అనే కొన్ని అంశాల అతివ్యాప్తిని సూచిస్తుంది ఇకిగాయ్. మనిషి తన అభిరుచిని వీడక, వృత్తితో పాటూ దాన్నీ లక్ష్యంగా చేసుకుని, రెంటినీ సాధిస్తూ సాగిపోతే అర్థవంతమైన జీవితానికి దారి తీస్తుందని ఇకిగాయ్ చెపుతుంది.

ఇకిగాయ్ సూత్రాన్ని అనాయాసంగా అవలంబిస్తూ, ఆ అవ్వ చింతచెట్టు నీడనే జీవనపథంగా చేసుకుని సంతృప్తితో బతుకుని అర్థవంతం చేసుకుంది. ఆ చింతచెట్టు ప్రభావం మా ఇంటా లేకపోలేదు.

పెరట్లో పిల్లలు నాటిన మొక్కలు పూస్తున్నాయి. ప్రహరీ గోడ పక్కగా పెట్టిన చింతచెట్టుకి చిగుర్లు వేస్తోంది. ఉదయాన్నే లేచి సూర్యోదయాన్ని చూడడమే రుషి నిత్యకృత్యమైంది. పూజిత ప్రకృతితోనే ఎక్కువ సమయాన్ని గడుపుతోంది. ‘భావనానంద నిలయం’ ఇంటికి సార్థక నామధేయమైయ్యింది. ★

భాగం-12

## మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# పసలేని పరమాణు వాదం

**గతితత్త్వవాదులు ఈ ప్రపంచమంతా ఒక కదిలే యంత్రంతో సమానమని భావించారు. భౌతికవాదులు భూతాల నుంచే సృష్టి సముదాయమంతా ఏర్పడిందని చెబుతారు. భౌతికవాదులను ఖండించే సిద్ధాంతాలు పాశ్చాత్యులలో కూడా అనేకం ఉన్నాయి. వాటిలో లైమిట్స్ చెప్పిన పరమాణువాదం ప్రముఖమైనది.**

వాస్తవానికి సుఖం – దుఃఖం అనేవి ధర్మ-అధర్మాలపై ఆధారపడి ఉంటాయి. సుఖానికి ధర్మము, దుఃఖానికి అధర్మము మూలమవుతుంది. వైయక్తికమైన పాపాల వల్ల వైయక్తిక దుఃఖాలు, సమష్టి పాతకాల వల్ల సమష్టి దుఃఖకారణాలైన ఉపద్రవాలు ఏర్పడతాయని అనుకోవడం పూర్తిగా అమాయకత్వంతో కూడిన ఆలోచన.

పాపులైన వారు సుఖజీవులుగానూ... ధార్మికులైన వారు అప్పుడప్పుడు దుఃఖాలలో మునిగిపోతుండడాన్ని గమనించినప్పుడు... మనం అధర్మం నుంచి ఎల్లవేళలా తప్పించుకుంటూ ఉండాలి. ఎందుకంటే అధర్మం వల్ల ఒక్కొక్కప్పుడు అభివృద్ధినే గమనిస్తుంటాం. కానీ దానికి కారణం పురాకృత సుకృతం అయి ఉంటుంది అని మనువు చెప్పాడు. ఆ సుకృత ఫలం సమాప్తి కాగానే... దానికి సమూలంగా నాశనం కలుగుతుంది...

మనుస్మృతి ఇంకా ఇలా చెబుతోంది... పాపి అయినవాడికి గొప్పగొప్ప పుణ్యాల తాలూకు ఫలాలు చిన్నచిన్న సుఖాలతో ఖర్చయిపోతుంటాయి. అలాగే పుణ్యాత్ములకు గొప్ప గొప్ప పాపాలు సైతం సాధారణ కష్టాలను అనుభవించడం ద్వారా పోతుంటాయి. పాపి అయినవాడు సామ్రాజ్య లాభాన్ని పొందాల్సి ఉండగా... కేవలం ఒక బంగారు నాణెం లభించడంతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. అదే పుణ్యాత్ముడి విషయంలో మరణం వంటి భయంకరమైన కష్టం రావాల్సి ఉండగా... పుణ్యం చేస్తున్నందువల్ల చిన్న ముల్లు గుచ్చుకుని, ఆపద తొలగిపోతుంది.

యాంత్రిక సిద్ధాంతానుసారంగా సకల వస్తువులూ వ్యవస్థితమై ఉన్నాయని హాబ్స్ చెప్పాడు. అతడి అభిప్రాయంలో 'గతి మాత్రమే సత్యం. మిగిలినవన్నీ ఆ గతి తాలూకు వికార సముదాయాలే. జ్ఞానం కూడా ఆ గతిలో అంతర్భూతంగా ఉంటుంది. ఇంద్రియానుభూతి కూడా జ్ఞానమే. వస్తువుల ద్వారా ఇంద్రియాలకు వికాసం అనుభూతిలోకి వస్తుంది. ఇక్కడ కూడా గతి విశేషం ఉండనే ఉంటుంది. మనసు కూడా భౌతికమైనదే. అన్ని వస్తువుల ప్రాథమిక గుణం ఏమంటే అవి ప్రస్తుతం ఉన్న అవస్థ లేదా స్థితిలోనే ఉండిపోవడం. అక్కడ అవస్థ అనేది గతిరహితమా లేక గతితో కూడినదా అనేది వేరే విషయం.'

హాబ్స్ అభిప్రాయం ప్రకారం, 'మానవుని కల్పనాశక్తి పరిమితులకు లోబడినది కావడం వల్ల, పరిమితులు లేని వస్తువును ధారణయందు నిలుపుకోవడం సాధ్యం కాదు.' అందువల్ల పరిమితులు లేని శక్తి లేదా అవధులు లేని కాలం అనేవి లేవు. అప్పుడప్పుడు అనంతమనే శబ్దాన్ని ప్రయోగిస్తూ ఉంటాం. దానికి తాత్పర్యం అట్టి వస్తువుకు ఉండే పరిమితులకు సంబంధించిన జ్ఞానం మనకు లేదని మాత్రమే. ఇంద్రియాల ద్వారా గ్రహించడానికి సాధ్యం కాని విషయం అంటూ వేరొకటి ఉండడం సాధ్యం కాదు.

లైమిట్స్ అనే తాత్త్వికుడు భౌతికవాదాన్ని ఖండించడం కోసం అనేక పరిశోధనలు చేసి, పరమాణువాదాన్ని ప్రవేశపెట్టాడు. నిర్జీవ భూతాల నుంచి సృష్టి జరగదు అని నిరూపించడం కోసం అతడు... 'మోనాడ్' అనే పేరుగల అనుభవ శక్తియుక్తమైన ఆధ్యాత్మిక అణువులు సృష్టికి కారణం అవుతాయని నమ్మాడు. 'మోనాడ్' అనే పేరుగల అణువే తనయందు అంతర్నిహితమైన శక్తుల ద్వారా జీవము, అజీవము, పశువు, మనుష్యుడు మొదలైన రూపాలతో వికాసం పొందుతూ ఉంటుంది. ఈ 'మోనాడ్' అనేది మనస్సుకు–శరీరానికి, మానవునికి – పశువుకు మధ్యగల భేదాన్ని తొలగిస్తుంది. బాహ్య వస్తువులు ప్రత్యక్ష అనుభూతికి సంబంధించిన విషయాలు. వాటికి మనస్సులో వేరొక రూపంతో అస్తిత్వం ఉంటుంది. వాటితో మనసు ప్రభావితం అవుతూ ఉంటుంది. ఆ ప్రభావం కారణంగా బాహ్య వస్తువుల అంచనా ఉంటుంది. లేదా ప్రత్యక్షీకరణ చెందుతాయి.

కానీ ఇలా భావించడం వల్ల, 'ఒక మోనాడ్ ఇతర మోనాడ్‌లతో ప్రభావితం కాజాలదు' అనే మాటతో సిద్ధాంతాన్ని కొట్టివేయగలుగుతాం. బాహ్యానుభూతులెప్పుడూ మాయా స్వభావాన్ని కలిగినవే. కామం, సంకల్పం వంటివాటితో సమానంగా బాహ్యవస్తువులు కూడా మానసికమైనవే. మానవ శరీరం అసంఖ్యాక మోనాడ్‌లతో రూపొందింది. దీనిని శాసించే మనసు లేదా ఆత్మ అనేది ఒకేఒక్క మోనాడ్ నుంచి రూపొందింది. ఇలాగే ఈ విశ్వసృష్టి కొనసాగిందని చెప్పే ఈ విచారధార సర్వత్ర స్పష్టంగా ఉండబోదు.

నిప్పుకు కొంచెం దూరంలో చలికాగుతున్న వ్యక్తి తన అరచేతులలో వేడిమిని అనుభూతి చెందగలుగుతాడు. దీనివల్ల ఉష్ణత్వం అగ్నిగుణంగా కనిపిస్తుంది. ఆ వ్యక్తి నిప్పుకు మరికొంచెం దగ్గరగా వెళ్లినప్పుడు సెగ పెరుగుతుంది. శరీరానికి బాధ కలుగుతుంది. ఇటువంటి శక్తి దూరము, దగ్గర అనేవాటిపై ఆధారపడి ఉంది కానీ, అగ్నిపై ఆధారపడి కాదు. బాధ కూడా ఉష్ణతనుంచి వచ్చిన ఏర్పడిన రూపమే. అందువల్ల ఉష్ణత అనేది అనుభూతి విశేషమే అవుతోంది కానీ... అగ్ని గుణం కానేరదు.

కొన్ని కీటకాల కాళ్లు ఎంత సూక్ష్మంగా ఉంటాయంటే... వాటిని మైక్రోస్కోపుల ద్వారా మాత్రమే మనం చూడగలుగుతాం. అంతమాత్రం చేత ఆ కీటకాలకు కూడా తమ కాళ్లను చూసుకోవాలంటే మైక్రోస్కోప్ కావాలి... లేకపోతే చూడలేవని మనం చెప్పకూడదు. అందువల్ల చూస్తున్నవాడి మనోగుణాన్ని అనుసరించి... సూక్ష్మత, దీర్ఘత అనేవి దర్శనమానమవుతాయి.

(వచ్చేవారం... పాశ్చాత్యుల తర్కశాస్త్రం)

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**

**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**




# లక్ష్యసాధనలో లక్ష్యసేన్ జోరు!

ప్రపంచ బ్యాడ్మింటన్ భారత్ జోరును యువకెరటం లక్ష్యసేన్ కొనసాగిస్తున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలుపుతో లక్ష్యం దిశగా దూసుకుపోతున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో గత దశాబ్దకాలంగా భారత పతాకాన్ని రెపరెపలాడించిన పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్ లాంటి సీనియర్ స్టార్లు రిటైర్మెంట్ వాకిట నిలిస్తే.. ఆ లోటును పూడ్చడానికి యువకెరటం లక్ష్యసేన్ తనవంతు పోరాటం కొనసాగిస్తున్నాడు.

గత మూడేళ్లుగా నిలకడగా రాణిస్తూ పలు అరుదైన విజయాలు సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లక్ష్యసేన్ ప్రస్తుత సీజన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ తో ఘనంగా ముగించాడు. ప్రపంచ, ఆల్ ఇంగ్లండ్, మాస్టర్స్ పోటీలలో సీనియర్లు ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్‌లతో కలసి లక్ష్యసేన్ పాల్గొంటూ వచ్చాడు. అయితే.. ప్రస్తుత 2025 సీజన్లో తొలి ట్రోఫీ కోసం 11 మాసాలపాటు వేచి చూడాల్సి వచ్చింది.

సిడ్నీ వేదికగా ముగిసిన ప్రపంచ బ్యాడ్మింటన్ టూర్ సూపర్ -500 టోర్నీ సెమీఫైనల్లో తైవాన్ ఆటగాడు చో టీ చెన్‌ను మూడుసెట్ల హోరాహోరీ సమరంలో అధిగమించాడు. ఫైనల్లో చోటు కోసం జరిగిన పోరులో లక్ష్యసేన్ 17-21, 24-22, 21-16తో విజేతగా నిలవడం ద్వారా ప్రస్తుత సీజన్లో రెండో టైటిల్ పోరుకు అర్హత సంపాదించాడు.

ఇక.. టైటిల్ పోరులో జపాన్ ఆటగాడు యుషీ తనకను కేవలం 30 నిమిషాలలోనే 21-15, 21-11తో చిత్తు చేసి విజేతగా నిలిచాడు. తన కెరియర్‌లో ఐదవ మాస్టర్స్ టైటిల్‌తో పాటు ట్రోఫీని అందుకొన్నాడు.

## ప్రపంచ కాంస్యంతో దూకుడు...

2021 ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీలో కాంస్య పతకం నెగ్గిన లక్ష్యసేన్ ఆ తరువాత 2022 కామన్వెల్త్ గేమ్స్ పురుషుల సింగిల్స్‌లో బంగారు పతకంతో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాడు. 20 సంవత్సరాల వయసులోనే ఈ ఘనత సాధించి భారత దిగ్గజ ఆటగాళ్లు ప్రకాశ్ పడుకోన్, సయ్యద్ మోడీ లాంటి మేటి ఆటగాళ్ల సరసన నిలిచాడు.

## ఉత్తరాఖండ్ నుంచి ప్రపంచస్థాయికి...

ఉత్తరాఖండ్‌లోని అల్మోరాకు చెందిన బ్యాడ్మింటన్ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి దూసుకొచ్చిన చిచ్చరపిడుగే లక్ష్యసేన్. ఎనిమిది దశాబ్దాలుగా ఆయన కుటుంబానికి ఈక్రీడతో విడదీయరాని అనుబంధమే ఉంది. ఆతని తాత, తండ్రి బ్యాడ్మింటన్ క్రీడాకారులే. తండ్రి ధీరేంద్ర కె సేన్‌కు అల్మోరాలో సొంతంగా శిక్షణ కేంద్రం ఉంది. బ్యాడ్మింటన్ శిక్షణలో ఎన్ఐఎస్ పాటియాలా నుంచి ఆయన సర్టిఫికెట్ సంపాదించారు. ఐదేళ్ల ప్రాయంలోనే తండ్రి పర్యవేక్షణలో రాకెట్ చేతపట్టిన లక్ష్యసేన్ సబ్-జూనియర్ స్థాయిలో మెరికలాంటి ఆటగాడిగా గుర్తింపు సంపాదించుకొన్నాడు. బెంగళూరులో జరిగిన జాతీయ జూనియర్ విభాగంలో టోర్నీలో టైటిల్ నెగ్గడం ద్వారా జైత్రయాత్రకు శ్రీకారం చుట్టాడు.

బెంగళూరులోని ప్రకాశ్ పడుకోన్ బ్యాడ్మింటన్ అకాడెమీలో ప్రధానశిక్షకుడు విమల్ కుమార్ నేతృత్వంలో తన ఆటకు మెరుగులు దిద్దుకొన్నాడు.

## అంతర్జాతీయ స్థాయిలో...

2016లో బ్యాంకాక్ వేదికగా జరిగిన ఆసియా జూనియర్ టోర్నీలో కాంస్య పతకం సాధించడం ద్వారా తన అంతర్జాతీయ పతకాల వేటను లక్ష్య మొదలుపెట్టాడు. 2018 జకార్తా మీట్‌లో బాలుర బంగారు పతకం గెలుచు కొన్నాడు. 2018 ప్రపంచ జూనియర్ టోర్నీలో కాంస్య పతకంతో సరిపెట్టుకొన్న లక్ష్య,అదే ఏడాది అర్జెంటీనాలో టోర్నీ బాలుర సింగిల్స్‌లో రజత పతకం సాధించాడు. బ్యునోస్ ఏర్స్ వేదికగా 2018లో జరిగిన ప్రపంచ యువజన ఒలింపిక్స్ మిక్సిడ్ టీమ్ విభాగంలో భారత్‌కు బంగారు పతకం అందించాడు.

## సీనియర్ విభాగంలోనూ అదే జోరు..

2020 సీజన్లో మనీలా వేదికగా ఆసియా టీమ్ చాంపియన్సిప్ విభాగంలో కాంస్య పతకం సాధించి, బ్యాంకాక్ వేదికగా(2022)ముగిసిన థామస్ కప్ టోర్నీలో భారత్ తొలిసారిగా విజేతగా నిలవడంలో తనవంతు పాత్రపోషించాడు. బర్మింగ్ హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్- -2022 మిక్సిడ్ టీమ్ విభాగంలో భారతజట్టు సభ్యుడిగా రజత పతకం అందుకొన్నాడు.

## 14వ ర్యాంక్ ఆటగాడిగా...

ప్రపంచస్థాయిలో విపరీతమైన పోటీతో పాటు మ్యూజికల్ చెయిర్స్ లా సాగే ర్యాంకింగ్ సమరంలో లక్ష్య పడుతూ లేస్తూ వస్తున్నాడు. తాజా వివరాల ప్రకారం,14వ ర్యాంకులో కొనసాగుతున్న లక్ష్య ప్రపంచ వ్యాప్తంగా జరిగిన వివిధ టోర్నీలలో పాల్గొంటూ మొదటి పదిమంది అత్యుత్తమ ర్యాంక్ ఆటగాళ్ల పై సంచలన విజయాలు నమోదు చేశాడు. సీనియర్ స్థాయిలో ప్రస్తుతం భారత అత్యుత్తమ సింగిల్స్ ప్లేయర్‌గా గుర్తింపు పొందిన లక్ష్యసేన్ రానున్న ప్రపంచ బ్యాడ్మింటన్, ఒలింపిక్స్ టోర్నీలలో భారత్ కు బంగారు పతకం అందించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నాడు.

డబుల్స్ జోడీ సాత్విక్- చిరాగ్‌లతో కలసి భారత బ్యాడ్మింటన్ భారాన్ని మోస్తున్న లక్ష్య తన లక్ష్యాలను సాధించడం ద్వారా దేశానికే గర్వ కారణంగా నిలవాలని కోరుకొందాం.



కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్టీల్ బ్యాంక్ ఏర్పాటు



**అన్నమయ్య జిల్లా:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని తలచి నవంబర్ 17న గ్రామవికాస్ సమితి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రాయచోటి గ్రామీణ ఖండ యర్రమరాజుగారిపల్లి ప్రభాత్ గ్రామం నందు కార్తీక దీపోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 200 స్టీల్ ప్లేట్లు, 200 స్టీల్ గ్లాసులతో స్టీల్‌బ్యాంక్ ఏర్పాటు చేశారు. 3 గ్రామ పంచాయతీల పరిధిలోని 10 పల్లెల నుండి 150 మంది మహిళలు, పురుషులు పాల్గొని స్టీల్ బ్యాంక్ ప్లేట్లలోనే భోజనాలు చేశారు. ఎవరి ఇంట్లో ఏ విందు కార్యక్రమం జరిగినా ఈ స్టీల్ బ్యాంక్ ప్లేట్లలను వాడుకోవాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రాంత గ్రామ వికాస్ సంయోజక్ వడ్ల తిరుపతయ్య పాల్గొన్నారు.

# పంచ పరివర్తనకు నిరంతరం కృషి చేద్దాం





**భాగ్యనగర్ :** సంఘశాఖలో ఒకసారి స్వయంసేవక్ అయితే ఎప్పటికీ స్వయం సేవక్ అని, వారందరూ సంఘ శతాబ్దిలో కొత్త శాఖలను ప్రారంభించాలని, సమాజంలో పంచపరివర్తనను తీసుకురావడానికి నిరంతరం కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ శ్రీధర్ అన్నారు.

జె.ఎన్.టి.యు. హెచ్ విశ్వవిద్యాలయంలో నవంబర్ 23న జరిగిన నలనీల శాఖ (విశ్వవిద్యాలయం) సమ్మేళనం జరిగింది. ఇందులో గతంలో ఈ శాఖలో పాల్గొని వేరువేరు చోట్ల స్థిరపడ్డ స్వయంసేవకులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. శ్రీధర్ ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ కామాక్షీప్రసాద్ పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో మొత్తం 96 మంది పాల్గొనగా, పూర్వ విద్యార్థి స్వయంసేవకులు 81 మంది పాల్గొన్నారు.

 డిసెంబర్ 4 జయంతి

# నవరసాల ఘంటసాల...

**మధుర గాయకులు ఘంటసాల మన మధ్యే ఉన్నారు. ఆయన పాటలు శ్రోతలకు ప్రతినిత్యం కొత్త ఊపిరులూదుతున్నాయి. నేపథ్యగానానికి, పద్యాలాపనకు ఒరవడిని నిర్దేశించిన మహోన్నత గాయకులు.పద్యాలు ఆలాపనలో ఆయనను మించిన వారు లేరు. అయిదు దశాబ్దాలుగా గంధర్వలోకం నుంచి ఆశీస్సులు అందిస్తూనే ఉన్నారు.**



'రఘు కులేశుడే ధర్మము వీడీ మరో భామతో కూడిన నాడు" ఆ తలపే భరించలేనంత భావాన్ని ఎవరు పలికించగలరు? అదే వాల్మీకి మహర్షి మనోభావం. "నాదు జపము తపము.నా కావ్యమ్మె వృథ యగునమ్మా" అంటూ రాముడి మీద తన నమ్మకాన్ని తన హావభావాలతో అపర వాల్మీకిలా మనకు దర్శనమిచ్చిన చిత్తూరు నాగయ్య నటనకు జీవం పోసింది ఘంటసాల గాత్రం.

'ముద్దబంతి పూవులో' ఎంతో మంది హృదయాలలో ఏముందో ఎవరికీ అర్థం కాదు. వారి కళ్ల వెనుక ఉన్న ఆశలు, కోరుకున్న పువ్వు లాంటి సున్నితమైన కలలు, వారికి కావలసిన జీవితాన్ని పొందలేని నిరాశ, అది చెప్పుకోలేని బాధ జీవితంలో రాజీ పడి బ్రతుకుతూ ఉంటారు. అలాంటి వారి మనసుకు అద్దం పడుతుంది ఈ పాట. కవిత్వం ఎంత బాగున్నా అది అందరూ వినేలా పాడగల శక్తి ఘంటసాలకే ఉంది.

అక్కినేని 250 చిత్రాలలో నటిస్తే అందులో, ఘంటసాలా ఆయనకు 200 చిత్రాలకు పాడి ఉంటారు. గాయకుడు నటుడైనపుడు ఏభావం ఎలా పలకాలో తెలుస్తుంది. అందుకే ఆయన పాటల ద్వారా నటుడు చేయాల్సిన పనిలో సగం చేసినట్లుగా ఉంటుంది. పండితులకే పరమితమనుకుంటున్న భగవద్గీతను తన ఆలాపనతో సామాన్య ప్రజల దగ్గరకు తీసుకెళ్లారు.

తెలుగుదనం, తెలుగు సంగీతం ఉన్నంత కాలం, తెలుగు వారికి గానం పట్ల అభిమానం ఉన్నంతకాలం ఘంటసాల ఉంటారు.

"పదికాలాల పాటు నేను పాడిన పాటలు ప్రజల హృదయాల్లో నిలిచిపోవాలి" అనుకునే వారు ఘంటసాల. ఈనాటికీ ఆయన పాటల ప్రభంజనం అలాగే కొనసాగుతోంది. ఆంధ్ర జాతికే కాదు భారత జాతికే గర్వకారణం మన ఘంటసాల.

మనసుకు ప్రశాంతత కలిగించే ఏకైక సాధనం, సంగీతం. పండితులు, పామరులు, పిల్లలు,పెద్దలు ,పశు పక్ష్యాదులను కట్టి పడేసే శక్తి ఒక్క సంగీతానికే ఉంది.అలాంటి సంగీతం మనకు అందించిన ఘంటసాల పాటలు నాదచికిత్స రూపంలో ఉపయోగపడుతున్నాయి.

అనితర సాధ్యమైన భావప్రకటన, మాధుర్యం సొంతం చేసుకుని పలికించ గల ఏకైక గాయకుడు ఘంటసాల. సంగీతం అంటే భావోద్రేకాన్ని వ్యక్తపరిచే భాష. ప్రజల హృదయాలను స్పందింపచేసే శక్తి గల గాత్ర మాధుర్యాన్ని దైవదత్తంగా పొందిన దివ్యశక్తి ఆయన. తన మనసును మరో వ్యాసంగం వైపు పోనీయకుండా సంగీతసారాన్ని సాధించాలని కృషి చేసారు. అందులో ఉన్నత శిఖరాన్ని అధిరోహించారు.

ఘంటసాలగారు మన తెలుగు వారి ముద్దుబిడ్డ కావటం మన అదృష్టం. ఈనాటికీ ఆయన పాటలు ఆస్వాదిస్తూ మానసిక ఒత్తిడి నుండి విముక్తి పొందుతున్నాం. తనకు లభించిన గాత్ర సంపదకు తన ఊహా శక్తిని, కల్పనా చమత్కృతినీ జోడించి ఒక నూతన శకాన్ని వినూత్న సంప్రదాయాన్ని కనిపెట్టిన మహాగాయకులు. ఆయన భగవద్గీత తరువాతనే ఎవరు పాడినా! ఘంటసాలలా పాడలేనని లతా మంగేష్కర్ స్వయంగా ఒప్పు కున్నారు. ఘంటసాల భగవద్గీతలోని శ్లోకాలను అలాగే ఉంచి వచనం వారి భాషలో చదివి ఆ దేశంలో విడుదల చేసారట. ఖండాంతరాలలో కూడా ఆయన ప్రతిభ వినుతికెక్కింది. మధుర గాయకుని స్వరంపై పరిశోధన చేసి ఇలాంటి గళం ఎవరికీ ఉండదు అని తీర్మానించారు. దైవాంశ సంభూతులకే ఇలాంటి వరం దొరుకుతుంది.

"ఇది సంధ్యా సమయం" పాట పాడుతూ తన పాటలు అందరూ పాడుకోవాలని కోరుకున్నారు. ఈనాడు ఆయన పాట లేని సంగీత కార్యక్రమం ఉండదు. పాట అంటే స్ఫురించేది ఘంటసాలవే. పద్యం అంటే వెంటనే సాక్షాత్కరించేది వారే. ఏ స్థాయిలో పాడినా గంభీరంగా ఉంటుంది.

కవి మనసులో ఏమనుకుని గీత రచన చేస్తాడో అదే భావాన్ని చక్కటి ఉచ్ఛారణతో శబ్ద సౌందర్యాన్ని, లలిత భావాన్ని పలికించగలిగిన స్వరబ్రహ్మ. ఏ పాటకు ఎక్కడ ఎటువంటి భావాన్ని చూపించాలో ఆయనకు తెలిసినట్లుగా మరి ఎవరికీ తెలియదు. కవి భావాన్ని స్వరంతో పలికించి నాటి పౌరాణిక చిత్రాలను సజీవంగా నిలిపి, అందులోని పాత్రధారుల నటనకు ఊపిరి పోసారు.

వర్తమానంలో చిన్న పిల్లలు కూడా ఆయన పాటలు పాడుతున్నారంటే ఆ పాటలు మహత్తు మనకు తెలుస్తుంది. ఈ ప్రస్థానం ఇలాగే కొనసాగాలి. ఒక త్యాగరాయ కీర్తనలా ఘంటసాల పాటలు రాబోయే తరం కూడా పాడుకోవాలి.



**షామీర్ జానకీదేవి**
9394611037

## బాల జాగృతి

### భక్తాగ్రేసరులు

## తాయుమానవర్



తమిళకవి, ఆధ్యాత్మికవేత్త తాయుమానవర్ సుమారు మూడు వందల ఏళ్ల క్రితం తిరుచురాపల్లిలో జన్మించారు. ఆయన బాల మేధావి. తండ్రి కేట్టియాపిళ్లై తిరుచురాపల్లి రాజాస్థానంలో పనిచేయగా, ఆయన తరువాత తాయుమానవర్ ఆస్థాన కవిగా నియమితులయ్యారు. అయితే తన గురువు బోధనతో నిత్యం ధ్యానంలో నిమగ్నమవుతు విధులను సక్రమంగా నిర్వహించలేక రాజావారికి పరిస్థితిని విన్నవించాడు, ఆయన ధ్యానం కోసం రాజు కావేరి తీరంలో కుటీరం నిర్మించి ఇచ్చారు. మానవర్ భోగాలను, సుఖాలను కోరలేదు. ఒకసారి రాజు బహూకరించిన శాలువను మార్గంలో చలికి వణుకుతున్న వృద్ధురాలికి కప్పాడు. ఆయన చర్యకు విస్తుపోయిన రాజుతో, 'ఆమె దీనురాలు... అస్పృశ్యురాలు కాదు. నా తల్లి అఖిలాండేశ్వరి అమ్మవారిగా భావించకూడదా?' అని ప్రశ్నించారు. అందరిలోనూ భగవంతుడిని చూచిన ఆయన ఔదార్యానికి రాజు నమస్కరించాడు.

### కథ

## స్థానబలం



కాకుల గుంపులోకి ఒక కొంగ వచ్చి చేరింది. దాంతో కాకులు గుసగుసలాడుకున్నాయి. కొంగ తనజాతిది కానందున కాకులకు ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనం కలిగాయి. కాకులన్నీ తమ జాతి నాయకుడు పెద్ద కాకికి మొరపెట్టుకున్నాయి. “దొర! కొల్లేటి సరసు నుంచి ఒక తెల్ల పక్షి వచ్చి మన భూభాగంలో తిష్ఠ వేసింది. దాంతో మాకు తలనొప్పిగా ఉంది. ఏలిన వారు దానికి తగిన దండన విధించాలని కోరుతున్నాం' అన్నాయి. ఆగ్రహించిన పెద్దకాకి ఆ 'శ్వేత' పక్షిని బంధించాలని ఆజ్ఞాపించింది. మరునాడు కొంగను పెద్ద కాకి ముందు హాజరు పరిచాయి కాకులు.

“ఓ తెల్లదాన! ఈ చోటుమాది. ఎక్కడి దానవో ఎగిరిపో.. పారిపో.. లేకుంటే కఠిన శిక్ష తప్పదు' అని

### పద్యం

ఎరుగ వాని దెలుప నెవ్వడైనను జాలు
నొరుల వశముగాదు ఓగుదెల్ప
యేటివంక దీర్ప నెవ్వరి తరమయా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** తెలుసుకోవాలనే జిజ్ఞాస గలవారికి తెలియజెప్పడం అందరికీ సులభమే. తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్లు అని వాదించేవారికి తెలియజెప్పటం ఎవరి తరం కాదు. ఏటికుండే ప్రకృతి సిద్ధమైన వంపును సరిచేయటం సాధ్యం కానట్లే మూర్ఖుడి కూడా సరిచేయలేము.

### శ్లోకం

వేద మూల మిదం జ్ఞానం
భార్యా మూలం మిదం గృహమ్
కృషి మూలం మిదం ధాన్యం
ధనమూల మిదం జగత్

**భావం :** జ్ఞానం సంపాదించడానికి వేదం, గృహంలో సుఖ శాంతులకు భార్య ఆహార ఉత్పత్తికి వ్యవసాయం ఆధారాలు. అలాగే జీవనానికి ధనం అవసరం.

### జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| కిరీటం | కన్ను |
| చక్షువు | విత్తనం |
| పథం | మకుటం |
| పయోధరము | మార్గం |
| బీజం | మేఘం |

సమాధానాలు : కిరీటం–మకుటం, చక్షువు–కన్ను, పథం–మార్గం, పయోధరము–మేఘం, బీజం–విత్తనం.

నిర్వహణ : నయనశ్రీ

## శాస్త్రవేత్తలు



### వినోద్ ప్రకాశ్ శర్మ

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త. కీటకాలపై అనేక పరిశోధనలు చేశారు. 1969లో దోమలపై పరిశోధనలు చేయడం మొదలుపెట్టారు. దోమల ద్వారా మానవులకు కలిగే వ్యాధులను క్షుణ్ణంగా అధ్యయనం (1969) చేశారు. మలేరియా డెంగ్యూ వ్యాధులపై అనేక పరిశోధనలు జరిపారు. న్యూ ఢిల్లీలో రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేశారు. 1998లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అడిషనల్ డైరెక్టర్‌గానూ పనిచేశారు. ఆయన సేవలకుగానూ కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది.

## జనరల్ నాలెడ్జ్

1. ‘భారతదేశ ఉక్కు మనిషి’ అని ఎవరిని పిలుస్తారు?
2. రెండో ప్రపంచ యుద్ధం ఏ సంవత్సరంలో ముగిసింది?
3. కివీ పండు ఎక్కువగా ఏ దేశంలో పండుతుంది?

సమాధానాలు : 1. సర్దార్ వల్లభభాయి పటేల్, 2. 1945, 3. న్యూజిలాండ్.

## మెదడుకు మేత

కడుపు నిండా
రాగాలు, వంటి
నిండా గాయాలు?

జవాబు : మురళి



హెచ్చరించింది పెద్దకాకి. ‘మీ బెదిరింపులకు పారిపోయేదే లేదు’ అని ఘాటుగా సమాధానమిచ్చింది కొంగ. ఆ జవాబుకు కోపగించిన పెద్ద కాకి దానిపై చర్య తీసుకోవాలని ఆదేశించడంతో కాకులు సామూహికంగా దాడి చేయడంతో కొంగ ప్రాణాలు గాలిలో కలిసిపోయినాయి.

*స్థాన బలిమి గాని తన బలిమి కాదయా*
*విశ్వదాభిరామ వినురవేమ*

–తంగేటి రామారావు

## మంచిమాట

విజయం పొందడానికి
నీకు పెద్ద వనరులు
అవసరం లేదు, నీ మీద
నమ్మకమే గొప్ప వనరు.




# వారఫలాలు

01-07 డిసెంబర్, 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కుటుంబంలో శుభకార్యాలపై నిర్ణయాలు తీసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఇంటి నిర్మాణాల్లో అవాంతరాలు అధిగమిస్తారు. వ్యాపారులకు లాభాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగులకు కీలక సమాచారం అందుతుంది. రాజకీయవేత్తలకు ఆహ్వానాలు రాగలవు. క్రీడా కారులు, సంగీత కళాకారులకు ఊహించని అవ కాశాలు. 2,3 తేదీల్లో శారీరక రుగ్మతలు. కుటుంబంలో సమస్యలు.. శివాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆస్తి వ్యవహారాలలో కొత్త ఒప్పందాలు చేసుకుంటారు. తండ్రి తరఫు వారి నుంచి శుభవార్తలు అందుతాయి. వాహనసౌఖ్యం. వ్యాపారులు అవరోధాలు అధిగమిస్తారు. ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుంది. కళాకారులు అనుకున్న అవకాశాలు దక్కించుకుంటారు. క్రీడాకారులకు గతం కంటే మెరుగైన పరిస్థితులుఉంటాయి. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. ఆదిత్య హృదయం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులకు శుభవార్తలు. కొన్ని వివాదాలు నేర్పుగా పరిష్కరించుకుంటారు. పరిచయాలు విస్తృతమవుతాయి. కాంట్రాక్టులు పొందుతారు. వ్యాపారులు సంస్థలను విస్తరిస్తారు. ఉద్యోగులకు మరింత పురోగతి కనిపిస్తుంది. పారిశ్రామికవర్గాలకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం. 5,6 తేదీలలో స్వల్ప శారీరక రుగ్మతలు. కుటుంబంలో చికాకులు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయం మరింత పెరిగి అవసరాలు తీరతాయి. గతంలో చేజారిన డాక్యుమెంట్లు లేదా ఆభరణాలు తిరిగి దక్కే అవకాశం. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తారు. ఉద్యోగులకు విధులు అనుకూలిస్తాయి. రాజకీయవేత్తలకు ప్రోత్సాహకరమైన సమయం. కళాకారులు, రచయితలకు కాస్త ఊరట. 1,2 తేదీల్లో వృథా ఖర్చులు, బంధువిరోధాలు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఉద్యోగార్థులకు శుభవార్తలు అందుతాయి. ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. దూరప్రాంతాల నుంచి ఉపయుక్తమైన సమాచారం. వ్యాపారులకు తగినంత లాభాలు. ఉద్యోగులకు విధులు ప్రశాంతంగా సాగుతాయి. పారిశ్రామిక వర్గాలకు అన్ని విధాలా అనుకూల సమయం. రచయితలకు విశేషమైన కాలమని చెప్పాలి. 4,5 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. హనుమాన్ చాలీసా పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ప్రస్తుత పరిస్థితులను అధిగమిస్తూ అడుగు ముందుకు వేస్తారు. వ్యాపారులకు పెట్టుబడులకు ఊహించని రీతిలో లాభాలు అందుతాయి. ఉద్యోగులకు పని ఒత్తిడులు తొలగుతాయి. రాజకీయవర్గాలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. క్రీడాకారులు, రచయితలకు వృథా ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. 5,6 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువిరోధాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

బంధువులను కలుసుకుని మరింత ఉత్సాహంగా గడుపుతారు. అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తారు.వ్యాపారులకు లాభాలకు లోటు ఉండదు. ఉద్యోగులకు అనుకోని బాధ్యతలు లభిస్తాయి. రాజకీయవర్గాల సేవలకు విశేష గుర్తింపు రాగలదు. రచయితలు, సంగీత కళాకారులకు గతం కంటే మెరుగ్గా ఉంటుంది. 6,7 తేదీల్లో ధనవ్యయం. శారీరక రుగ్మతలు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆత్మీయుల నుంచి మరింత ఆదరణ లభిస్తుంది. చిన్ననాటి స్నేహితులతో కష్టసుఖాలు పంచుకుంటారు. ఆస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. అనుకున్న రాబడి దక్కి సంతృప్తినిస్తుంది. ఉద్యోగులకు కొత్త అవకాశాలు లభించే సూచనలు. పారిశ్రామిక వర్గాల కృషి ఫలిస్తుంది. రచయితలు, క్రీడాకారులకు మరింత ఉత్సాహం. 2,3 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువిరోధాలు. దేవీస్తుతి మంచిది.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఉపశమనం పొందుతారు. దేవాలయాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు ఉన్నతాధికారుల ఒత్తిడులు తొలగుతాయి. కళాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. పరిశోధకులు, క్రీడాకారులు గందరగోళం నుంచి బయటపడతారు. 1,2 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్యభంగం. ఆంజనేయస్వామి దండకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఇంటి నిర్మాణయత్నాలలో కొంత పురోగతి ఉంటుంది. వ్యాపారులు భాగస్వాముల నుంచి సహాయ సహకారాలు అందుతాయి. ఉద్యోగులకు పనిభారం నుంచి విముక్తి లభిస్తుంది. రాజకీయ వర్గాలకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. రచయితలు, క్రీడాకారులు లక్ష్యాలు సాధిస్తారు 4,5 తేదీల్లో వృథా ఖర్చులు. స్నేహితుల నుంచి ఒత్తిడులు. గణేశాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు, గృహం కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. వ్యాపారులు ఆశించినంత లాభాలు లేక నిరుత్సాహం చెందుతారు. ఉద్యోగులకు మార్పులు ఉంటాయి. కళారంగం వారి కృషి కొంత ఫలిస్తుంది. రచయితలు, సంగీతకళాకారులకు సామాన్యంగా ఉంటుంది. 3,4 తేదీల్లో వాహనయోగం. శుభవార్తలు. విష్ణుధ్యానం చేయండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ప్రముఖులతో పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. ఉద్యోగార్థులకు సంతోషకర సమాచారం అందుతుంది. జీవితాశయం నెరవేరుతుంది. వ్యాపారులకు ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగులకు విధుల్లో గందరగోళం తొలగుతుంది. పారిశ్రామికవర్గాలకు అంచనాలు నిజమవుతాయి. కళాకారులు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 6,7 తేదీల్లో కుటుంబంలో చికాకులు. ఆరోగ్యభంగం. లక్ష్మీ నృసింహస్తోత్రాలు పఠించండి.

నిర్వహణ : ఏఆర్ఆర్ కౌశిక్ 9440966175

# పదరసం-540

## ఆధారాలు

**అడ్డం**

1. నలభీములు ఈ శాస్త్రంలో ప్రవీణులట (2)
3. సంపద, ఐశ్వర్యం (3)
5. ఆకాశం (3)
7. దుస్తులు, వస్తువులను దాచుకునేది (3)
8. నాథుడు చెల్లా చెదరయ్యాడు (3)
9. ఇది పోసిన వాడు నీరు పోయడా! (2)
14. తర్వాత మొలిచిన కొత్త ఆకు (3)
15. అర్జునుడి దశ నామాల్లో ఒకటి (3)
16. పెద్ద వాగు, చిన్న నది (2)
17. మనసు, బుద్ధి (2)
19. అడ్డం పదహారు దాటేందుకు సాధనం (2)
20. పాలు నీరు వేరే చేసే పక్షి (3)
22. చెల్లి... బహువచనంలో (3)
23. సక్రమం కానిది (3)
25. స్వప్నాలే (3)
27. మర్రి చెట్టే (3)
29. వామభాగం (3)
30. యమధర్మరాజును ఇలానూ అంటారు (4)

**నిలువు**

1 రామదాసు గురువు (3)
3. సైన్యం విన్యాసం (3)
4. దంపతులు, ఒక రాశి (3)
5. వ్యవధి, కాలం (3)
6. విష్ణుమూర్తి ఖడ్గం (3)
9. సామెత లాంటిది, జాతీయం (3)
10. దాదాపు, రమారమి (3)
11. జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన రావూరి నవల (5)
12. ఈ పక్షి నలుపైనా మధుర స్వరం (3)
13. కౌశలం, పటుత్వం (3)
16. అసహ్యం, అసూయ (2)
18 దీపమే (2)
19. పలు, అనేక (2)
20. వేసవిలో విరివిగా వచ్చే పూలు (3)
21. రాజులకు రాజు (4)
22. వాగులో నీటి ఊటకోసం తీసే గొయ్యి (3)
24. నిప్పు, అగ్గి (2)
25. చివరి (2)
26. ఒక దుంపకూర (2)
28. కంటకం (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | ■ | 3 | | 4 | ■ | 5 | | 6 |
| ■ | 7 | | | ■ | 8 | | | ■ | |
| 9 | | ■ | | ■ | | ■ | | ■ | |
| | ■ | 10 | ■ | 11 | ■ | 12 | ■ | 13 | ■ |
| | ■ | 14 | | | ■ | 15 | | | ■ |
| ■ | 16 | | ■ | | ■ | | ■ | 17 | 18 |
| 19 | | ■ | 20 | | | ■ | 21 | ■ | |
| | ■ | 22 | | | ■ | 23 | | 24 | ■ |
| ■ | 25 | | | ■ | 26 | ■ | 27 | | 28 |
| 29 | | | ■ | 30 | | | | ■ | |

## పదరసం - 539 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 అం | ట | ■ | 2 శు | ల్కం | ■ | 3 త్రి | శూ | 4 లం | ■ |
| దె | ■ | 5 కుం | భం | ■ | 6 బా | పు | ■ | 7 క | 8 ను |
| 9 శ్రీ | 10 మ | తి | ■ | 11 బా | స | ర | ■ | ■ | సి |
| ■ | హ | ■ | 12 కా | డు | ■ | ■ | 13 దై | 14 వం | ■ |
| 15 స | తి | ■ | 16 ప | గ | 17 తు | 18 రు | ■ | 19 ద | రి |
| హో | ■ | 20 స | రి | ■ | 21 న | జ | 22 రా | నా | ■ |
| 23 ద | ప్పి | క | ■ | 24 కా | క | ■ | 25 బ | లు | 26 సు |
| రి | ■ | 27 లం | 28 కా | ■ | ■ | 29 బ | డి | ■ | ర |
| ■ | 30 క | ■ | 31 ల | డ్డు | ■ | మ్మె | ■ | 32 అ | భి |
| 33 న | డ | వ | డి | ■ | 34 చె | ర | సా | ల | ■ |




# రీమేక్స్‌కు శుభం కార్డు పడబోతోందా!?

**ఒకప్పుడు తెలుగు సినిమా రంగంలో రీమేక్ అంటే టేబుల్ ప్రాఫిట్‌గా నిర్మాతలు భావించేవారు. అప్పటికే సక్సెస్ అయిన సినిమాను తిరిగి తీస్తున్నామంటే... కచ్చితంగా విజయం సాధిస్తామని, మాతృకలోని లోపాలను సవరించే ఆస్కారం ఉంటుంది కాబట్టి తమ చిత్రం అంతకు మించిన విజయాన్ని అందుకుంటుందని నమ్మేవాళ్లు. వాళ్ల నమ్మకాన్ని నిజం చేస్తూ ప్రేక్షకులు అలా కొన్ని సినిమాలకు ఘన విజయాలను కట్టబెట్టారు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. ఎవరైనా ఫలానా సినిమా రీమేక్ చేద్దామని అనుకుంటున్నాం అనగానే... ఎందుకు ఓటీటీలో చూసేశాం కదా... ఇప్పుడది రీమేక్ చేయడం అవసరమా? అనే ప్రశ్న ఉదయిస్తోంది.**

తెలుగునాట ఒకప్పుడు టాప్‌స్టార్స్‌గా వెలిగిన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున, మోహన్‌బాబు వంటివారు రీమేక్స్‌తో బ్లాక్ బస్టర్స్ చూశారు. కానీ, ఇప్పుడు ఆ ముచ్చట లేదు... అందుకు ఓటీటీలే కారణమని చెప్పక తప్పదు... 'ఓవర్ ద టాప్' అందుబాటులోకి రావడం, అందులో స్ట్రీమింగ్ అయ్యే సినిమాలకు సబ్ టైటిల్స్ ఉండడం... లేదా కాస్తంత పేరున్న పరభాషా చిత్రాలను తెలుగులో డబ్ చేసి స్ట్రీమింగ్ చేయడం వల్ల మన నేలపై రీమేక్స్‌కు కాలం చెల్లిందనే చెప్పాలి.

రీమేక్స్‌తో బంపర్ హిట్స్ అందుకున్న స్టార్ హీరోలు తెలుగులో చాలామందే ఉన్నారు. అప్పటి స్టార్ హీరోలు ఏడాదికి ఆరేడు సినిమాలు చేస్తుండటం వల్ల వాళ్ల కోసం కొత్త కథలను తయారు చేయడం కష్టంగా ఉండేది. దాంతో చాలామంది నిర్మాతలు పరభాషా చిత్రాల హక్కులు రీమేక్స్ చేసేవారు. ఆ సినిమా వేరే భాషలో అప్పటికే విజయవంతం కావడంతో హీరోలు అంగీకారం తెలిపేవారు. తమ డేట్స్ ఉండి, కథ సిద్ధం కాకపోతే, ఏదో ఒక పరభాషా చిత్రాన్ని సూచించి, రీమేక్ హక్కులు తీసుకోవాలని నిర్మాతలను ప్రోత్సహించేవారు.

చిరంజీవి కెరీర్‌లో "ఘరానా మొగుడు, హిట్లర్, ఠాగూర్, ఖైదీ నంబర్ 150" వంటి బంపర్ హిట్స్ రీమేక్స్ ద్వారానే లభించాయి. బాలకృష్ణకు అప్పట్లో వరుసగా గోల్డెన్ జూబ్లీస్ చూపించిన "మంగమ్మగారి మనవడు, ముద్దుల మావయ్య" ఆ తరువాత వచ్చిన 'లక్ష్మీనరసింహా' వంటివన్నీ రీమేక్సే. నాగార్జున కెరీర్‌లోనే స్పెషల్‌గా నిలిచిన 'నువ్వు వస్తావని' రీమేక్! అంతకు ముందు "విక్రమ్, వారసుడు, కిరాయిదాదా" వంటి విజయవంతమైన సినిమాలు రీమేక్స్ కావడం గమనార్హం. వెంకటేశ్ కెరీర్‌లో "చంటి, రాజా, సూర్యవంశం" వంటి సూపర్ డూపర్ హిట్స్ రీమేక్స్ ద్వారా లభించినవే. 'దృశ్యం' సిరీస్ కూడా ఆయనకు బాగానే కలిసి వచ్చింది. ఇక మోహన్‌బాబు కెరీర్ లోనే బిగ్ హిట్‌గా నిలిచిన 'పెదరాయుడు' రీమేక్ కావడం విశేషం!

పవన్ కళ్యాణ్ సైతం రీమేక్ సినిమాలను బాగానే చేశారు. ఆయన నటించిన 'గోకులంలో సీత, సుస్వాగతం, అన్నవరం, తీన్‌మార్, గబ్బర్ సింగ్' అన్నీ రీమేక్సే. చిత్రం ఏమిటంటే సెకండ్ ఇన్నింగ్స్‌లో పవన్ కళ్యాణ్ వరుసగా మూడు రీమేక్స్ చేశారు. 'వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో' సినిమాలు. అయితే ఇవేవీ గొప్పగా ఆడలేదు. అందుకే పవన్ కళ్యాణ్‌తో హరీశ్ శంకర్ 'తేరి' మూవీని 'ఉస్తాద్ భగత్ సింగ్' పేరుతో రీమేక్ చేయాలని అనుకున్నప్పుడు అభిమానులు గట్టిగా నిరసన తెలిపారు. అయితే హరీశ్ ఆ కథను తనదైన శైలిలో రీ-ప్రజెంట్ చేస్తానని హామీ ఇచ్చారు.

గతంలో యేడాదికి పాతిక పైగా సినిమాలు రీమేక్ అవుతుండేవి. అందులో అత్యధిక భాగం తమిళ చిత్రాలు ఉండేవి. కానీ ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. కరోనా తర్వాత ఓటీటీకి అలవాటు పడిన జనాలు అందులోనే డబ్బింగ్ వర్షన్ చూసేస్తున్నారు. ఒకసారి ఏ భాషా చిత్రాన్ని అయినా ఓటీటీలో చూశాక రీమేక్ వర్షన్ థియేటర్‌లో చూడానికి ఆసక్తి చూపడం లేదు. దాదాపు ఏడెనిమిది ఏళ్ల క్రితం వచ్చిన పరభాషా చిత్రాలను మాత్రమే రీమేక్ చేశారు. అందులో నాగార్జున నటించిన 'నా సామి రంగ' ఒకటి. అది 'పోరింజు మరియం జోస్' (2019) అనే మలయాళ చిత్రానికి రీమేక్. 2019లో వచ్చిన మలయాళ చిత్రం 'మనోహరం'ను గత ఏడాది తెలుగులో 'మస్త్ షేడ్స్ ఉన్నాయిరా' పేరుతో రీమేక్ చేశారు. రవితేజ హీరోగా నటించిన' మిస్టర్ బచ్చన్' హిందీ సినిమా 'రైడ్' (2018)కు రీమేక్. ఇలా గత సంవత్సరం చేతి వేళ్ల మీద లెక్కించే సినిమాలే రీమేక్ అయ్యాయి. మీడియం బడ్జెట్‌లో రూపుదిద్దుకున్న మలయాళ చిత్రాలను రెండు మూడేళ్ల క్రితం మన యంగ్ హీరోలు రీమేక్ చేశారు కానీ అవి కూడా ఏమంత గొప్పగా ఆడలేదు. దాంతో సొంత కథలతో ప్రయోగం చేసుకోవడమే బెటర్ అనే ఆలోచనకు వాళ్లు వచ్చేశారు. పైగా సొంత కథలతో సినిమాలు చేస్తే... తెలుగులో థియేట్రికల్ రిలీజ్ చేసి, మిగిలిన భాషల్లో డబ్ చేసి ఓటీటీ హక్కులు అమ్ముకోవచ్చని భావిస్తున్నారు లేదంటే ఇతర రాష్ట్రాలతోనూ అనుబంధం ఉన్న నిర్మాతలు తెలుగుతో పాటు ఒకేసారి రెండు మూడు భాషల్లో సినిమాలను డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. ఈ కారణంగా రాబోయే రోజుల్లో 'రీమేక్' అనే మాట వినిపించకపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.300/-




వెల : ₹.100/-




వెల : ₹.400/-




వెల : ₹.300/-




వెల : ₹.60/-




వెల : ₹.250/-




వెల : ₹.50/-




వెల : ₹.200/-




వెల : ₹.45/-




వెల : ₹.500/-




వెల : ₹.899/-




వెల:₹.350/-




వెల :₹.450/-




వెల : ₹.500/-




వెల : ₹.125/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 07


# MITS MADANAPALLE

# MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE

## DEEMED TO BE UNIVERSITY

(under section 3 of UGC Act, 1956 by Govt. of India - MoE)

Celebrating 27 Years Academic Excellence

www.mits.ac.in

Madanapalle-517325, Annamayya Dist., Andhra Pradesh, India.

Estd: 1998

AICTE Approved INSTITUTE

NATIONAL BOARD OF ACCREDITATION CIVIL, CSE, CST, ECE, EEE, MECH, MBA & MCA

MITS ranked in the band 201-300 - NIRF 2025

UGC 2(f) & 12 (B)

Accredited By NAAC A+ Grade

ISO 21001: 2018 Certified



## COURSES OFFERED

### UG Programs

B.Tech - Civil Engineering (CIV)
B.Tech - Computer Science & Engineering (CSE)
B.Tech - Computer Science & Engineering (Artificial Intelligence)
B.Tech - Computer Science & Engineering (AI & ML)
B.Tech - Computer Science & Engineering (Data Science)
B.Tech - Computer Science & Engineering (Cyber Security)
B.Tech - Electronics & Communication Engineering (ECE)
B.Tech - Electrical & Electronics Engineering (EEE)
B.Tech - Mechanical Engineering (MEC)

### PG Programs

M.Tech-Computer Science & Engineering
M.Tech-VLSI Design & Embedded Systems

Master of Business Administration
(MBA) (Eligibility: 10+2+3/4)

Master of Computer Applications
(MCA) (Eligibility: 10+2+3)

## MoUs with Foreign Universities

**European Universities**
UNIVERSITY OF APPLIED SCIENCES UPPER AUSTRIA
BRNO UNIVERSITY OF TECHNOLOGY

**Japan Universities**
AIZU THE UNIVERSITY OF AIZU
一関工業高等専門学校
岩手県立大学 Iwate Prefectural University

**South Korea Universities**
부산대학교 PUSAN NATIONAL UNIVERSITY
KMU 국민대학교 KOOKMIN UNIVERSITY

**Taiwan Universities**
靜宜大學 Providence University
亞洲大學 ASIA UNIVERSITY

**US Universities**
BGSU Bowling Green State University

## The Journey So far

- "Rated as 'GOLD' Category by AICTE - CII Survey of Industry - Linked Technical Institutes."
- "206+ faculty members with PhDs from foreign universities and Indian premier Institutes."
- "Most of the faculty members have industry experience."
- "Graded as 'AAAA' by Careers 360."
- "MoUs with industries for Academic and Scientific Collaboration."
- "State-of-the-art Learning Management System through Moodle."
- "MOOCs aligned with Curriculum."
- "Siemens "Technical Skill Development Institution" sanctioned by Govt. of AP."
- "Foreign Language Training by experts in Japanese, German, French & Spanish."
- "Consistently achieving "AAA" Grade from NPTEL during the years 2015, 2016, 2017, 2018, 2019, 2022, 2023, 2024 & 2025 for the academic excellence."
- "Member in several professional bodies like IEEE, ISTE, CII, IUCEE, AIMA etc.,"
- "MITS is a Cambridge exams Preparation center."
- "DST-funded" incubation centre for startups under Section 8 of the Companies Act, 2013."
- "60 Students selected from MITS for "UIF Program" of Stanford University, USA."
- "Exemplary assistance to students to receive scholarship grants from various government and private authorities."
- "2,345 SCI/Scopus reputed research Publications."
- "Total Patents: 212, Published: 139, Granted:73, Copyright :06, Trademark: 03."



**Dr. N. Vijaya Bhaskar Choudary**
Founder & Chancellor

Follow Us:

**2962** Placement Offers

CAMPUS PLACEMENTS
2023 - 24 & 2024 - 25 Passed Out Batch

**2124** Students Placed
Till Date....

accenture, Cognizant, TCS TATA CONSULTANCY SERVICES, LTIMindtree, FinBox, KEWAUNEE, wipro, Infosys, YASH, SBI general, Broadridge, Tech Mahindra, HEXAWARE, ZEN, Capsitech, IBM, Knowledge Lens, AKODIS, Vingsfire, Deloitte., JLL, LUMEN, Regami solutions, recruit crm, arth, ZOHO, Infobell, WILEY EDGE, UTS, MC M.Core Technologies Pvt. Ltd., PEOPLE TECH GROUP

**For Admissions Contact:**
+91 8712655132, +91 8712655134, +91 8712655138, +91 9100601116


Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01